

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 78 • పేజీలు:12+16 • వెల: రూ.5 | శుక్రవారం • 16-2-2018 | www.manamnews.com | /manamnews



నీరవ్‌పై ఈడీ కేసు

సీబీఐకి అందిన ఫిర్యాదుల ఆధారంగా నమోదు

17 ప్రదేశాల్లో ముమ్మర తనిఖీ

5,100 కోట్ల విలువైన వజ్రాలు.. నగలు.. బంగారం స్వాధీనం

ముంబైలో కుటుంబానికి చెందిన ఐదు ఆస్తులకు అధికారుల సీల్

7లో..

రక్షణ బడ్జెట్‌లో ఐదో స్థానం

బ్రిటన్‌ను అధిగమించిన భారత్

తొలినాలుగు స్థానాల్లో ... అమెరికా, చైనా, సౌదీ అరేబియా, రష్యా



ఏఐబీపీకి ఎంపికైన పదకొండులో

రెండు ప్రాజెక్టులు పూర్తి

జూన్ 2018కల్లా మరో ఆరు పూర్తి చేస్తాం

దేవాదులకు రూ. 450 కోట్లు, భీమాకు రూ. 35 కోట్లు విడుదల చేయాలి

- పట్టిసీమలో తెలంగాణ హక్కు 45 టీఎంసీలు
- బ్రిజేష్ ట్రిబ్యునల్ తుది తీర్పు తర్వాతే కృష్ణా బోర్డు పరిధి ఖరారు చేయండి
- కేంద్ర జలవనరుల శాఖ సమావేశంలో రాష్ట్ర మంత్రి హరీశ్ రావు



కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌తో హ రీశ్ రావు, రాష్ట్ర నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15, మనం ప్రత్యేక ప్రతినిధి : ఏఐబీపీ కింద తెలంగాణ నుంచి ఎంపికైన 11 ప్రాజెక్టుల్లో ఇప్పటికే రెండు ప్రాజెక్టులు పూర్తయ్యాయని తెలంగాణ ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు తెలియజేశారు. మరో ఆరు ప్రాజెక్టులు జూన్ 2018కి పూర్తికానున్నాయని వెల్లడించారు. 2019 మార్చి నాటికి మిగిలిన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డు తర్వాతే ఎఫ్ఆర్ బిఎం పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకురావాలని హరీశ్‌రావు కోరారు. అప్పుడే రాష్ట్రాలకు కేటాం యించిన నీటిని విజయవంతంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. గురువారం ఇక్కడ కేంద్ర జలవనరుల సంఘ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిన పట్టిసీమ ప్రాజెక్టులో తెలంగాణాకు 45టీఎంసీల హక్కు ఉందని వాదించినట్టు హరీష్ తెలిపారు. సమావేశం అసంపూర్తిగా ముగిసిందని, వచ్చే సమావేశంలోనైనా స్పష్టత వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు కేంద్ర మంత్రులు గడ్కరీ, హర్షవర్ధన్‌లను ఆహ్వానించామని మంత్రి తెలిపారు. ఆర్థిక సహాయం చేయాలని గడ్కరీని కోరినట్టు హరీశ్ వివరించారు. క్యాడ్వామ్ కింద అడిగిన వెయ్యి కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అందులో దేవాదులకు కేటాయించిన రూ. 450 కోట్లు, భీమా ప్రాజెక్టుకు రావాల్సిన రూ. 35కోట్ల రూపాయలను వెంటనే విడుదలచేయాలని కోరినట్టు చెప్పారు. ఎఫ్ఆర్‌బిఎం పరిధిలోకి రాకుండా నాబార్డు ద్వారా రాష్ట్రాలకు నిధులిచ్చినప్పుడే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లక్ష్యాలను చేరవచ్చని తాను వివరించానని మంత్రి హరీశ్ రావు తెలిపారు. అప్పుడే ప్రాజెక్టులు మిగతా 6లో..



అరుణ్ జైట్లీకి బొకే ఇస్తున్న కేసీఆర్

నిధులివ్వండి

అరుణ్ జైట్లీని కోరిన సీఎం కేసీఆర్

ఎయిమ్స్, ఐఐఎమ్ మంజూరు చేయండి

'ప్రత్యేక' కేటాయింపులు చేయాలని విన్నపం

మనం ప్రతినిధి, హైదరాబాద్ :

విభజన చట్టంలో పేర్కొన్న విధంగా తెలంగాణకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కోరారు. గురువారం సాయంత్రం ఢిల్లీలో అరుణ్ జైట్లీని ఆయన కలుసుకున్నారు. గతంలో ఇచ్చిన హామీల మేరకు తెలంగాణకు ఎయిమ్స్, ఐఐఎమ్ మంజురు చేయాలని ఆర్థిక మంత్రిని కోరారు. ఎయిమ్స్ ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన స్థలాన్ని ఇవ్వడంతో పాటు, మౌలిక వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు కేసీఆర్ తెలిపారు. ఐఐఎంను ఇస్తామని గతంలో మంత్రి స్మృతి ఇరానీ హామీ ఇచ్చారని , ఆ ప్రకారం ఆ సంస్థను మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి చట్టంలో పేర్కొన్న విధంగా వెనుకబడిన జిల్లాలకు వరసగా మూడేండ్ల పాటు ఏటా 450 కోట్లు చొప్పున విడుదల చేశారని సీఎం తెలిపారు. అదే విధంగా 2017 ఆర్థిక మిగతా 6లో..

ఇదీలోకం!



గిట్టుబాటుకు చట్టం చేయాలి

రైతు నెత్తిన 4 లక్షల అప్పు.. అత్యధికంగా ప్రైవేటువే

- వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితి
- రుణవిముక్తిని హక్కుగా చేయాలి
- కిసాన్ ముక్తి సదస్సులో వక్తలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): రైతు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గిట్టుబాటు ధర చట్టం చేయాలని తెలంగాణ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. ఏఐకేఎస్‌సీసీ మిగతా 6లో..



రైతు సదస్సులో నేతల అభివాదం

• **కట్టె పట్టాను... ఖబడ్దార్..!**



కర్రసాము చేసి జనసేవాదళ్ శిక్షణను ప్రారంభించిన దాడ

3లో..

మతోన్మాద శక్తులకు ఎదురొడ్డాలి

• **జనసేవాదళ్ శిబిరం ప్రారంభోత్సవంలో చాడ వెంకటరెడ్డి పిలుపు**



6లో..

విద్యార్థి ఘాతుకం

హైస్కూల్లో విచ్చలవిడిగా కాల్పులు

17 మంది మృతి.. వారిలో పిల్లలు, టీచర్లు

గ్యాస్ మాస్క్ ధరించి.. పొగబాంబు

ఫైర్ అలారం మోగించి పిల్లలకు ఎర

బయటకు రాగానే వారిపై కాల్పులు

స్కూలు నుంచి బహిష్కరణే కారణమా?

అమెరికాలో మళ్లీ తుపాకి సంస్కృతి

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథిః పాడ్యమి తె.3.57 తదుపరి విదియ; నక్షత్రం: ధనిష్ఠ ఉ.9.40 తదుపరి శతభిషం; వర్జ్యం: సా.5.24 – 7.07; దుర్ముహూర్తం: ఉ.9.04 – 9.50, మ.12.53 – 1.39; రాహుకాలం: ఉ.11.04 – 12.30; అమృతఘడియలు: రా.10.22 – 12.06; శుభసమయం : మ.1.40–3.00;

సూర్యోదయం: 6.46,

సూర్యాస్తమయం: 6.15

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. చలిగాలుల తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. గంటకు 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 43 శాతం

ఆర్టీసీలో ఆందోళన!

ఉద్యమాలకు సిద్ధమవుతున్న ఉద్యోగులు

19న నిరాహారదీక్షలు.. 22న చలో బస్‌భవన్‌కు పిలుపు



హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ) పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. ఇంధన పొదుపు, ప్రమాదాల నివారణ, తదితర అంశాల్లో కొన్నేండ్లుగా దేశంలోనే ఉత్తమ ప్రజా రవాణా సంస్థగా నిలుస్తున్నా, నష్టాల బారి నుండి సంస్థ బయటపడడంలేదు. ఇందుకు ప్రభుత్వాల ఉదాసీనతే కారణమని కార్మికులు ఆరోపిస్తున్నారు. సంస్థను కాపాడాలని, తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు.

నిత్యం లక్షలాది మందిని సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుస్తున్న సంస్థను పరిరక్షించాలన్న నినాదంతో ధర్నాలకు, నిరాహార దీక్షలకు పలు ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. మూడేండ్లుగా బడ్జెట్‌లో కేటాయింపులు చేసి, విడుదల చేయకుండా ఉండిపోయిన నిధులతో కలిపి 2018–19 బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు ఆర్టీసీకి కేటాయించి సంస్థను ఆదుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) మిగతా 6లో..



'క్షుద్ర' మానవులు!

వీడిన చిలుకానగర్ నరబలి మిస్టరీ

రెండేండ్ల కిందటే అమానుషానికి బీజం

అసలు నిందితులు రాజశేఖర్.. శ్రీలత

శిశువు తలతో దంపతుల నగ్నపూజలు

హైదరాబాద్/ఎల్బీనగర్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్):

హైదరాబాద్ నగరం ఉప్పల్ పరిధిలోని చిలుకానగర్ నరబలి ఉదంతానికి రెండేళ్ల కిందటే బీజం పడిందా? కోయదొర కో(కూ)తలు నమ్మి అభంశుభం తెలియని పసిపాపను అమానుషంగా బలి ఇచ్చేశారా? శాస్త్ర–సాంకేతిక పరిజ్ఞానం అంత రిక్షపు అంచులు చూస్తున్న ఈ రోజుల్లోనూ ఇంత మూఢత్వమా? నగ్న దేహాలతో క్షుద్రపూజలు చేస్తే రోగాలు తగ్గిపోతాయా?... జనవరి 31వ తేదీన వెలు గుచూసిన ఈ ఉదంతంలో పోలీసుల ముమ్మర శోధన అనంతరం వెల్లడైన వాస్తవాలు విన్న వారందరిలోనూ మెదిలిన సందేహాలివి. ఈ కేసులో నిందితు లందర్నీ అరెస్టు చేసిన నేపథ్యంలో రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ గురువారం విలేకరులకు వెల్లడించిన వివరాలు అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తాయి. కేసు నమోదు చేసిన తర్వాత మొత్తం 122 ఫోన్లు, 54 సెల్ టవర్ల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించారు. దీంతోపాటు 100 సీసీ కెమెరాల్లోని దృశ్యాలను మిగతా 6లో..

చివరి బస్తా.. మేమే కొంటాం

- **ఎర్రజొన్న రైతులు ఆందోళన చెందొద్దు**
- **ఎంపీ కవిత, మంత్రి పోచారం విజ్ఞప్తి**
- **19 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల రైతులు పండించిన ఎర్రజొన్నల్లో చివర బస్తానూ ప్రభుత్వమే కొంటుందని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నిజామాబాద్ ఎంపీ కవిత రైతులకు హామీ ఇచ్చారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని పంటలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తారని తెలిపారు. ఎర్రజొన్నలను కొనడానికి వ్యాపారస్తులు ముందుకు రావడం లేదని ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి సీఎం దృష్టి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన కేసీఆర్ ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. సోమవారం నుంచి 3 జిల్లాల్లోనూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. 2014 కంటే ముందు రాష్ట్రంలో ఇదే పరిస్థితి ఉండేదని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసగించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇవ్వాల్సిన రూ. 12 కోట్ల బకాయిలను టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినాక చెల్లించామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలోనూ ఎర్రజొన్న పండిస్తున్నారని, కానీ అక్కడ మద్దతు ధర కేవలం రూ. 1600 మాత్రమే ఉందన్నారు. కానీ క్వింటాళ్ ఎర్రజొన్నలకు రూ. 2300 మద్దతుధర ప్రకటించిన టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికో6 నీతి... మాకో నీతా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ రైతుల పక్షపాతి అని, రైతుల కష్టాలను పట్టించుకునే ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. మంత్రి హరీష్‌రావు, ఎంపీ కవిత ప్రభుత్వమే ఎర్రజొన్నలు కొంటం అని ప్రకటన చేసిన తర్వాత కూడా ఇలా రైతులతో దీక్ష చేయించడం సబబు కాదన్నారు. గత పదేండ్ల కాంగ్రెస్ పాలనలో కనీసధర ఎందుకు ఇప్పించలేకపోయిందని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని ఉంటే రైతులకు ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. గతంలో వరంగల్‌లో కాంగ్రెస్ సభ నిర్వహించిన సందర్భంలో సోనియాగాంధీ మాట్లాడుతూ... మద్దతు ధరలు నిర్ణయించేది రాష్ట్ర ప్రభుత్వం కాదని, ధరల విషయం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయన్నారని, కానీ ఇప్పుడు అదే కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడం ఎంత వరకు సమంజమమో చెప్పాలన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. కచ్చితంగా టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఆదుకుంటుందని తెలిపారు. రాజీకీయం కోసమే కాంగ్రెస్ నాయకులు ఇదంతా చేస్తున్నార ని వారిని నమ్మొద్దన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వమే ఎర్రజొన్నలు కొనుగోలు చేస్తుందని తెలిపారు. 2007లో మద్దతు ధర అడిగిన రైతులపై గత ప్రభుత్వం కాల్పులు జరిపినప్పుడు కేసీఆర్ హామీ ఇచ్చిన విధంగానే ఇప్పుడు ధర పెంచి మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు.



మీడియా సమావేశంలో ఎంపీ కవిత, పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



ఆర్మూర్‌లో రైతుల ఆమరణ నిరాహార దీక్ష

- **పసుపు, ఎర్రజొన్న మద్దతు ధరకు డిమాండ్**

నిజామాబాద్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): పసుపు, ఎర్ర జొన్న పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద 20 మంది రైతులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని 12 మండలాలకు చెందిన సుమారు 2 వేల మంది గురువారం ఆందోళనకు దిగారు. తొలుత రైతులు ఆర్మూర్ మామిడిపల్లి చౌరస్తా నుంచి ఆర్మూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. పసుపు, ఎర్ర జొన్నలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పసుపుకు రూ.10 వేలు, ఎర్ర జొన్నకు రూ.4 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చే హామీలను పట్టించుకోమని, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన ఇచ్చే వరకు దీక్ష విరమించేది లేదని రైతులు చెప్పారు. దీక్షా శిబిరం వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

28న హైదరాబాద్‌కు చంద్రబాబు రాక

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లో తెలంగాణ టీటీపీ నేతలతో భేటి కానున్నారు. ఈ మేరకు టీడీపీ పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులతో గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, స్థానిక సమస్యలతో పాటు పలు అంశాలపై 28న జరిగే భేటిలో ఆయన చర్చిద్దామని పార్టీ నేతలకు చెప్పారు.

17 నుంచి ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సెపక్ తక్రా 2017-18 చాంపియన్‌షిప్‌ను ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): శాసన మండలిలో కాంగ్రెస్ పక్ష నాయకుడు షబ్బీర్ అలీ గురువారం 61వ జన్మదినోత్సవం జరుపుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద జరిగిన వేడుకల్లో భాగంగా అభిమానుల సమక్షంలో షబ్బీర్ అలీ పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పాతబస్తీకి తాయిలాలు కాదని, నిజమైన అభివృద్ధి కావాలన్నారు. మెట్రో రైల్‌ను ఓల్డ్ సిటీ నుంచి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేసీఆర్ డ్రామాలు ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లతో ఎంతో మంది ముస్లిం యువత లబ్ధి పొందారన్నారు. పలువురు అభిమానులు, నేతలు షబ్బీర్ అలీకి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. కాగా, తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని గ్రేటర్ కాంగ్రెస్ అధ్యక్షుడు దానం నాగేందర్ స్పష్టం చేశారు.

ప్రజలకు మీరేం చేశారో చెప్పండి

- **అబద్ధాలతో పుట్టిన పార్టీ టీఆర్ఎస్**
- **కాంగ్రెస్ అధికార ప్రతినిధి రమేష్**

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీకి ఓట్లడిగే హక్కులేదంటున్న హరీశ్ రావు.. టీఆర్ఎస్‌కు ఎందుకు ఓటేయాలో చెప్పాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రజల కోసం టీఆర్ఎస్ పార్టీ ఏంచేసిందో చెప్పాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ప్యాట రమేష్ కోరారు. ఈమేరకు గురువారం నాడు గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అబద్ధాలతో పుట్టిన పార్టీ టీఆర్ఎస్ అని, దళితుడినే ముఖ్యమంత్రి చేస్తామని చెప్పి ప్రజలను మోసంచేశారని రమేష్ ఆరోపించారు. ప్రస్తుతం టీఆర్ఎస్‌లో ఉద్యమ ద్రోహులే ఉన్నా రని విమర్శించారు. రేషన్ షాపులను సామాన్యులకు అందుబాటులో లేకుండా చేశారని మండిపడ్డారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల మాటే మరిచిపోయారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతి పారుతోందని, సిరిసిల్లలో ఆత్మహత్యలు కొనసాగుతున్నా మంత్రి కేటీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజాప్రతినిధులకు అభివృద్ధి నిధులు లేకుండా చేశారని చెబుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని రమేష్ స్పష్టం చేశారు.

కోదండరాం పార్టీకి మద్దతిస్తాం

- **ఈ నెల 18న బహిరంగ సభ**
- **ప్రజాతెలంగాణ కన్వీనర్ గాదె ఇన్నయ్య**

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): తెలంగాణ మలిదశ ఉద్యమ పోరాటంలో కీలకంగా వ్యవహరించిన కోదండరాం వెన్నంటే తాము ఉంటామని ప్రజా తెలంగాణ కన్వీనర్ గాదె ఇన్నయ్య పేర్కొన్నారు. ఈమేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఉప్పు సంతోష్‌తో కలిసి మాట్లాడుతూ.. ప్రజా తెలంగాణ, సామాజిక తెలంగాణ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18న హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ బహిరంగ సభకు అన్ని పార్టీల అగ్రనేతలు హాజరవుతారని చెప్పారు. రాజ్యాంగ హక్కుల సాధన కోసం బహుజనులంతా చైతన్యం కావాలని ఇన్నయ్య పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంత పరిపాలన చేస్తున్నరని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం టీజేఏసీ చైర్మన్ కోదండరాం పెట్టే పార్టీకి సంపూర్ణ మద్దతిస్తామని చెప్పారు.

కారుణ్యంపై ఆశలు అడియాసేనా?

సీఎం హామీలు అమలయ్యేదెన్నడో.. కసరత్తుతో సరి.. ఎదురుచూపులతోనే హరి


- **సింగరేణిలో కారుణ్య నియామకాలపై చర్చ**
- **నెలలు గడుస్తున్నా అతీగతీ లేదు**
- **ప్రత్యామ్నాయంగా రూ.75 లక్షలు**
- **తెరపైకి మరో కొత్త ప్రతిపాదన**
- **ఆందోళన బాటలో కార్మిక సంఘాలు**
- **మార్చివరకు యాజమాన్యానికి గడువు**
- **ఆపై సమ్మె తప్పదని హెచ్చరిక**



హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): ఎదురుచూపులతోనే రిటైర్‌మెంట్ దగ్గరపడ్తోంది. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీపై పెట్టుకున్న ఆశలు అడియాశలుగా మారుతున్నాయి. గుర్తింపు సంఘమైన టీబీజీకేఎస్ పట్టించుకోవటంలేదు, మిగిలిన కార్మిక సంఘాలేమో నామమాత్రపు ఆందోళనలతో సరిపెటుకుంటున్నాయి. రిటైర్‌మెంట్ రోజులు దగ్గరపడ్తున్న కొద్దీ ఆందోళన మొదలవుతోందని సింగరేణి బొగ్గు బాయి కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు ముందు.. సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులను సరిహద్దుల్లోని సైనికులతో పోల్చారు. వారు దిగిపోతే వారసులకు ఉద్యోగాలిచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కారుణ్య నియామకాల ద్వారా వారసత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇవన్నీ చెప్పి నెలలు గడుస్తున్నా ఆ పథకం అతీగతీ లేకుండా పోయింది. 2017లో జారీచేసిన వారసత్వ ఉద్యోగాల ఉత్తర్వుల ప్రకారం అర్హత సాధించిన వారిలో నెలకు దాదాపు 300 మంది చొప్పున రిటైర్ అవుతున్నారు. గత ఏడాదిలో 3,704 మంది వరకు దిగిపోగా, ఈ ఏడాది దిగిపోయే కార్మికుల సంఖ్య మరింతగా ఉంది. 2020లో అత్యధికంగా 8 వేల మందికిపైగా ఉద్యోగ విరమణ పొందేవారున్నారు. రెండేండ్ల అర్హత పెడితే ఈ ఏడాది, వచ్చే సంవత్సరం ఉద్యోగ విరమణ పొందేవారంతా నష్టపోయే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో విస్తరించిన సింగరేణి బొగ్గు బాయిల్లో ఎక్కడ చూసిన కారుణ్య నియామకాలపైనే చర్చ సాగుతోంది. పథకం అమలు ఉత్తర్వులు ఎప్పుడు వస్తాయని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

చేయలేక.. మానలేక..

సుదీర్ఘ కాలంగా బొగ్గుబాయిలోకి దిగడం, పైకెక్కడం చేస్తుండడంతో కార్మికులలో ఎక్కువ శాతం మంది మోకాళ్ల నొప్పులతో బాధపడ్తున్నారు. వారసత్వ ఉద్యోగాలుంటే దిగిపోయే వారే.. ఈ క్రమంలో సీఎం చెప్పిన కారుణ్య నియామకాల పథకం కోసం ఎదురుచూస్తున్నారు. ఆ పథకం వస్తే వారసులకు ఉద్యోగం వస్తది, కుటుంబం బాగుంటుం దని ఆశపడ్తున్నారు. యాజమాన్యం 2017 జనవరి 1 నుంచి 48-58 ఏండ్లలోపు వయసు గల కార్మికులు వారసత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. దీంతో కార్మికుల్లో ఆశలు చిగురించాయి. వారసత్వ ఉద్యోగాలు రద్దైన నేపథ్యంలో సీఎం కేసీఆర్ హామీ కార్మికులలో కొత్త ఆశలు రేపింది. ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న కార్మికులు సింగరేణిలో దాదాపు 3,500 మందికిపైగా ఉంటారు. సీఎం ఇచ్చిన హామీల అమలు కోరుతూ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ సంఘాలు ఇప్పటికే సమ్మె నోటీస్‌ను ఇచ్చాయి. ఈ నేపథ్యంలోనే డీప్యూటి సీఎల్సీ వద్ద కార్మిక సంఘాలు, యాజమాన్యంతో చర్చలు జరిగాయి. డిమాండ్ల అమలుకోసం యాజమాన్యానికి మార్చి నెలవరకు గడువునిచ్చాయి. ఈ లోపు సమస్యలపై స్పందన రాకపోతే సమ్మె చేస్తామని ఆయా సంఘాల నేతలు హెచ్చరించారు.



సుప్రీందాకా వెళ్లినా..

సింగరేణిలో 1998లో రద్దయిన వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరిస్తున్నట్లుగా 2016 అక్టోబరు 6న సింగరేణి కార్మికులకు దసరా కానుకగా సీఎం ప్రకటించారు. దీనికి సింగరేణి డైరెక్టర్ల బోర్డు ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే. డిసెంబరు 20న యాజమాన్యం అమలు ఉత్తర్వులు వెలువరించడం, దాన్ని ఒక నిరుద్యోగి సవాలు చేయడం, హైకోర్టు 2017 మార్చి 16న రద్దు చేయాలని ఆదేశించడం వెంటవెంటనే సాగాయి. హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేసినా ప్రయోజనం దక్కలేదు. అప్పటికే దరఖాస్తు చేసుకున్న 5 వేల మంది కార్మికులో చాలామంది ఉద్యోగ విరమణ పొందారు. ఇప్పుడు సర్వీసులో ఉన్నవారిలో ఎవరెవరికి వర్తిస్తుంది. ఎంత సర్వీసు మిగిలి ఉండాలి. విధివిధానాలు ఎలా ఉంటాయని నాయకులను కార్మికులు అడుగుతున్నారు. ఇదిలా ఉండగా కోల్ ఇండియాలో కార్మికులు మెడికల్ అన్‌ఫిట్ అయినా, ప్రమాదవశాత్తు మరణించినా వారి వారసులకు ఇచ్చే కారుణ్య నియామకాలకు బదులుగా దశలవారీగా రూ.25 లక్షల చొప్పున మొత్తం రూ.75 లక్షలు ఇవ్వడానికి ఇటీవల జరిగిన జేబీసీసీఐ ఉప కమిటీ సమావేశంలో ప్రతిపాదన చేసిన నేపథ్యంలో సింగరేణిలో పరిస్థితి ఎలా ఉండబోతుందోననే ఉత్కంఠ నెలకొంది. కాగా కారుణ్య నియామకాల ఇప్పటికే ప్రభుత్వ సూచనతో సింగరేణి యాజమాన్యం అడ్వకేట్ జనరల్‌ను సంప్రదించింది.

ఎదురుచూపులు..

తెలంగాణాకే తలమానికమైన సింగరేణి కాలరీస్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్‌కు కార్మికులు బ్రహ్మరథం పట్టారు. దీంతో స్పందించిన సీఎం కార్మికులకు అనేక వరాలు ప్రకటించారు. ఇందులో ప్రధానమైన కారుణ్య నియామకాల హామీపై కార్మికులు గంపెడాశలు పెట్టుకున్నారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎంపీ కవిత కారుణ్య నియామకాలపై కార్మికులకు అనుకూ లమైన విధంగా ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్న దాఖలాలున్నాయి. 2017 అక్టోబరులో ముఖ్యమంత్రి చేసిన ప్రకటనకు అనుగుణంగా యాజమాన్యం కారుణ్య నియామకాల అమలుపై చర్యలు చేపట్టింది. కాగా నెలలు గడుస్తున్నా కారుణ్య నియామకాలపై ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవటం పట్ల కార్మికుల్లో నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. ఈ ఏడాది చివరలో సాధారణ ఎన్నికలు జరిగే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో కారుణ్య నియామకాల పథకం అమల్లోకి రాకపోతే టీఆర్ఎస్‌కు కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడే అవకాశం ఉంది.

రీసైక్లింగ్ బియ్యం నిరోధానికి చర్యలు

- **ప్రత్యేక బృందాలతో తనిఖీలు**
- **సివిల్ సప్లయ్ కమిషనర్ ఆనంద్**



హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్టతకు చర్యలు తీసుకున్నామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సివి.ఆనంద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసే బియ్యంలో రీసైక్లింగ్ బియ్యం లేకుండా చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. రీసైక్లింగ్ బియ్యం నిరోధానికి ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. బఫర్ గోదాముల వద్ద రీసైక్లింగ్ బియ్యానికి అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకు సంబంధించి, గోదాముల్లో ఉన్న అక్రమ నిల్వలపై తనిఖీలు జరపడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని ఆనంద్ వెల్లడించారు. పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్(సాంకేతిక)తోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, జిల్లా తూనికలు, కొలతల విభాగం నుంచి ఒక్కొక్కరిని సభ్యులుగా చేస్తూ జిల్లా స్థాయి కమిటీ నియమించామన్నారు. జిల్లాస్థాయి తనిఖీ బృందాల పని తీరును పరిశీలించేందుకు తూనికలు, కొలతల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కూడిన బృందం ప్రధాన కార్యాలయం నుండి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆయా జిల్లాలకు వెళుతుందన్నారు. ఈ కమిటీ బఫర్ గోదాముల్లో తనిఖీలు నిర్వహించి కార్పొరేషన్ ప్రధాన కార్యాలయానికి నివేదిక అందజేస్తుందన్నారు. ఈ బృందాలను అంతర్గతంగా ఒక జిల్లా నుండి మరో జిల్లాకు మారుస్తామని, ఇందుకు ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు జారీచేస్తామని తెలిపారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నిబంధనల మేరకు గోదాముల్లో నిల్వలను క్రమబద్ధీకరిస్తామన్నారు. ఒక్కో జిల్లాలో సగటున 5 నుండి 10 వరకు బఫర్ గోదాములు ఉన్నందున ప్రతి నెలా తనిఖీలు నిర్వహించాకే స్టోరేజ్ తరుగుదలపై మీద నిర్ణయం తీసుకుంటామన్నారు. స్టోరేజ్ లాసెస్ లేకున్నా కొంతమంది బఫర్ గోదాముల నిర్వాహకులు తమ హక్కులా క్లెయిమ్ చేసుకుంటున్నారని, దీనికి పౌరసరఫరాల శాఖకు చెందిన సాంకేతిక సిబ్బంది సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లర్లతో కుమ్మక్కయి రీసైకిల్ బియ్యాన్ని అనుమతించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. గోదాముల నిల్వ తాలూకు (స్టోరేజ్ లాస్సెస్) నష్టాలు లేకపోయినా, ఉన్నట్లు చూపించారని, నాగర్‌కర్నూల్ జిల్లా జడ్చర్లలోని సీడబ్ల్యూసీ బఫర్ గోదాం తనిఖీలో ఈ విషయం వెలుగు చూసిందన్నారు. ఈ విషయంపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్, ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

టీఎస్‌పీఎస్సీ తప్పులు చేస్తుంటే... గవర్నర్ ఏం చేస్తున్నారు?

- **నిరుద్యోగ జేఏసీ ప్రశ్న**


హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): ఉద్యోగ నియామకాల విషయంలో టీఎస్‌పీఎస్సీ తప్పుమీద తప్పులు చేస్తుంటే గవర్నర్ నరసింహన్ ఏం చేస్తున్నారని నిరుద్యోగ జేఏసీ నేత క్రాంతి ప్రశ్నించారు. ఆయన రాజ్‌భవన్‌లో ఎంజాయ్ చేయడానికి ఉన్నారా? అని నిలదీశారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశపడితే టీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేసిందని మండిపడ్డారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. టీఆర్టీ అభ్యర్థుల సమస్యలపై సమావేశం పెట్టుకోవాలని భావించినా ప్రభుత్వం వారిని ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తోందని అన్నారు. రాజ్యాంగం గురించి తెలియని వ్యక్తికి అంత పెద్ద పదవి ఎలా కట్టబెట్టారు? అని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

ఎన్‌టీఎస్‌ఈ ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): గత ఏడాది నవంబర్ 5న నిర్వహించిన జాతీయ ప్రతిభా పరీక్ష(రాష్ట్రస్థాయి ఎన్‌టీఎస్‌ఈ) ఫలితాలు విడుదలయ్యాయి. వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చునని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు బి.సుధాకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. రెండో స్థాయి ఎన్‌టీఎస్‌ఈ పరీక్ష విధానంలోని సవరణలనూ వెబ్‌సైట్‌లో పెట్టామని పేర్కొన్నారు.

రోడ్ల నిర్మాణం వేగం పెంచండి

- సయయం వృథా చేయొద్దు: తుమ్మల




హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): జాతీయ రహదారులు, భవన నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సమీక్షించారు. ప్రతిపాదిత జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు సంబంధించి రూపొందిస్తున్న 'సవివరణాత్మక ప్రాజెక్టు రిపోర్టుల' తయారీ, నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల ప్రస్తుత స్థితి, ఆలస్యానికి గల కారణాలు అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. రిపోర్టుల తయారీ నెపంతో సమయం వృథా చేయొద్దని అధికారులకు మంత్రి సూచించారు. రహదారుల నిర్మాణంలో ప్రధాన సమస్యగా ఉన్న భూసేకరణ అడ్డంకులను అధిగమించేందుకు అధికారులకు సూచనలు చేశారు. గతంలో తెలంగాణకు కేంద్రం ప్రకటించిన జాతీయ రహదార్లకు నోటిఫికేషన్లు ఇవ్వాలని ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీని కలిసి తుమ్మల విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా పనులపై మంత్రి సమీక్షించారు.

ఇంధన పొదుపు ఘనత డ్రైవర్లదే: ఆర్టీసీ ఎండీ

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): ఇంధన పొదుపులో ఆర్టీసీని ప్రథమ స్థానంలో నిలుపుతున్న ఘనత డ్రైవర్లేకే దక్కుతుందని సంస్థ ఎండీ జివి. రమణారావు అన్నారు. ఇంధన పొదుపు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్ జరిగింది. రాష్ట్ర, రీజియన్ స్థాయిల్లో అత్యుత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు, ఉత్తమ మెయింటెనెన్స్ ద్వారా ఇంధన పొదుపునకు దోహదం చేసిన మెకానిక్‌లకు ఈ కార్యక్రమంలో రమణారావు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రత్యామ్నాయ ఇంధన వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించనట్లు చెప్పారు. 1980-81లో 4.09 ఉన్న కేఎంపీఎల్, 2016-17 నాటికి 5.13కి పెరగడం మంచి పరిణామం అన్నారు. అవార్డులు స్వీకరించిన డ్రైవర్ల నుంచి మిగిలిన వారు స్ఫూర్తి పొందాలని రమణారావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈడీ రవిందర్, సిఎంఇ. వెంకటేశ్వర్లు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

85వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ చిక్కిన పంచాయతీ శాఖ డీఈఈ



చేర్యాల, ఫిబ్రవరి 15(మనం న్యూస్): ఓ సివిల్ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటున్న పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగిని ఏసీబీ అధికారులు గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలో పంచాయతీ రాజ్ శాఖలో డీఈఈగా పని చేస్తున్న కూరపాటి చంద్రప్రకాష్, చేర్యాలకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ ఎండీ రహీమ్ నుంచి రూ.85 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. మద్దూరు మండలం నర్సాయపల్లి ప్రధాన రహదారి నుంచి చేర్యాల పరిధిలోని రోళ్ళ బండ వరకు రహదారి నిర్మాణ పనులకు ప్రధాన మంత్రి సడక్ యోజన కింద ప్రభుత్వం రూ.74 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ వాటి పనులను 2016 నుండి 2017 వరకు పూర్తి చేయాల్సి ఉంది. అయితే పనులను పూర్తి చేసి, బిల్లు మంజూరు చేయాలని సంబంధిత డీఈఈని కోరితే వేధిస్తున్నాడని, రూ.1.10 లక్షలు లంచం ఇవ్వమని డిమాండ్ చేశాడు. కాంట్రాక్టర్ 50వేలు ఇస్తానని అంటే డీఈఈ అంగీకరించలేదు. చివరకు రూ.85వేలకు బేరం కుదిరింది. అయితే కాంట్రాక్టర్ రహీమ్ ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ డీఎస్పీ ప్రతాప్‌కుమార్, ఎస్సైలు గంగాధర్, విజయ్‌కుమార్, సీహెచ్. మురళి, సిబ్బందితో కలిసి దాడి చేసి కాంట్రాక్టర్ నుంచి డీఈఈ రూ.85 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. చంద్ర ప్రకాష్‌ను హైదరాబాద్ సిటీ సివిల్‌కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.



నగరంలో ఇరాన్ అధ్యక్షుడు రోహానీ

- స్వాగతం పలికిన గవర్నర్.. రెండు రోజుల పర్యటన

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇరాన్ అధ్యక్షుడు హసన్ రోహానీ గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయంలో రోహానీకి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, కేంద్ర విద్యుత్–ఇంధన శాఖ మంత్రి ఆర్కే సింగ్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ తదితరులు ఘన స్వాగతం పలికారు. రోహాని తన పర్యటనలో భాగంగా తొలిరోజు శుక్రవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించనున్నారు. చరిత్రాత్మక మక్కా మసీదులో ప్రార్థనలు నిర్వహించనున్నారు. అనంతరం మత పెద్దలతో సమావేశం కానున్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం, గోలకొండ కోటను సందర్శించనున్నారు. ఇరానియన్ ఆయిల్ కంపెనీలతో భారతీయ అధికారులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. కాగా, రోహానీ పర్యటన నేపథ్యంలో నగరంలో పలు చోట్ల అధికారులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కుతుబ్‌షాహి టూంబ్స్, గోలకొండ, సాలార్‌జంగ్ మ్యూజియం, షేక్‌పేట్ నాలా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని తెలిపారు.

ఈ నెల 28 నుంచి ఇంటర్ పరీక్షలు

- హాజరుకానున్న 9.25 లక్షల మంది విద్యార్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): ఈనెల 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో ఇంటర్ బోర్డు అధికారులు నిమగ్నమయ్యారు. 2017–18 విద్యా సంవత్సరానికి సంబంధించి 9.25 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 4.75 లక్షల మంది ప్రథమ సంవత్సరం, 4.50 లక్షల మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హజరుకానున్నారు. వీరిలో ప్రైవేటు విద్యార్థులు 1.25 లక్షల మంది ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ పరీక్షల రాష్ట్రవ్యాప్తంగా 1,560 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఇంటర్ పరీక్షల నిర్వహణ అధికారి సుశీల్‌కుమార్ తెలిపారు. హాల్‌టికెట్ల పంపిణీ రెండు రోజుల్లో ప్రారంభమవుతుందని, ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు హాల్‌టికెట్లు పొందవచ్చని చెప్పారు.

మూసీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- నదిని మొత్తం సర్వే చేయండి
- డ్రోన్లను ఉపయోగించండి: కేటీఆర్
- నగరంలో చెరువుల అభివృద్ధిపై సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): మూసీ నది అభివృద్ధికి ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. మూసీ నది అభివృద్ధి, సుందరీకరణ వంటి అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని, ఇందుకోసం మూసీ నది మొత్తాన్ని సర్వే చేయాలని సూచించారు. ఇందుకు డ్రోన్ వంటి అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించాలని కోరారు. దీంతోపాటు గతంలో ఉన్న సాటిలైట్ మ్యాపులతో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయాలన్నారు. గురువారం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఇందులో మూసీ రివర్



డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలపై ప్రధానంగా చర్చించారు. ఇప్పటికే ప్రభుత్వం పరిశీలిస్తున్న మూసీ నది వెంబడి రోడ్ల పైన మంత్రి సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుకూలంగా నదికి ఇరువైపుల రోడ్లు, నదిపై నుంచి ఎలివేటేడ్ ఎక్స్‌ప్రెస్‌వే, ఈ రెండింటి కలయిక తో కూడిన ప్రణాళికలను రూపొందించాన్నారు. వీటి కోసం అయ్యే ఖర్చు, సాద్యాసాధ్యాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలన్నారు. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న రోడ్లకు అనుబంధగా రూపకల్పన చేస్తున్న బ్రిడ్జిల డిజైన్లు, నిర్మాణం సైతం చారిత్రక, సంస్కృతికి అద్దంపట్టేలా ఉండాలన్నారు. నగర పరిధిలోని చెరువుల అభివృ ద్ధి ప్రణాళికలను మంత్రి ఈ సమావేశంలో సమీక్షించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులను దీర్ఘకాలిక ప్రణాళిలను రూపొందించుకుని దశలవారీగా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఈ సంవత్సరం వర్షకాలం నాటికి కనీసం 50 చెరువులను అభివృద్ధి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. చెరువులను అభివృద్ధి చేసే లోపు అవి కబ్జా కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో మాట్లాడాలని అధికారులను అదేశించారు.

అకున్ పోస్టింగ్‌పై అనిశ్చితి!

- డిప్యుటేషన్‌పై ఎక్సైజ్ శాఖలో విధులు
- సొంత శాఖకు పంపాలని డీజీపీ లేఖ
- అదే పోస్టులో ఉంచాలి: సోమేశ్ కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): డ్రగ్స్ వ్యవహారంలో టాలీవుడ్ ప్రముఖులకు ముచ్చెమటలు పట్టించిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ పోస్టింగ్‌పై అనిశ్చితి నెలకొంది. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న ఆయనను పోలీసు శాఖకు పంపాలంటూ ఎక్సైజ్‌శాఖకు ఇటీవలే డీజీపీ మహేందర్‌రెడ్డి లేఖ రాశారు. అయితే, ఆయన సేవలు ఇక్కడ ఎంతో అవసరమని, ఆయనను తమ శాఖలోనే కొనసాగించాలని కోరుతూ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్ సీఎస్‌కు లేఖ రాశారు. వాస్తవానికి ఎక్సైజ్ డైరెక్టర్‌గా అకున్ సబర్వాల్ డిప్యూటేషన్ కాలపరిమితి పూర్తయింది. ఈ నెల 19 లోపు సొంత శాఖకు పంపాలని వారం క్రితం ఎక్సైజ్ శాఖ కమిషనర్ సోమేశ్ కుమార్‌కు డీజీపీ లేఖ రాశారు. అయితే.. ఎక్సైజ్ శాఖలో పనిభారం ఎక్కువగా ఉందని, దీనికితోడు వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శిగా కూడా తాను కొనసాగుతున్నానని డీజీపీకి రాసిన లేఖలో సోమేశ్ పేర్కొన్నారు. దాంతో ఈ అంశం ప్రస్తుతం సీఎం కేసీఆర్ వద్దకు చేరింది. సీఎం ఆదేశాలతోనే అకున్ సబర్వాల్ ఎక్కడ కొనసాగనుందని తేలనుంది.

19 నుంచి వరల్డ్ ఐటీ కాంగ్రెస్

- ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): హైదరాబాద్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు జరుగుతున్న ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌ను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. హెచ్ఐసీసీలో జరిగే ఈ సదస్సును వీడియో లింక్ ద్వారా మోదీ ప్రారంభించి, సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తారని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, శ్రీలంక ప్రధాని విక్రమ సింఘే, కేంద్ర మంత్రి రవిశంకర ప్రసాద్, సీఎం కేసీఆర్, కెనడా మంత్రి నవదీప్ బేన్స్ బీసీజీ చైర్మన్ హన్స్‌పాల్ బర్నర్, పుల్లెల గోపిచంద్, అడోబ్ చీఫ్ శంతను నారాయణ, నటీ దీపిక పదుకొణె, ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు తదితరులు పాల్గొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, వరల్డ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్(విట్సా), నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కాం) సంయుక్తంగా 'డబ్ల్యూసీఐటీ' సమావేశాలను నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌ను భారత్‌లో నిర్వహించడం ఇదే తొలిసారి.

మతోన్మాద శక్తులకు ఎదురొడ్డాలి

- జనసేవాదళ్ శిబిరం ప్రారంభోత్సవంలో చాడ



హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): మతోన్మాద శక్తులను ఎదుర్కోవడంకోసం జనసేవాదళ్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న జనసేవాదళ్ శిక్షణ శిబిరాన్ని చాడ గురువారం జెండా ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ.. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత చైతన్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

ధర్మబిక్షం జీవితం స్ఫూర్తిదాయకం

కమ్యూనిస్టు నాయకుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ధర్మబిక్షం 96వ జయంతి కార్యక్రమం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగింది. ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాల వేసి చాడ నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిజాం వ్యతిరేక పోరాటంలో యువకులను ధర్మబిక్షం కమ్యూనిస్టులుగా తయారుచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, వి.యాదగిరిరావు, మన తెలంగాణ పత్రిక ఎడిటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పొన్నాల జన్మదిన వేడుకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): రాష్ట్రంలో టీఆర్ఎస్ పాలన మేడిపండు చందంగా ఉందని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. పొన్నాల ఇంట్లో ఆయన జన్మదిన వేడుకలను కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. కొండాపూర్‌కు చెందినవారు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పొన్నాల మాట్లాడుతూ కేసీఆర్ అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారని ఆరోపించారు. ప్రచారం జాస్తి, పనులు నాస్తి అన్నట్టుగా పాలన సాగుతోందన్నారు. అన్నివర్గాల ప్రజలను టీఆర్ఎస్ మోసం చేస్తోందన్నారు.



సంత్ సేవాలాల్ జీవితం ఆదర్శం

- కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్
- ఆయన జీవితాన్ని పాఠ్యాంశంగా చేయాలి: లక్ష్మణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): సంత్‌లు, సన్యాసులు జన్మించిన పుణ్యభూమి మనదని, ఛత్రపతి శివాజీ, సంత్ సేవాలాల్ వంటి ఎంతోమంది దేశసేవలో తరించారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్ అన్నారు. దేశ సంస్కృతిని కాపాడిన గొప్ప వ్యక్తి సంత్‌లాల్ మహారాజ్ అని, హిందూ ధర్మకోసం ఎంతో కృషిచేశారని, ఆయన చూపిన సేవా మార్గం ఆదర్శనీయమని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో పార్టీ కార్యాలయంలో సంత్ సేవాలాల్ మహారాజ్ 279వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హన్స్‌రాజ్ మాట్లాడుతూ.. లంబాడీల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా, అహింస సిద్ధాంతానికి పునాదులు వేసిన మహనీయులు సంత్ సేవాలాల్ అని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ దేశం కోసం చేసిన త్యాగాలను నేటి యువతకు బోధించాల్సిన అవసరం ఉందని, ఆయన జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక వేషభాషలు, సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అరుదైన జీవన విధానాన్ని పాటిస్తూ దేశంలో గిరిజనులు తమకంటూ ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. బంజారాల పేరు మీదనే హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పేరు వచ్చిందని, కానీ ఈరోజు అక్కడ బంజారాలకు స్థానమేలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్టీలకు విద్య, ఉద్యోగాల్లో జనాభా ప్రాతిపదకన 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారని, తండాలను పంచాయతీలుగా మారుస్తామని వాగ్దానాలు చేసి చివరికి గిరిజనులను వంచించారని దుయ్యబట్టారు. లక్షా యాభై వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనుల అభ్యున్నతికి కనీసం 15వేల కోట్లు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. గిరిజనులకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి హక్కుల కోసం పోరాడుతుందని తెలిపారు.

ఆంధ్రా ఉద్యోగులతో కలవలేం

రిలీవైన ఉద్యోగులను తీసుకోవద్దు ... వారితో పనిచేసేందుకు సిద్ధంగాలేం

- విభజన వెంటనే పూర్తిచేయాలి
- మహాధర్నాలో విద్యుత్ ఉద్యోగులు
- విద్యుత్‌సౌధలో పెద్దఎత్తున ఆందోళన
- కరెంటోళ్లకు తెలంగాణలోనూ అన్యాయమే
- కోర్టు తీర్పును సవాల్ చేయాలని డిమాండ్
- ఏపీ ప్రభుత్వ వైఖరిపై మండిపాటు
- టీఎస్‌పీఈ జేఏసీ కన్వీనర్ రత్నాకర్



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ స్థానికత కారణంగా రిలీవైన ఉద్యోగులను తిరిగి సంస్థలోకి తీసుకోవద్దని తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ విద్యుత్ సంస్థల్లో వారిని చేర్చుకోవడానికి యాజమాన్యాలు సిద్ధపడుతున్నాయని, అదే జరిగితే తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని వారు పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల మహాధర్నాకు ఉద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఈ జేఏసీ కన్వీనర్ పి.రత్నాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులమంతా రాత్రి పగలు కష్టపడి 24 గంటలు కరెంటు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. కానీ ఆంధ్ర ప్రభుత్వం, జిత్తులు, ఎత్తుల వల్ల ప్రత్యేక రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగుల కష్టాలు తీరడంలేదన్నారు. విద్యుత్ ఉద్యోగుల విభజన అంశంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ ఉద్యోగులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని తెలంగాణ విద్యుత్ యాజమాన్యం వెంటనే సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే హైకోర్టులోనే రివ్యూ ఫిటిషన్ వేయాలని ఆయన కోరారు. ఏపీ ఉద్యోగులతో కలిసి పనిచేసేందుకు ఏమాత్రం తెలంగాణ ఉద్యోగులు సిద్ధంగాలేరని ఆయన స్పష్టంచేశారు. ఏపీ విద్యుత్ యాజమాన్యం, ఏపీప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల విభజన పరిష్కారానికి ముందుకు రాకపోవడం వల్ల ఈ పరిస్థితులు వచ్చాయన్నారు. జేఏసీ ప్రతినిధి బీసీరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ యాజమాన్యం తక్షణమే ప్రభుత్వంతో చర్చించి విద్యుత్ ఉద్యోగుల విభజన ప్రక్రియ ప్రారంభించాలన్నారు. టీఎస్‌పీఈ జేఏసీ ప్రతినిధి శ్యామ్‌మనోహర్ మాట్లాడుతూ రిలీవ్ చేసిన ఆంధ్రా ఉద్యోగులను సూపర్ న్యూమరీ పోస్టుల్లోనే కొనసాగించాలని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమోషన్ ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. మరో జేఏసీ నాయకుడు ముత్యం వెంకన్నగౌడ్ మరియు కుమార స్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగులకు రాష్ట్రంలో జరిగిన అన్యాయాలను, రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘన, 610జీవో ఉల్లంఘనలవల్లనే ఆంధ్రస్థానికత గల ఉద్యోగులను రిలీవ్ చేయాల్సి వచ్చిందని తెలిపారు. వివిధ సంఘాలకు చెందిన జేఏసీ ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, కరుణాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తులసి మాట్లాడుతూ రిలీవైన ఆంధ్ర ఉద్యోగులు గత మూడు సంవత్సరాలుగా ఉచిత జీతాలు తీసుకుంటూ కోర్టు కేసులు వేసి తెలంగాణ ఉద్యోగుల ప్రమోషన్లు ఆపే ప్రయత్నం చేస్తూ తెలంగాణలో ఉండిపోవాలని మొండిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారుచేసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో సాగనీయ్యమని హెచ్చరించారు. దీనిపై సోమవారమే సీఎం కేసీఆర్ తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో లేఖ రాశామని విద్యుత్ ఉద్యోగుల నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఉద్యోగుల విభజన అంశంపై ప్రస్తుత పరిణామాలను, తెలంగాణ ఉద్యోగులకు జరగబోయే అన్యాయాలపై ప్రభుత్వం, సీఎం కేసీఆర్ తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఉద్యోగులు డిమాండ్ చేశారు.


ఎవరికీ అన్యాయం జరగదు: సీఎండీ ప్రభాకర్‌రావు

విద్యుత్ ఉద్యోగులకు యాజమాన్యం అండగా ఉంటుందని, ఎవరికీ అన్యాయం జరగనివ్వబోమని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ప్రభాకర్‌రావు మహా ధర్నా వేదికపై వెల్లడించారు. ఉద్యోగుల విభజన అంశం కోర్టు పరిధిలో ఉండడం వల్ల దానిపై మాట్లాడడం సరికాదని చెప్పారు. ఉద్యోగులు అందరికీ న్యాయం చేయడానికి కృషిచేస్తామని సీఎండీ ప్రభాకర్‌రావు వివరించారు. విద్యుత్ సంస్థల యాజమాన్యంతో పాటు, సీఎం కేసీఆర్ తదితరులంతా మొదటినుంచీ ఉద్యోగులకే అండగా ఉంటున్నారని ఆయన గుర్తుచేశారు. ఈ అంశంపై అడ్వకేట్ జనరల్ సలహా తీసుకొని సీఎం కేసీఆర్‌తో చర్చించి ముందుకెళతామని చెప్పారు. ఉద్యోగులు ఎవరూ ఆందోళన చెందొద్దని సీఎండీ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు.

అత్యాధునిక వసతులతో..

రాష్ట్రంలో ట్రైబల్ యూనివర్సిటీ

- విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు
- మూడేండ్లలో 540 గురుకులాలు: కడియం



హైదరాబాద్, ఫిబ్రవరి 15(మనం ప్రతినిధి): తెలంగాణాలో అత్యాధునిక వసతులతో ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటుచేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీని సందర్శించిన అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి కడియం మాట్లాడారు. తెలంగాణలో విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొస్తున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో గురుకులాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంజనీరింగ్ విద్యలో నిబంధనలు కఠినతరం చేయడం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, కాలేజీలను పూర్తిస్థాయిలో పటిష్టం చేశామని తెలిపారు. యూనివర్సిటీలను బలోపేతం చేసేందుకు 1551 పోస్టులను భర్తీ చేసేందుకు సీఎం కేసీఆర్ అనుమతిచ్చారని చెప్పారు. యూనివర్సిటీల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.420 కోట్లు మంజూరు చేశారన్నారు. దేశంలో 16.5 జీడీపీతో రికార్డు స్థాయిలో తెలంగాణ పరుగులు పెడుతోందని చెప్పారు. మూడేండ్లలో 540 గురుకులాలు ఏర్పాటు చేసి తెలంగాణ చరిత్ర సృష్టించిందని తెలిపారు. ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎంపీ సీతారాంనాయక్‌కు యూనివర్సిటీలో కల్పించిన వసతులను వివరించారు.

రేపు ఢిల్లీకి కడియం..

డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి శనివారం ఢిల్లీలో పర్యటించనున్నారు. తొలుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలుస్తారు. అనంతరం కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్‌తో భేటీ అవుతారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

శుక్రవారం, ఫిబ్రవరి 16

హరిత హంగు

భూగోళంపై ప్రతి రెండు సెకండ్లకు ఫుట్‌బాల్ పిచ్ (64వేల చదరపు అడుగుల విస్తీర్ణం) అంత సహజ అడవి అంతరించిపోతుంటే భారత్‌లో 0.94 శాతం మేర విస్తరించడం ఆశ్చర్యకరంగానే ఉన్నా ఆహ్వానించదగ్గ పరిణామమే. ప్రతి రెండేళ్ళకు ఒకసారి డెహ్రాడూన్ కేంద్రంగా పనిచేస్తున్న 'ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా' సంస్థ దేశంలోని అటవీ సంపదను మదింపు వేసి, 'ద ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్' (ఐఎస్ఎఫ్ఆర్)-2017 ను పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేస్తుంది. 1987 నుంచి ప్రారంభమైన సర్వేలు దేశ అటవీ సంపద బాగోగులపై సమగ్ర నివేదికను రూపొందిస్తున్నాయి. సోమవారం విడుదలైన 15వ ఐఎస్ఎఫ్ఆర్ సైతం గత నివేదికల తీరులోనే భారత అటవీ సంపద పెరుగుదలను నమోదు చేసింది. ఉపగ్రహం అందించిన సమాచారం ఆధారంగా 2015-17 మధ్యకాలంలో దేశంలోని అటవీ విస్తీర్ణం కనీస మాత్రంగా ఒక్క శాతం పెరుగుదల సాధించిందని ఆ నివేదిక వెల్లడించింది. భారత భూభాగంలోని 24.4 శాతం అడవి లేదా ఏదో రకమైన వృక్ష సంపదతో నిండి ఉన్నట్లు నివేదిక చెబుతోంది. బాగా దట్టమైన, ఒక మోస్తరు దట్టమైన, బహిరంగ, చిట్టడవులుగా ఉపగ్రహం ద్వారా నమోదైన ప్రాంతం వాస్తవంగా క్షేత్ర స్థాయి హరిత ప్రాంతాల అంచనాలతో సరిపోలదు.


భౌగోళిక విస్తీర్ణంలో 33 శాతంలో అడవులు పెంచాలనే పర్యా వరణ విధానం వల్ల కొన్ని ప్రయోజనాలు సమకూరుతాయి. ఈ శతాబ్దంలో 20 శాతం విస్తీర్ణంలో అడవులను పెంచాలన్నది లక్ష్యం. సహజ అడవులను కాక, వాణిజ్యపరంగా పెంచుతున్న మోనో కల్చర్ మొక్కలు వంటి ప్లాంటేషన్లన్నిటినీ అడవులుగా ప్రారంభం నుంచి ఐఎస్ఎఫ్ఆర్ నమోదు చేస్తోంది. ప్లాంటేషన్ తరహా అటవీ సంపద గాలిలో తేమ పునరుద్ధరిస్తుంది, భూసారాన్ని జారవిడవదు, కార్బన్‌ను ఒకమేర పట్టి ఉంచుతుంది. అయితే ఇలాంటి ప్లాంటేషన్లు స్థానిక జీవవైవిధ్యాన్ని పెంపొందించలేవు, వర్షపు నీటిని ఒడిసి పట్టి ఊటల ద్వారా నదులకు జన్మనివ్వలేవు, వరదలను అరికట్టలేవన్న విషయం తెలిసిందే. ఈ విధమైన మోనో కల్చర్ వృక్ష సంపద జీవవైవిధ్య పర్యావరణ వ్యవస్థలకు ప్రతాయమ్నాయం కాజాలవని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గత 250 ఏళ్ళగా యూరప్‌లో విదేశీ మొక్కలతో పెంపొందిస్తున్న హరిత ప్రాంతాలున్నప్పటికీ కార్బన్‌డై ఆక్సైడ్ శోషణ స్థాయిలు ఆ ప్రాంతాల్లో గణీయంగా పడిపోయాయని, అందువల్ల ఇలాంటి అడవుల పెంపక కార్యక్రమం నిరర్థకమని 'సైన్స్' అనే పత్రిక అధ్యయనం వెల్లడించింది. తెలంగాణలో 'హరిత హారం' పేరుతో చేస్తున్న హడావుడి దగ్గర నుంచి దేశ వ్యాప్తంగా చేపడుతున్న ప్లాంటేషన్లు, కృత్రిమ అటవీ పెంపక కార్యక్రమాలు సహజ అడవులకు ప్రత్యామ్నయాలు కాజాలవు.

కేవలం వృక్ష సంతతిని పెంపొందించడం స్థానిక జీవ వైవిధ్యాన్ని పరిరక్షించినట్లు కాదు. ఛాంపియన్-సేత్ వర్గీకరణ ప్రకారం దేశంలో 16 ముఖ్యమైన అడవులు, 221 అటవీ ప్రాంతాలు, ఉప ప్రాంతాలు ఉన్నాయి. అయితే శతాబ్దాలుగా సాగిన వలసపూర్వ, వలసల కాలంలో అతి తక్కువ సహజ అడవి మాత్రమే నిలుపుకోగలిగాము. మిజోరం, నాగాలాండ్, అరుణాచల్ ప్రాంతంలో దాదాపు 1,200 చదరపు కిలోమీటర్ల అడవిని అంతరించిందని ఐఎస్ఎఫ్ఆర్ ఆడిట్ నివేదిక తెలిపింది. భూగోళంపై జీవవైవిధ్యం అత్యధికంగా కేంద్రీకృతమై ఉన్న ప్రాంతాల్లో ఒకటైన ఈశాన్య రాష్ట్రాల్లో కోల్పోయిన ప్రాంతీయ సహజ అడవితో పోలిస్తే ప్లాంటేషన్ల ద్వారా పెంచిన జీవ వైవిధ్యరహత మానవ నిర్మిత అడవుల వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. ఒడిశా, అసోం, తెలంగాణ, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జమ్మూ-కశ్మీర్, మణిపూర్‌లలో అటవీ శాఖ పెంపొందించిన కృత్రిమ అడవులు జీవవైవిధ్యాన్ని పునర్జీవింపచేయలేవు. అటవీసంరక్షణ పేరుతో కోట్లాది రూపాయలు వ్యయం చేస్తున్న ఈ ప్రాజెక్టుల ప్రయోజనాన్ని భారత ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతుల్లో సమీక్షించాలి. హేతుబద్ధ సంస్కరణల ద్వారా మాత్రమే స్థానిక ప్రకృతిని వెనక్కి తీసుకురాగలం. అలాకాక ప్లాంటేషన్లు కూడా సహజ అటవీ ప్రాంతంగా లెక్కవేసి, అభివృద్ధి సాధించనందుకు స్వీయ అభినందనలతో ఆత్మ సంతృప్తి పొందితే ఆత్మహననానికి దారి తీసే ప్రమాదం ఉంది.


అమెరికాలో గన్ సంస్కృతి

అమెరికాలో గన్ సంస్కృతి విచ్చలవిడితనాన్ని బుధవారం ఫ్లోరిడా స్కూల్లో జరిగిన దారుణ సంఘటన బట్టబయలుచేస్తోంది. ప్రపంచమంతా ప్రేమికుల దినోత్సవ వేడుకల్లో ఉండగా 19 ఏళ్ల యువకుడు చేతిలో ఏఆర్-15 రైఫిల్‌తో విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 17మంది మరణించగా 12 మందికి పైగా గాయపడ్డారు. ఆ యువకుడు ఆ స్కూలు మాజీ విద్యార్థి. అతడిపై గతంలో క్రమశిక్షణాచర్యలు తీసుకున్నారు. నిందితుడిని స్కూల్ బయట అదుపులోకి తీసుకున్నారు. చాలామంది విద్యార్థులు, టీచర్లు స్కూలు ప్రాంతంలో దాదాపు రెండుగంటల పాటు దాక్కున్నారు. పోలీసులు వచ్చిన తరువాత గానీ వారు బయటకు రాలేకపోయారు. అమెరికాలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం విద్యార్థులకు అమెరికా స్కూళ్లు కల్పించే డొల్లతనాన్ని వెల్లడిస్తోంది. యేటా ఇలాంటి ఘటనలకు దాదాపు 33వేల మంది మృత్యుపాలవుతున్నారని నివేదికలు తెలుపుతున్నాయి. 2012లో సాండీ హుక్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కాల్పుల ఘటన పోలీసులను, అధికారులను ఇప్పటికీ భయంతో వణికిస్తూనే ఉంది. ఈ ఘటన అనంతరం పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై యాజమాన్యాలు ప్రత్యేక దృష్టిపెట్టినా ఘటనలకు ఫుల్‌స్టాప్ పడడం లేదు. అనేక పాఠశాలల్లో బజర్లు, కెమెరాలు ఏర్పాటుచేశారు. అంతేగాక తరగతి గదుల మధ్య బులెట్‌ప్రూఫ్ అద్దాలను అమర్చారు. అమెరికాలో గత రెండునెలల్లో నమోదైన పద్దెనిమిదో కేసు ఇది. నిత్యం 46 మంది పిల్లలు కాల్పులకు గురవుతున్నారని పార్లమెంట్‌సభ్యుడు డోనాల్డ్ ఎం పైనే తెలిపారు.

పాఠశాలల్లో భద్రతాచర్యలకు 1.8 మిలియన్ డాలర్లు ఖర్చుచేశామని న్యూజెర్సీలోని మార్ల్‌బోరో భద్రతా అధికారులు తెలిపారు. స్కూల్లోకి సాయుధ మనిషి ప్రవేశించగానే కనిపెట్టే పరికరాలు కూడా ఉన్నాయి. ఎన్నికల సమయంలో పాఠశాలలను పోలింగ్ బూత్‌లుగా వాడవద్దని పోలింగ్ అధికారులకు న్యూయార్క్, పెనిన్‌సెల్వేనియాల్లోని విద్యాశాఖ అధికారులు విజ్ఞప్తిచేశారు. చాలా రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆయుధాలతో వచ్చేందుకు పరిమితి సంఖ్యలో అనుమితినిచ్చారు. కొన్ని పాఠశాలల్లో ఆయుధ శిక్షణ కూడా అవసరమని సూచిస్తున్నారు. 2017లో ఒక స్కూలులోకి సాయుధ దుండగుడు ప్రవేశించకుండా గేట్లు తాళం వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇన్ని దారుణ ఘటనలకు జరుగుతున్నప్పటికీ కాల్పులకు కారణమవుతున్న నిందితులను రక్షించేచర్యలు కొనసాగుతుండడం గమనార్హం. ఆయుధాల నిషేధం - 2013 చట్టానికి సవరణలు ప్రతిపాదించడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ సవరణతో ఆయుధాలను స్వేచ్ఛగా విక్రయించవచ్చు. ఆయుధాలను విక్రయించేముందు వ్యాపారి కొనుగోలుదారుడిపై ఆయుధనిషేధం ఉందేమో పరిశీలించేందుకు ఉద్దేశించిన జాతీయ తక్షణ నేర నేపథ్య పరిశీలన విధానం (నేషనల్ ఇన్‌స్టింట్ క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ చెక్ సిస్టమ్)కు 2019 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మిలియన్ల డాలర్లను అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కోత విధించారు. విద్యార్థుల్లోను, సిబ్బందిలోను ఆత్మవిశ్వాసం పెంచి, ఇటువంటి ఘటనల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి శిక్షణ, మాస్ డ్రిల్లింగ్ కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉన్నది. విద్యార్థులకు ముఖ్యంగా టీనేజ్ పిల్లలకు ఆయుధాలను దూరంగా ఉంచాలి.పిల్లలకు సరైన క్రమశిక్షణ అవసరం కనిపిస్తోంది. 1990లో చేసిన ఆయుధాలతో దాడి నిషేధం (అసల్ట్ వెపన్ బ్యాన్) చట్టానికి పదును పెట్టడం ఒక పరిష్కారంగా పరిశీలకుల సూచనను పరిగణనలోకి తీసుకోవాలి.



మంచిమాట



ఒకరి కోసం ఒకరం కాకపోతే మనమంతా ఈ లోకంలో ఎందుకు జీవిస్తున్నట్లు

- జార్జ్ ఎలియట్

పొంచివున్న ఉన్నత విద్యా విపత్తు

ఇటీవల కేంద్రం ప్రతిపాదించిన దేశ బడ్జెట్‌లో ఉన్నత విద్యకి కేటాయింపులు చూసి తమ తలరాతలు ఎప్పుడు మారతాయా అని దేశవ్యాప్తంగా ఆలోచనలు చేసుకుంటున్న యువతను అకస్మాత్తుగా యుజీసీ నుంచి వచ్చిన 84 పేజీల చిత్తు ప్రతి (డ్రాఫ్ట్) ఆందోళనలోకి నెట్టేసింది. దేశంలోని వర్సిటీలలో, డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకుల నియామానికి, ఇప్పటికే ఉన్నవారికి పదోన్నతులకి సంబధించిన ప్రతిపాదనలు అవి. ఈనెల 28వ తేదీ దాకా అభిప్రాయాలు తెలపమని సమయం కూడా ఇచ్చింది. అయితే వీటిలోని కొన్ని అంశాలు ఆశావహులకు తీవ్ర నిరాశ కలిగించేలా ఉన్నాయి. అవి ఒకటి 2021 జూలైకల్లా పీహెచ్డీ పూర్తిచేసిన వారికే టీచింగ్‌లో ఎంట్రీ లెవెల్ పోస్టులు అయిన అసిస్టంట్ ప్రొఫెసర్‌కు అర్హత ఉన్న ట్టు. రెండు అధ్యాపకుల నియామకానికి ఇం టర్వ్యూకి అర్హత సాధించడానికి వారి విద్యా జీవితంలో పొందిన డిగ్రీలలో వచ్చిన మా ర్కుల శాతాన్ని బట్టి వారికి మార్కులు కేటాయించడం. వాస్తవానికి 2021 జూలై కల్లా పీహెచ్డీ తప్పనిసరి చేయడం ఒక పెద్ద జాతీయ విద్యా విపత్తు. ఇప్పటిదాకా నెట్ వంటి జాతీయ అర్హత పరీక్ష, సెట్ వంటి రాష్ట స్థాయి అర్హత పరీక్షఈ రెండు కాని పక్షంలో 2009 యుజీసీ గైడ్ లైన్స్ ప్రకారం పీహెచ్డీ పూర్తి చేసిన వారికి అధ్యాపకులుగా అవకాశం కల్పిస్తూ ఉన్నారు. ఇప్పుడు వీటితో పాటు పీహెచ్డీని కూడా తప్పనిసరి చేయడం వల్ల ఒరి గే ప్రయోజనమేమీ లేకపోగా అసలే అధ్యాపక ఉద్యో గాల భర్తీ జరగక కునారిల్లుతున్న ఉన్నత విద్య ప్రమాణాలపరంగా మరింత దిగజారుతుంది. పీహెచ్డీ పూర్తిచేయడం డిగ్రీ, పీజీ పూర్తిచేయడం వంటి ప్ర క్రియ కాదు, అంత తొందరగా విద్యార్థిగా నమోదు చేసుకోగల అవకాశమూ లేదు. పైగా అధిక సమ యం పట్టే విషయం. పీహెచ్డీ అడ్మిషన్ పొందాలంటే పీజీ పూర్తిచేసి ఉండాలి. నెట్, సెట్ వంటి జాతీయ రాష్ట్ర స్థాయి అర్హత పరీక్షల ద్వారాగానీ, లేదా యూనివర్సిటీల ప్రవేశ పరీక్ష ద్వారా గానీ మాత్రమే పీహెచ్డీ అడ్మిషన్ పొందగలం. దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఏటా పీహెచ్డీ అడ్మిషన్ల ప్రవేశ పరీక్షను నిర్వహిస్తాయి. తర్వాత ఇంటర్వ్యూల ద్వారా సంబంధిత సబ్జెక్టుల్లో ప్రవేశాలు చేపడతాయి. ప్రతి సబ్జెక్టులో అక్కడున్న అధ్యాపకుల అర్హతను బట్టి, అప్పటికే తమ వద్ద ఉన్న ఖాళీలను బట్టి సీట్ల సంఖ్య ఉంటుంది. అందుకే వాటి సంఖ్య చాలా తక్కువ. ఇక రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో పీహెచ్డీ ప్రవేశ పరీక్ష ఏటా జరగదు. రెండేళ్లకోసారి, మూడేళ్లకోసారి నిర్వహిస్తుంటారు.

కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో ఎంఫిల్, పీహెచ్డీ చేసే వారికి నెలకు 5 వేలు, 8 వేలు ఉపకార వేతనం అందజేయబడుతుంది. కానీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఇవేమీ ఉండవు. అందువల్ల ఎక్కువమంది అడ్మిషన్ పొందాక బయట తమ జీవనోపాధి చూసుకుంటూ పీహెచ్డీ అధ్యయనం చేస్తారు. దానితో వారికి ఈ డిగ్రీ పొందడానికి ఎక్కువ సమయం పడుతుంది. సాధారణంగా పీహెచ్డీ పట్టా పొందాలంటే ఒక ప్రక్రియ ఉంటుంది. ఎవరైనా తమ సిద్ధాంత గ్రంథాలు 3 సంవత్సరాల తర్వాత సమర్పించొచ్చు. వాటిని పరిశీలనకు పంపడం తరువాత ఆ సిద్ధాంతాన్ని డిఫెండ్ చేసుకునే వైవా ఇవన్నీ జరుగుతాయి. ఇదంతా జరగడానికి 4 ఏళ్ళు కనీసం పడుతుంది . అది కూడా వేగంగా చేసినట్లైతే. కొన్నిసార్లు ఆలస్యమై ఆ సమయం 7 లేదా 8 ఏళ్ళు పట్టేవారు ఉన్నారు. ఒకోసారి నిర్దేశిత సమయం ముగిసిపోయి మరలా పున:ప్రవేశం పొందేవారూ ఉంటారు. ఇంత సమయం పట్టే ఒక డిగ్రీని అధ్యాపక ఉద్యోగాల నియామాకానికి అర్హతగా పెట్టడం వల్ల ఏమి సాధించాలని కోరుకుంటున్నట్టు? పీహెచ్డీ వంటి ఉన్నత విద్యపై ఇప్పుడిప్పుడే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవగాహన ఏర్పడుతున్న నేపథ్యంలో ఆ డిగ్రీనే ఒక నిర్దేశిత సమయానికి తప్పనిసరి చేసినట్లైతేవారి హక్కులు ఎలా కాపాడగలం? నిజంగానే ఈ అర్హత తప్పనిసరి చేస్తే ఇప్పుడు పీహెచ్డీ అడ్మిషన్ పొందే విద్యార్థులు కూడా 2021కి డిగ్రీ పొందలేరు. అదొకటైతే 2021 జూలై తరువాత, ఇప్పుడు అర్హతలుగా ఉన్న నెట్, సెట్ వంటి పరీక్షలలో ఉత్తీర్ణులైన వారు పీహెచ్డీ పూర్తి చేసేదాకా అధ్యాపక ఉద్యోగాలకు అర్హులే కారు. ఇదెలా న్యాయం? ఇప్పుడు ఈ రూల్ పెట్టడం వల్ల, కొండంత ఆశతో జాతీయ స్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణులై టీచింగ్ వైపు మళ్లాలి అనుకునే ప్రస్తుత డిగ్రీ, పీజీ విద్యార్థుల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది ఈ నిర్ణయం. దానితో ఇప్పటికే ఉన్న దానికంటే మరింత మానవ వనరుల కొరత ఏర్పడుతుంది ఉన్నత విద్యారంగంలో.



పీహెచ్డీ సిద్ధాంతగ్రంథాలలోని విషయాలు చౌర్యానికి గురవడం, కొందరు వీటిని డబ్బులు తెచ్చిపెట్టే మార్గంలా భావించడంతో పీహెచ్డీ సిద్ధాంత గ్రంథాలు ఆదాయవనరుగా మారాయి అన్న వాదన ఉన్నత విద్యావర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అటువంటి వారికి విద్యను బోధించడం ఎలా తెలుస్తుంది అని నెట్ వంటి జాతీయ స్థాయి అర్హత పొంది ఉద్యోగాలు కోరుకునే వారు వాదిస్తుంటే, కేవలం మల్టిపుల్ చాయిస్ ప్రశ్నపత్రాలకు సమాధానమిచ్చి టీచర్లు ఎలా అయిపోతారు అనే వాదన పీహెచ్డీని సమర్థించే వారిలో ఉంది. యూజీసీ మాత్రం ఈ ఇద్దరి జుట్లకు ముడేస్తే పోతుంది అన్నట్టు వ్యవహరిస్తోంది . దేశంలో జాతీయ విశ్వ విద్యాలయాలు మొదలుకుంటే రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కాలేజీ ల్లో ఖాళీలు కలిపితే సంఖ్య వేలల్లో తేలుతుంది. నిధులు లేక రాష్ట్ర విశ్వవిద్యాలయాలు మూలుగుతు న్నాయి. అధ్యాపక ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడం, అభ్యర్థుల నుంచి ఫీజు వసులు చేయడం ఏదో కారణంతో వాయిదా వేయడం ఇలా అభ్యర్థుల జేబులు గుల్ల కావడం తప్ప భర్తీ జరిగిందే లేదు. ఇప్పటికీ జాతీయ స్థాయిలో విద్యాలయాల్లో కూడా కాంట్రాక్ట్ టీచర్లు బోధిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణమో అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ కొంత భర్తీ చేశారనే అనుకుం దాం, భర్తీ అయిన పోస్టుల్లో కూడా పీహెచ్డీ ఉండి మూడేళ్ళ బోధనా అనుభవం ఉన్నవారే పీహెచ్డీ పర్యవేక్షకులుగా ఉండాలి. మరి భర్తీ అయి కూడా మూడేళ్ళ అనుభవం లేని వారు పర్యవేక్షకులుగా ఉండే అవకాశం లేనప్పుడు అవసరమైన మేర పీహెచ్డీ పరిశోధకులను ఎలా తయారు చేయగలం?. ఇవేమీ యూజీసీ ఆలోచనకు తట్టకపోవడం మరీ విడ్డూరం. ఒకసారి తెలుగు రాష్ట్రాలోని పరిస్థితి గమనిస్తే ఆంధ్రా, తెలంగాణల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. నియమాకాలకు చట్టపరమైన కారణాలు అడ్డు పడుతూనే ఉన్నాయి. దశాబ్దం క్రితమే నెలకొల్పబడిన విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరత కొత్తగా చెప్పాల్సిందేమీ లేదు . రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పీహెచ్డీ అడ్మిషన్లు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా ఇవ్వాలి అనే ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఇవెప్పటికి జరిగేనో తెలియదు. వీరంతా 2021 జూలై కల్లా పీహెచ్డీ పూర్తి అవ్వాలి అనే నిబంధన బాధితులుగా మారతారనడంలో సందేహం లేదు. ఇక అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులను ఇంటర్వ్యూకి షార్ట్‌లిస్టు చేయడానికి విద్యా జీవితంలో పొందిన డిగ్రీల మార్కుల శాతాన్ని బట్టి ఇచ్చే ప్రాధాన్యంలో కూడా కొంత గందరగోళానికి తెరతీసింది. వర్సిటీలలో భర్తీ చేసే ఉద్యోగాలకు పీహెచ్డీకి ఇచ్చే మార్కులు 30గా నిర్ణయిస్తే, కాలేజీల్లో అధ్యాపకుల భర్తీకి పీహెచ్డీకి 20 మార్కులు కేటాయించారు. జాతీయ స్థాయి అర్హత పరీక్ష నెట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి వర్సిటీల్లో 7 మార్కులు కేటాయిస్తే కాలేజీల్లో భర్తీకి 10 మార్కులు కేటాయించారు . ఒకే తరహా ఉద్యోగాలకు ఒక డిగ్రీకి వేరువేరు మార్కులు ఎందుకో ఇప్పటికీ అర్థం కాని పరిస్థితి.

> అధ్యాపకుల నియామకాల్లో అవినీతి జరుగుతోందంటూ రోజూ పత్రికల్లో చూస్తూనే ఉంటాం. భారతీయార్ వర్సిటీ వీసీ ఒక అధ్యాపక పోస్టు ఇవ్వడానికి 30 లక్షల లంచం డిమాండ్ చేసి ఇటీవల ఏసీబీకి దొరికిపోవడం చూశాం. ఈ నిర్ణయం నేపథ్యంలో తప్పకుండా ఇది జాతీయ ఉన్నత విద్యా విపత్తుగా మారుతుందనడంలో సందేహం లేదు.

అలాగే డిగ్రీ, పీజీలలో పొందిన మార్కుల శాతాన్ని బట్టి కూడా మార్కులు ఇవ్వడం జరుగుతుంది. ఒకప్పుడు 50 శాతం సాధించడం గొప్ప అయితే ఇప్పుడు 80 శాతం సాధించడం గొప్ప. కాలానుగుణంగా మారిన పోటీలో అర్హులైన వారంతా దశాబ్ద కాలంలోని విద్యార్థులే అయినప్పుడు వారి మధ్యే గత మార్కుల బట్టి నిర్ణయం బాధాకరం. అధ్యాపకుల నియామకాల్లో అవినీతి జరుగుతోందంటూ రోజూ పత్రికల్లో చూస్తూనే ఉంటాం. భారతీయార్ వర్సిటీ వీసీ ఒక అధ్యాపక పోస్టు ఇవ్వడానికి 30 లక్షల లంచం డిమాండ్ చేసి ఇటీవల ఏసీబీకి దొరికిపోవడం చూశాం. ఈ నిర్ణయం నేపథ్యంలో తప్పకుండా ఇది జాతీయ ఉన్నత విద్యా విపత్తుగా మారుతుందనడంలో సందేహం లేదు. అప్పుడు ఉన్నత విద్యా - అధ్యాపకులు- అర్హతలు అనే అంశం మీదనే పీహెచ్డీ చేయాలసి వస్తుంది. విశ్వవిద్యా లయాలను విశ్వవిలయాలయాలుగా మార్చొద్దు . దేశ యువతని ఉన్నత విద్యకు దూరం చేయొద్దు.

◆ పచ్చల రాజేష్
8331823086.

మన లేఖలు

శివారు గ్రామాలకు మినీ బస్సు సౌకర్యం

తెలంగాణలో చాలా గ్రామాలకు నేటికీ ఎర్రబస్సు ఎరగని పల్లెలు చాలానే ఉన్నాయి. మారుమూల గ్రామాలకు బస్సు రాకపోకలు సాగించడానికి రోడ్డు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాగానీ, ఆర్టీసీ వారు వివిధ కారణాలను సాకులుగా చూపి బస్సు సదుపాయం కల్పించకపోవడం బాధాకరం. బస్సు సౌకర్యాలు లేనందున గ్రామీణ ప్రాంత ప్రజలు దగ్గరలోని ప్రధాన పట్టణానికి వివిధ అవసరాల నిమిత్తం ప్రైవేటు వాహనాలలో ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీకి రోడ్డు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నటువంటి గ్రామాలకు తక్షణమే ప్రధాన పట్టణం నుంచి పల్లెలకు ఆర్టీసీ మినీ బస్సు సౌకర్యాలను కల్పించడం ద్వారా మరింత ఆదాయం సమకూరి, గ్రామీణ ప్రాంత ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించినట్లవుతుంది.

- శ్రీనివాస్ చిరిపోతుల
వెంకటేశ్వర్లపల్లి

మెనూ పాటించని గురుకుల విద్యాలయాలు


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులాల వారీగా గురుకుల విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఈ గురుకులాల నిర్వహణకు సరిపడునంత నిధులు నిర్వాహకులైన ప్రిన్సిపాల్, వార్డెన్లు కుమ్మక్కై విద్యార్థుల నోటికాడి కూడును సైతం దొంగిలించి జేబులు నింపుకోవడం సిగ్గుచేటు. వరంగల్ అర్బన్ జిల్లాలోని చింతగట్టు క్యాంపులోని మైనారిటీ బాలికల గురుకుల విద్యాలయమే దీనికి తార్కాణం. మైనారిటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలో ఈ బండారం బైటపడింది. నీళ్ళచారు, ఉడకని అన్నం పెట్టి పేద విద్యార్థులను అనారోగ్యాలకు గురిచేస్తున్నారు. సానిటేషన్ నిర్వహణ కూడా లోపభూయిష్టంగా ఉందన్న విషయం వెల్లడయ్యింది. ఇక్కడే కాకుండా చాలా గురుకులాలలో ఇదే పరిస్థితి. ఇలాంటి అవినీతి అధికారులను కఠినంగా శిక్షించినప్పుడే ప్రజాధనం దుర్వినియోగం కాకుండా విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది. అవినీతి అక్రమాలు పునరావృతం కాకుండా స్థానిక ఉన్నతాధికారులు, చైల్డ్ వెల్ఫేర్ చైర్మన్‌ల ద్వారా తనిఖీలు చేయించాలి. గురుకులాల సక్రమ నిర్వహణకు ప్రత్యేక నిఘా విభాగాలు ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. అప్పుడే గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలు సజావుగా కొనసాగుతాయి. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి విద్యార్థుల మానసిక, శారీరక, వైజ్ఞానిక అభివృద్ధికి బాటలు వేయాలి.

- నల్లెల్ల రాజయ్య, టీపీపీఎస్ఎస్ఎస్

కమ్యూనిస్టుల ఐక్యత అవశ్యం

దేశంలోనూ, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టులు ఐక్యం కావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్నో రాజకీయ, సామాజిక ఉద్యమాలు నిర్వహించి, తాడిత, పీడిత, నిరుపేదలు, బాధితులు పక్షాన నిలిచి సిద్ధాంతానికి కట్టుబడి నిబద్ధతతో పనిచేసే కమ్యునిస్టులు నవ్యాంధ్ర శాసనసభలో స్థానం సంపాదించుకోలేక పోవడం బాధాకరం. దేశ రాజకీయాల్లో ఒకప్పుడు అన్ని అంశాల్లో కీలక పాత్ర పోషించారు. వామ పక్ష ఉద్యమాల వల్లే భూ సంస్కరణలు, భూసేకరణ వంటి అతి ముఖ్యమైన చట్టాలు వచ్చాయి. ఎంతో ఉద్యమ చరిత్ర కలిగిన జాతీయ పార్టీలైన కమ్యునిస్టులు 2014 ఎన్నికల్లో 543 లోక్‌సభ స్థానాలకు కనీసం వంద స్థానాల్లో కూడా పోటీ చేయలేని స్థితి. సీపీఎం 9, సీపీఐ 1 స్థానంలో మాత్రమే గెలవగలిగారంటే దేశంలో వారి స్థానం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఉభయ కమ్యునిస్టులకూ 2 శాతం సీట్లు గానీ, 4 శాతం ఓట్లుగానీ రాలేదు. ప్రజా పోరాటాల్లో, జాతీయ ప్రాధాన్యత గల అంశాల్లో, సిద్ధాంత పరమైన చర్చల్లో ముందుండి సమసమాజ నిర్మాణానికి పాటుపడుతూ కులరహిత సమాజం కోసం ప్రజల్లో చైతన్యం కలిగించే ఉభయ కమ్యునిస్టులు 1952 సార్వత్రిక ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి ఎన్నికల్లో అంతకంతకూ కుచించుకుపోవడానికి కారణాలేంటో ఆలోచించారా? 25 ఏళ్లు ఏకచక్రాధిపత్యం వహించిన బెంగాల్లో ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆలోచించారా? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 34 స్థానాలు గెలుచుకొని ఇప్పుడు ఏ స్థితిలో ఉన్నారు? బీజేపీని ఓడించి కాంగ్రెసును గెలిపించడం, కాంగ్రెస్‌ను ఓడించి బీజేపీని గెలిపించడమే వామపక్ష విధానంగా మారిందన్న విమర్శలున్నాయి. వామపక్షాలు బలపడేది ఎప్పుడు? ఆ ఆలోచనలు ఏమైనా చేస్తున్నారా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

కొంతమంది కమ్యునిస్టుల విభజన జరగకపోతే దేశంలో కమ్యూనిజం బలంగా ఉండేదని వాదిస్తుంటే, మరి కొందరు ఆనాడు కమ్యునిస్టుల విభజన జరగకపోతే దేశంలో ఈ రోజు కమ్యూనిజమే ఉండేది కాదని వాదిస్తున్నారు. ఐక్య ఉద్యమాల ద్వారా ఫలితాలు సాధించవచ్చన్న విషయం వీరికి తెలియంది కాదు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి అంటారు. వీరు



మాత్రం ఏకంకారు. పారిశ్రామిక విప్లవంతో బలపడిన కమ్యూనిస్టులు, కంప్యూటర్ విప్లవంతో బలహీనపడ్డారు. దానికితోడు విభేదాలతో కొన్ని ప్రాంతాల్లో ఉనికిని కోల్పోయారు. ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పులు, కార్పొరేట్ శక్తులు బలపడటంతో వారి పంథాను కూడా మార్చుకోవలసిన అవసరం ఏర్పడింది. చట్టసభలలోగానీ, బయటగానీ ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని, నిలదీస్తారని, విధాన పరమైన అంశాలను శాస్త్రీయంగా చర్చిస్తారని పేరుండేది. విషయ పరిజ్ఞానం, వాదనాపటిమ గల నేతలుండేవారు. ఎవరి పొత్తుతో గెలిచినా ఎక్కువ సందర్భాలలో వారి సిద్ధాంతాలకు కట్టుబడే నిలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో 1994లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకొని ఉభయ కమ్యునిస్టులు 34 శాసన సభా స్థానాలు గెలుచుకున్నారు. నూతన ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో పెందుర్తి, చింతపల్లి, ఆచంట, పెనుగొండ, విజయవాడ పశ్చిమ, నిడుమోలు, మంగళగిరి, తాడికొండ, సత్తెనపల్లి, సంతనూతలపాడు, ఆలూరు, అనంతపురం, కర్నూలు మొత్తం 13 స్థానాల్లో విజయం సాధించారు. సీపీఐ 6 స్థానాలను, సీపీఎం 7 స్థానాలను గెలుచుకున్నాయి. అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తామని ఆహ్వానించినా తిరస్కరించిన చరిత్ర వారిది. నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం. అధికార పక్షానికి మిత్రులుగా ఉన్నప్పటికీ ప్రజలపక్షాన నిలిచి పోరాడారు.ప్రజలలో పట్టు సంపాదించారు. ఆ పార్టీలలో, నాయకులలో పోరాట పటిమ తగ్గడం, రాజకీయ, ఆర్థిక, సామాజిక తదితర అంశాల్లో, ప్రజల ఆలోచనా విధానంలో మార్పులు రావడం, కులం పునాదులు గట్టిపడటం లాంటి కారణాల వల్ల కాలక్రమంలో రాష్ట్రంలోని కమ్యూనిస్టు కంచుకోటలన్నీ బద్దలయ్యాయి. కులం ప్రభావం ఈ పార్టీలపై కూడా బలీయంగా పడిందన్న విమర్శలు వినవస్తున్నాయి. ఆ జాఢ్యాన్ని వదిలించుకొని దళితులను, బలహీనవర్గాల వారిని రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించవలసిన అవసరం ఉంది.

తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రం విడిపోవాలని సీపీఐ, కలసి ఉండాలని సీపీఎం స్పష్టంగా చెప్పినా ఏపీలో సీపీఎం కూడా ఒక్క స్థానం గెలుచులేక పోవడం విచిత్రమైన పరిస్థితి.

ఈ నేపథ్యంలో ఏదైనా బలమైన జాతీయ లేదా ప్రాంతీయ పార్టీలతో పొత్తుపెట్టుకొని చట్టసభలలో స్థానం సంపాదించడంతో పాటు బలపడటంలో తప్పులేదన్నది కొందరి భావన. ఉనికి చాటుకోవడానికి, శాసనసభ స్థానాలు సంపాదించుకోవడానికి అది ఉపయోగపడుతుంది. పొత్తు పెట్టుకున్నంత మాత్రాన సిద్ధాంతాలను వదులుకోవలసిన, ఆలోచనలను చంపుకోవలసిన అవసరంలేదు. గతంలో టీడీపీతో పొత్తే అందుకు నిదర్శనం. చట్టసభలలో తమ వాణి వినిపించడానికి అవకాశం ఏర్పడుతుంది. అసలు లేని దానికంటే కొంతలో కొంత మేలేకదా అన్నది మరికొందరి వాదన. నవ్యాంధ్రలో కమ్యూనిస్టులు లేని శాసనసభ ఏర్పడటం చాలామందికి బాధ కలిగించింది. దేశం, రాష్ట్రంలోనూ ప్రస్తుత పరిస్థితుల్లో పట్టుదలకు పోకుండా విభేదాలకు స్వస్తిచెప్పి ఉభయ కమ్యూనిస్టులూ విలీనం లేక పొత్తు ద్వారానైనా ఐక్యతను చాటిచెప్పవలసిన అవసరం ఏర్పడింది. బాధ్యత గల ప్రతిపక్షం పాత్ర పోషించవలసిన అవసరం మాత్రం ఉంది.

◆ ఎస్.భరత్
8520920446

మనం
కుటుంబం
శుక్రవారం, 16 ఫిబ్రవరి 2018
www.manamnews.com





పారాహుషార్!

హైదరాబాద్ నగర మకుటంలో మరో కలికితురాయి చేరింది. ఇప్పటికే షీ టీమ్స్‌తో మహిళలకు భద్రత కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా, వుమెన్ పెట్రోలింగ్‌తో మరో అడుగు ముందుకేసింది. జంటనగరాల్లో మహిళలకు మరింత భద్రత కల్పించేలా, మహిళా పోలీసు పెట్రోలింగ్ బృందాలు రంగంలోకి దిగాయి. ఇప్పటికే 96 మంది వుమెన్ పోలీసులు ఇలా పెట్రోలింగ్ కోసం విధుల్లో చేరేందుకు శిక్షణ ముగించుకోగా, ప్రస్తుతానికి బోయిన్‌పల్లి స్టేషన్‌లో ఇద్దరు మహిళా పోలీసులు డ్యూటీలో చేరారు. లక్ష్మి, స్వాతి అనే ఇద్దరు గ్రాడ్యుయేట్లు ఇటీవలే తెలంగాణ పోలీస్ అకాడమీలో 9 నెలల పాటు కఠోర శిక్షణ ముగించుకుని బోయిన్‌పల్లి పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.





సబలలకు అభినందనలు

రయ్‌మని యూనిఫాంలో దూసుకుపోతూ, అనుమానం వచ్చిన వారందరినీ ప్రశ్నిస్తూ, అడుగడుగూ గాలిస్తున్న వీరిని సిటీలో చూసి ముచ్చటపడని వారు లేరంటే అతిశయోక్తి కాదు. వీరిని చూసి సెల్ఫీలు తీసుకునేవారు కొందరైతే, వీరిని వీడియోలు, ఫొటోలు తీసేవారు మరికొందరు. లక్ష్మి అనే మహిళా కానిస్టేబుల్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అడుగు పెట్టగా, స్వాతి మాత్రం ఎంపీసీ కెమిస్ట్రీ డ్రాప్ అవుట్. ఫిబ్రవరి ఒకటిన వీరిద్దరూ విధుల్లో చేరి, వాలెంటైన్స్ డే రోజు స్పెషల్ డ్యూటీ చేయడం విశేషం. అయితే ప్రేమికుల రోజునాడు మాత్రం, వీరిని చూసిన ఆకతాయిలు పరుగు లంకించుకోగా, స్థానికంగా ఉన్న కుటుంబాలన్నీ ఆనందంలో ఉబ్బి తబ్బిబ్బయ్యాయి. మహిళలంతా వీరిని చూసి, దగ్గరికి వచ్చి అభినందిస్తున్నారని లక్ష్మి, స్వాతి సగర్వంగా చెబుతున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్

సాధారణంగా ఎవరైనా పోలీస్ స్టేషన్ వెళ్లాలంటే సంశయిస్తారు, ఇక మహిళలైతే మరీనూ, అందునా అమ్మాయిలైతే ఇంకా ఎక్కువ భయపడతారు. అందుకే స్వయంగా మహిళలతో పెట్రోలింగ్ చేయిస్తే, మహిళా సమస్యలు గుర్తించి, పరిష్కరించేందుకు మార్గం సుగమం అవుతుందనే ఆలోచనలో నుంచి పుట్టిందే ఈ వుమెన్ కాప్ పెట్రోలింగ్ టీమ్. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కారమవడంతో పాటు, కంప్లైంట్లు పెండింగ్‌లో పడే అవకాశం ఉండదు, పైపెచ్చు నేరస్థులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునే అవకాశం కూడా ఉంటుంది. అందుకే ప్రధాన కూడళ్లు, జనసందోహం ఎక్కువగా ఉండే బస్టాపులు, రైల్వే స్టేషన్లు, కాలేజీలు, స్కూళ్లు, షాపింగ్ మాల్స్, మార్కెట్ వంటి ప్రాంతాల్లో వీరితో ఎక్కువగా పెట్రోలింగ్ నిర్వహిస్తారు. కాలేజీ టైములో వీరు బీటు కానిస్టేబుల్స్‌గా డ్యూటీలో దిగితే, కుర్రాళ్లు వేషాలు వేయకుండా తమ దారిన తాము బుద్ధిగా వెళ్తున్నారు.

ఉత్తరాదిలో ఎక్కువ టీమ్స్


ఢిల్లీలో 'రఫ్తార్' పేరుతో మహిళా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. వీరు రేయింబవళ్లు విధుల్లోనే ఉంటారు. ఇక 'ఆల్ వుమెన్ కాప్స్' పేరుతో పింక్ సిటీ జైపూర్‌లో కాపలా కాసే మహిళా బీట్ కానిస్టేబుళ్లు వందల మంది ఉన్నారు. ఉదయ్‌పూర్, అలహాబాద్, త్రివేంద్రం, బెంగళూరు, చెన్నై ఇలా పలు నగరాల్లో వుమెన్ పెట్రోలింగ్ టీమ్‌లు పహారా కాస్తున్నాయి. ఉత్తరాదిలో ఈ టీమ్‌ల సంఖ్య చాలా ఎక్కువగా ఉండగా, ఇప్పుడిప్పుడే దక్షిణాదిన కూడా వీరి సంఖ్య పెరుగుతోంది. ఇటీవలే అలహాబాద్‌లో ముగిసిన 'మాఘమేళ'లో సైకిళ్లు, బైకులపై వీరితో నైట్ డ్యూటీలు చేయించడంతో మేళాకు తరలి వచ్చిన మహిళా భక్తులు సురక్షితంగా యాత్ర ముగించారు. మఫ్టీలో వచ్చి ఆకతాయిలను అరెస్ట్ చేస్తున్న వుమెన్ పెట్రోలింగ్ కాప్స్ జులాయిల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి.













ఓల్డీస్.. కాదు.. సూపర్ మోడల్స్


సాధారణంగా మోడలింగ్ అంటే టీనేజ్‌లో ఉన్నవారితో, లేదా ఇంకా 30ల్లో పడని మోడల్స్‌తోనో హొయలొలికిస్తారు. కానీ 45 ఏళ్ల పైబడ్డవారే మోడలింగ్ చేసేందుకు అర్హులంటూ నిబంధనలు విధించింది ఓ రష్యన్ మోడల్ ఏజెన్సీ. ఈ ఏజెన్సీలో గరిష్ఠ వయసున్న మోడల్ వయసు తెలిస్తే మీరు అవాక్కవుతారు. 85 ఏళ్ల వయసున్న మోడల్ ఈ ఏజెన్సీలో సీనియర్ మోస్ట్ మోడల్ అంటూ సంస్థ ప్రకటించింది.


నాలుగు పదులు దాటితేనే అర్హులు !


'ఓల్డుష్క' అనే ఈ మోడలింగ్ ఏజెన్సీలో ఒక్కపలుచని టీనేజర్లతో అస్సలు పనేలేదు. కేవలం నాలుగు పదులు దాటిన వారే ఇక్కడ మోడలింగ్ కోసం అడుగుపెట్టాలి. చాలామంది సీనియర్ సిటిజన్లు మోడలింగ్‌పై ఆసక్తి చూపడంతో పాటు, ఇలా ఇక్కడికి వచ్చిన వారికి ఆఫర్లు వస్తుండడంతో బిజీ అయిన ఓల్డుష్క ఏజెన్సీకి మాస్కోతో పాటు నాలుగు బ్రాంచిలు ఉన్నాయి. ఎన్నో అగ్రిమెంట్లు, ఎండార్స్‌మెంట్స్, ర్యాంప్ వాక్‌లతో గత ఏడాదిన్నరగా ఈ కంపెనీ పరపతి విపరీతంగా పెరిగింది. ఇక్కడి మోడల్స్‌కు చేతినిండా పని, డబ్బు దక్కుతోంది. అంతేకాదు వీరిలో అత్యధికులు సెలబ్రిటీలుగా మారిపోయారు కూడా.


స్టీరియోటైప్‌కు చెక్


అసలు మోడలింగ్ పరిశ్రమనే స్టీరియోటైప్‌గా ఉంటుందనే ఓల్డుష్క సంస్థ, ఏ ప్రాడక్టుకైనా వయసుతోనే క్రెడిబిలిటీ వస్తుందని, టీనేజర్లను చూపి అడ్వర్టయిజ్‌మెంట్లు చేస్తే ఏం విశ్వసనీయత ఉంటుందంటారు. ఎంత వయసైనా నవ యవ్వనంగా ఉండటం సాధ్యమని చూపేవారే అసలైన బ్రాండ్ అంబాసిడర్లు అంటూ ఓల్డుష్క సగర్వంగా చెబుతుంది. అసలు అందానికి వయసుంటుందా? ఇది వీరు వేసే మిలియన్ డాలర్ల ప్రశ్న. ముత్తానికి వచ్చాడే వయసులో వీరు సూపర్ మోడల్స్‌గా తళుకులీనుతున్నారంటే వీరిలో ఎంత ఆత్మవిశ్వాసం ఉందో!















ధగధగలు



బెంగళూరులో ప్రారంభం కానున్న జువెల్స్ ఆఫ్ ఇండియా ప్రదర్శనపై నిర్వహించిన కార్యక్రమంలో మోడల్స్ నగలు ప్రదర్శించారు. మనదేశంలో అంతకంతకు పెరుగుతున్న బంగారు వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన యాంటిక్, టెంపుల్ డిజైన్ జువెలరీ కొలువు తీరే ఈ ఎగ్జిబిషన్‌కు దేశ విదేశాల నుంచి స్టాల్స్ పెట్టేందుకు వ్యాపారులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.







'క్షుద్ర' మానవులు!

(మొదటి పేజీ తరువాయి)

నిశితంగా పరిశీలించారు. అటుపైన 40 మంది సాక్షులను, 45 మంది అనుమానితులను ప్రశ్నించారు. పరిశోధనతోపాటు సేకరించిన సాక్ష్యాధారాల మేరకు రాజశేఖర్, శ్రీలత దంపతులతోపాటు ఒక మాంత్రికుడు, పాపను తీసుకొచ్చిన మరో ఇద్దరుసహా ఆరుగుర్ని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే...

క్యాబ్ డ్రైవర్‌గా రాజశేఖర్ (40) భార్య శ్రీలత (35)కు నాలు గేళ్లుగా ఆరోగ్యం బాగాలేదు. ఎన్ని ఆస్పత్రులకు తీసుకెళ్లినా, ఎందరో నిపుణులకు చూపించినా ఆమెకు స్వస్థత చేకూరలేదు. ఈ పరిస్థితుల నడుమ సమ్మక్క-సారలమ్మలకు మొక్కుకుందామని రెండేళ్ల కిందట రాజశేఖర్ దంపతులు మేడారం జాతరకు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ ఓ కోయదొర భవిష్యవాణి చెప్పడం విని, అతణ్ని ఆశ్రయించారు. దీంతో శ్రీలత అనారోగ్యానికి కారణం క్షుద్రశక్తులేనని, దంపతులిద్దరూ నగ్న పూజలు చేసి నరబలి ఇస్తే సమస్యలు తీరుతా యని అతడు నమ్మబలికాడు. తర్వాత నగరానికి తిరిగి వచ్చిన ఈ దంపతులు ఆనాటినుంచీ నరబలికి సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా పలువురిని సంప్రదించినా వారి ప్రయత్నం ఫలించలేదు. ఏదో ఒక అవకాశం దొరక్కపోతుందా అని రాజశేఖర్‌తోపాటు అతడికి సహకరించినవారు ఎదురుచూశారు. ఆ మేరకు చివరకు జనవరి 31న బోయగూడ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారి వద్ద నుంచి నెలల వయసున్న పాపను అపహరించారు. అదేరోజు రాత్రి పీర్జాదిగూడ ప్రతాప సింగారం మూసీ కాలువ వద్ద క్షుద్రపూజలు చేసి, పాపను బలి ఇచ్చారు. మొండెం నుంచి రక్తస్రావం ఆగిపోయాక నదిలో పడేసి తలను మాత్రం ఇంటికి తెచ్చారు. ఫిబ్రవరి 1 తెల్లవారుజామున 3:00 గంటల ప్రాంతంలో పాప తలను ముందుపెట్టుకుని దంపతులిద్దరూ నగ్నపూజలు చేశారు. అటుపైన తలకు చంద్రుని వెలుగు, సూర్యకిరణాలు ప్రసరించాలని మాంత్రికుడు చెప్పడంతో శిరసును మేడపై ఉంచారు. అయితే, తెల్లవారిన తర్వాత దుస్తులు ఆరవేసేందుకు డాబాపైకి వచ్చిన రాజశేఖర్ అత్త పాప శిరసును చూసి కేకలు వేసింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పాప తలను పోలీసులు పోస్టుమార్టానికి పంపించారు. ఫిబ్రవరి 2న రాజశేఖర్ ఇంట్లో ఒకచోట చిన్న రక్తపు మరకను గమ నించిన క్లూస్ టీం సిబ్బంది ఆ నమూనాను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. దీంతో అది చిన్నారి తలనుంచి స్రవించిందేనని తేలింది. దీంతో రాజశేఖర్, శ్రీలత దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. వారిని లోతుగా ప్రశ్నించి, నిజం కక్కించారు.

గిట్టుబాటుకు చట్టం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో గురువారం మర్రి చెన్నారెడ్డి భవన్‌లో నిర్వహించిన 'కిసాన్ ముక్తి సదస్సు'లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సాగుకు ఖర్చులు పెరుగుతున్నాయి తప్ప.. మద్దతు ధర పెరగడం లేదన్నారు. వ్యవసాయ సాగు ఖర్చుతో పోల్చుకుంటే.. ఈ ధరలు ఏమాత్రం సరిపోవడం లేదని తెలిపారు. పత్తికి మద్దతు ధర రూ.5500 పైగా ఉండాలని, వాస్తవంగా చూస్తే సాగుకు అవుతున్న ఖర్చుల కంటే తక్కువగా కనీస మద్దతు ధర ఉంటుందని ప్రభుత్వాలే అంగీకరిస్తున్నాయని తెలిపారు. అధిక శాతం మంది రైతులు ప్రైవేటు అప్పుల మీదనే ఆధారపడ్డారని, బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రుణాలు తీసుకున్న ఐదెకరాలలోపు భూమి ఉన్నవారి సంఖ్య చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్వామినాథన్ కమిటీ సైతం ధ్రువీకరించిందని గుర్తు చేశారు. ఏ ఒక్క రైతు కూడా అప్పు తేకుండా వ్యవసాయం చేయడంలేదని, సగటున రైతులకు రూ.4 లక్షల అప్పు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయ ఖర్చులను నియంత్రించాలని, వ్యవసాయానికి కావాల్సిన ఉత్పత్తికారకాలను తక్కువ ధరకు అందించాలని వివరించారు. దేశవ్యాప్తంగా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పంటలు నష్టపోయినప్పుడు పంటనష్ట పరిహారం చెల్లించాలనే డిమాండ్లను బలంగా విన్పిస్తున్నారని చెప్పారు. వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ దశలో దేశవ్యాప్తంగా అన్ని రైతు సంఘాలు కలవడం హర్షించాల్సిన విషయమని చెప్పారు. ధరలను ప్రభుత్వం నియంత్రించడం వల్లే రైతు అప్పులపాలు అవుతున్నాడన్నారు. తక్కువ ధరలకు పంటల ఉత్పత్తులను కొనడం వల్లే ఈ పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రుణవిముక్తిని హక్కుగా చేయాలని, రైతులు ప్రభుత్వాన్ని యాచించే విధానం పోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పండిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని, అదీ రైతుల హక్కుగా మారాలని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం చేయాలని, చట్టాల ద్వారా చాలా సాధించుకోవచ్చని తెలిపారు. ప్రతిసారి పంటనష్టం పరిహారంకోసం ప్రభుత్వం వైపు ఎదురుచూడ కుండా నష్టపరిహారం చెల్లించడాన్ని హక్కుగా చేయాలని పేర్కొ న్నారు. వీటిని సాధిస్తేనే రైతుల మనుగడ సాధ్యమవుతుందని వివరించారు. ఏఐకేఎస్‌సీసీ జాతీయ కార్యవర్గ సభ్యుడు యోగేంద్రయాదవ్ మాట్లాడుతూ అసెంబ్లీ ప్రజాప్రతినిధులకు వ్యవసాయంతో సంబంధాలు తెగిపోయాయన్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా 191 రైతు సంఘాలు ఐక్యమవ్వడం గొప్ప పరిణామమన్నారు. రాజకీయ నాయకులకు రైతులతో పనిబడే సంవత్సరం రాబోతుందని, ఈ సమయంలోనే అందరూ ఏకమై హక్కుల్ని సాధించుకోవాలని సూచించారు. రైతులందరూ కలిసి మల్లన్న సాగర్ భూసేకరణను ఆపిన విషయాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్ని నిర్బంధాలు పెట్టినా.. రైతులు లెక్క చేయకుండా దాన్ని అడ్డుకున్నారని గుర్తు చేశారు. ఇంతటి నిరంకుశ పాలన మధ్యలో రాస్తారోకో చేయడమంటే గొప్ప విషయమని పేర్కొన్నారు. రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రైతులకు రుణవిముక్తులను చేయాలని పెద్ద ఎత్తున ఆందోళన చేశారని వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని చాలా సంవత్సరాల తర్వాత పార్లమెంట్‌లో చర్చ జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులకు తెలంగాణ రైతులు పోరాట పతాకంగా ఉండాలన్నారు. రైతులు ప్రభుత్వాలను శాసించే స్థితికి రావాలన్నారు. ఇంతకుముందు రాజకీయాలంటే సమస్యల మీద పోరాడాలనేలా ఉండేదని, ప్రస్తుతం డబ్బులు ఎలా సంపాదించుకోవాలి? వార్త ఏలా రాసుకోవాలనే దానిపై రాజకీయాలు నడుస్తున్నాయని చెప్పారు. ఇలాంటి రాజకీయాల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. సదస్సులో కిసాన్ సంఘర్ష్ సమితి నాయకుడు డాక్టర్ సునీలం, డాక్టర్ ప్రకాశ్ పొప్లై, రైతు స్వరాజ్య వేదిక నాయకులు విస్సా కిరణ్‌కుమార్, తెలంగాణ రైతు జేఏసీ కన్వీనర్ కన్నెగంటి రవి, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ, అచ్యుత రామారావు, టి.సాగర్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 19న అన్ని రీజనల్ కార్యాలయాల వద్ద సామూహిక నిరాహార దీక్షలకు పిలుపునిచ్చింది. తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ) ఈ నెల 22న చలో బస్‌భవన్, టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) ఈ నెల 23న బస్‌భవన్ వద్ద ధర్నాలు నిర్వహించనున్నాయి.

నియామకాలు లేక పని భారం

రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఆర్టీసీలోని వివిధ విభాగాల్లో దాదాపు 5 వేల మంది ఉద్యోగ విరమణ చేశారు. 2014 నుంచి ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. ఈ పనిభారం మొత్తాన్ని అధికారులు తమపైన మోపుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏ డిపోలో కూడా పనివేళలు సక్రమంగా అమలు కావడంలేదని, ఒక్కోసారి నిర్విరామంగా 15గంటలకు పైగా పనిచేయాల్సి వస్తోందని కార్మికులు చెబుతున్నారు. దీని వల్ల డ్రైవర్లు ఒత్తిడి, అలసటకు గురయి ప్రమాదాలు జరిగే ప్రమాదం లేకపోలేదు. సిబ్బందిని నియమించకుండా టికెట్లు ఇచ్చే బాధ్యతను కూడా డ్రైవర్లపైనే మోపుతున్నారు. దీంతో డబ్బుల లెక్క చూసుకోవడం, ప్రతి స్టాపులో ఎంతమంది ప్రయాణికులు ఎక్కారన్న విషయాన్ని, బస్సులో ఎంతమంది ఉన్నారన్న విషయాన్ని సరిచూసుకోవడం వంటివి డ్రైవర్లకు తలనొప్పిగా మారాయి.

చెప్పేది చాంతాడంత.. ఇచ్చేది ఇసుమంత

రాష్ట్రంలో టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ ఆర్టీసీ కార్మికులను, సంస్థను ఆదుకుంటామని



పలుమార్లు ప్రకటించారు. చెప్పినట్టుగానే కార్మికులు అడిగినదానికంటే ఎక్కువ ఫిట్‌మెంట్ ఇచ్చి ఆశ్చర్యానికి గురిచేశారు. ఏటా బడ్జెట్‌లో కూడా ఆర్టీసీకి భారీగానే నిధులు కేటాయించారు. భాగ్యనగరానికి సంబంధించి

ఆర్థిక సంవత్సరం	కేటాయింపులు	విడుదల
2015-16	400	211
2016-17	633	275
2017-18	994	325
మొత్తం	**2027**	**811**

ఆర్టీసీ బాధ్యతను జీహెచ్‌ఎంసీకి అప్పజెప్పుతామన్నారు. అది నేటికీ నెరవేరలేదు. ఈ మూడేండ్ల నుంచి ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ.2027 కోట్లు కేటాయించారు. కానీ, విడుదల చేసింది రూ.811 కోట్లు మాత్రమే. ఏటా ఇదే తంతు జరుగుతుండడంతో ఈసారి బడ్జెట్‌లో గత మూడు బడ్జెట్లలో కేటాయించి, విడుదల చేయని రూ. 1216 కోట్లు సహా 2 వేల కోట్లు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.

కార్మికుల డిమాండ్లు

➡ నియామకాలు చేపట్టి పని బారాన్ని తగ్గించాలి, కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేయాలి
➡ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలి
➡ ఏప్రిల్, 2014 నుంచి 62శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలి
➡ పనిగంటలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి
➡ మహిళ కండక్టర్లకు రాత్రి 8 గంటల వరకే విధులు ముగిసేలా చర్యలు తీసుకోవాలి.
➡ అర్హులకు పదోన్నతులు కల్పించాలి, పదోన్నతుల్లో రిజర్వేషన్లు పాటించాలి
➡ సకల జనుల సమ్మెకాలాన్ని వేతన సెలవుగా ప్రకటించి, జీతాలు చెల్లించాలి
➡ విధి నిర్వహణలో ప్రాణాలొదిలిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
➡ 1963నాటి రెగ్యులేషన్స్‌లో మార్పులు చేయాలి

సంస్థ పరిరక్షణ కోసం..

➡ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలి
➡ అద్దె బస్సులను రద్దు చేసి, కొత్త బస్సులు కొనుగోలు చేయాలి
➡ డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి సంస్థకు డీజిల్ డీలర్‌షిప్ ఇవ్వాలి, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ మినహాయింపునివ్వాలి
➡ 2018-19 బడ్జెట్‌లో సంస్థకు రూ.2 వేల కోట్లు కేటాయించి, వెంటనే ఆ నిధులు విడుదల చేయాలి.

రెండు ప్రాజెక్టుల పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

త్వరితగతిన పూర్తయి రైతులకు మేలు జరుగుతుందన్నారు. తన అభిప్రాయాలతో కేంద్రమంత్రి గడ్కరీ సూత్రప్రాయంగా ఏకీ భవించారని హరీశ్ రావు చెప్పారు. అన్ని రాష్ట్రా లమంత్రుల అభిప్రాయలతో నివేదిక సమర్పిస్తే క్యాబినెట్ ముందు పెడతామని గడ్కరీ హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రి హర్షవర్ధన్‌తో మంత్రి హరీశ్ రావు సమావేశమయ్యారు. సీతా రామ ప్రాజెక్టుకు పర్యావరణ, వన్యప్రాణి అను మతులను మంజూరు చేయాలని కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌ను అడిగామని చెప్పారు.పాలమూరు రంగారెడ్డి మొదటి దశ అటవీ అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్టు హరీశ్ రావు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇచ్చినందుకు కేంద్ర మంత్రికి ధన్యవాదాలు చెప్పామని మంత్రి పేర్కొన్నారు.

నిధులివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరానికి వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. విభజన చట్టంలో తెలం గాణలోని 10 జిల్లాల్లో 9 జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించి, ప్రత్యేక నిధులు కేటా యించాలని పేర్కొన్నారు. దీని ప్రకారమే కేంద్రం నిధులు విడుదల చేస్తోంది. ఇప్పటి వర కు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేసి నందుకు అరుణ్ జైట్లీకి సీఎం కృతజ్ఞతలు తెలి పారు. 3.5 శాతం ఎఫ్.ఆర్.బి.ఎమ్ పరిమితిని కొనసాగించాలని సీఎం కోరారు. కేసీఆర్ వెంట ఎంపీ జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహా దారు రాజీవ్ శర్మ తదితరులు ఉన్నారు.

స్మగ్లింగ్ కోసం ఇద్దరు భార్యలు!

- ఫ్లాట్ కూడా అమ్మేసిన ప్రబుద్ధుడు
- విదేశాల నుంచి బంగారం స్మగ్లింగ్
- ముంబైలో పట్టేసిన కస్టమ్స్ అధికారులు

ముంబై, ఫిబ్రవరి 15: రెండు పెళ్లిళ్లు చేసుకుని, ఇద్దరు భార్యల సాయంతో బంగారం స్మగ్లింగ్ చేసి.. కోటీశ్వరుడు అయిపోవాలనుకున్న ఓ తమిళ తంబి పోలీసులకు అడ్డంగా దొరికేశాడు. ముంబై విమానాశ్రయం నుంచి తన భార్యతో కలిసి కోటి రూపాయల విలువైన నాలుగు కిలోల బంగారం తీసుకుని బయటకొస్తుండగా విమానాశ్రయంలో కస్టమ్స్ విభాగానికి చెందిన ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఏఐయూ) అధికారులు అతడిని పట్టుకున్నారు. శివదేవి బాలచంద్రన్ అనే మహిళ తన లోదుస్తులలో బంగారం దాచుకుని తన భర్త బాలసుబ్రమణ్యంతో కలిసి బయటకు వస్తుండగా కస్టమ్స్ అధికారులకు అనుమానం వచ్చి ఆమెను తనిఖీ చేశారు. తొలుత తనకేమీ తెలియదని బుకాయించినా.. ఆ తర్వాత ఆమె తన నేరాన్ని అంగీకరించింది. ప్రత్యేకంగా తయారుచేయించిన బ్రాలో దాచిపెట్టిన నాలుగు కిలోల బంగారాన్ని ఆమె బయటపెట్టింది. దాంతో భార్యాభర్తలు ఇద్దరినీ అరెస్టు చేశారు.

చెన్నైకి చెందిన బాలసుబ్రమణ్యం ఇటీవలే తన ఫ్లాటును



రూ. 65 లక్షలకు అమ్మేశాడు. ఆ డబ్బు మొత్తాన్ని బంగారం స్మగ్లింగ్‌కు పెట్టుబడిగా పెట్టాడు. ఆ డబ్బుతో తన ఇద్దరు భార్యలతో కలిసి విదేశాల నుంచి బంగారం తీసుకొచ్చేవాడు. తక్కువ ధరకు అక్కడ బంగారం కొని, ఇక్కడ ఎక్కువ ధరకు అమ్మేవాడు. అలా లాభాలు సంపాదించవచ్చని అనుకున్నాడు. రెండు మూడు సార్లు అలా ఎవరికీ పట్టుబడకుండా బంగారం తీసుకొచ్చి ఇక్కడ అమ్మడంతో అతడికి నమ్మకం కుదిరింది. ఒక్కోసారి ఒక్కో భార్యను తీసుకుని విదేశాలకు వెళ్లడం, వచ్చేటప్పుడు కూడా ఒకే ఎయిర్‌పోర్టు కాకుండా వేర్వేరు ఎయిర్‌పోర్టులలో దిగడం ద్వారా ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు. ఇద్దరు భార్యలకూ బంగారం దాచిపెట్టడానికి వీలుగా ప్రత్యేకమైన అరలతో కూడిన బ్రాలు తయారు చేయించాడు. అయితే అతడి అదృష్టం తిరగబడి.. ముంబై కస్టమ్స్ అధికారులకు దొరికేశాడు.

అసోంలో కూలిన గస్తీ విమానం

- ఇద్దరు ఐఏఎఫ్ పైలట్లు మృతి

మజౌలి(అసోం), ఫిబ్రవరి 15: భారత వైమానిక దళానికి చెందిన మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారని రక్షణశాఖ వెల్లడించింది. ఈమేరకు శాఖ అధికార ప్రతినిధి ఓ ప్రకటన విడుదల చేశారు. అసోంలోని మజౌలి ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. రోజువారీ గస్తీ విధుల్లో భాగంగా ఇద్దరు పైలట్లు ఈ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో బయలుదేరారు. అయితే,



జోర్హాట్ ఎయిర్ బేస్ నుంచి టేకాఫ్ తీసుకున్న కాసేపటికే ఎయిర్‌క్రాఫ్ట్ క్రాష్ ల్యాండ్ అయిందని తెలిపారు. ఈ ఎయిర్‌క్రాఫ్ట్ శిథిలాలను గుర్తించామని, సంఘటనకు కారణమేంటనే కోణంలో న్యాయవిచారణకు ఆదేశించినట్లు సైనిక ఉన్నతాధికారులు వివరించారు. కాగా, ఈ దుర్ఘటనలో వింగ్ కమాండర్లు జై పాల్ జేమ్స్, డి వాట్స్‌లు ప్రాణాలు కోల్పోయారని తేజ్‌పూర్‌కు చెందిన సైనిక అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ హర్షవర్ధన్ పాండే మీడియాకు వెల్లడించారు. అత్యవసర ల్యాండింగ్ ప్రయత్నంలో ఈ దుర్ఘటన జరిగి ఉండొచ్చని, ఈ ప్రయత్నంలో నేలకూలిన విమానంలో మంటలు రేగడంతో పూర్తిగా ధ్వంసమైందని చెప్పారు. బ్రహ్మపుత్ర ఒడ్డున దర్బార్ చాపొరి అనే ప్రాంతంలో కూలిపోయిందన్నారు. ఈ ప్రాంతంలో మనుష్య జీవనం లేదని వివరించారు. ప్రమాద సమాచారం అందగానే జోర్హాట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చెందిన ఐఏఎఫ్ సిబ్బంది, పోలీసులు, ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి పరుగులు తీశారని పాండే వివరించారు.

ఓ విద్యార్థి ఘాతుకం



హైస్కూల్లో విచ్చలవిడిగా కాల్పులు 17 మంది మృతి.. వారిలో పిల్లలు, టీచర్లు

- గ్యాస్ మాస్క్ ధరించి.. పొగబాంబు
- ఫైర్ అలారం మోగించి పిల్లలకు ఎర
- బయటకు రాగానే వారిపై కాల్పులు
- స్కూలు నుంచి బహిష్కరణే కారణమా?
- అమెరికాలో మళ్లీ తుపాకి సంస్కృతి



ఫ్లోరిడా, ఫిబ్రవరి 15: అమెరికాలో గన్ కల్చర్ మరోసారి తన విచ్చలవిడి రూపం బయటపెట్టింది. స్కూలు నుంచి తనను బహిష్కరించారన్న కోపంతో ఓ మాజీ విద్యార్థి మారణహోమానికి తెగబడ్డాడు. ముందుగా తాను గ్యాస్ మాస్కు ధరించి, పొగబాంబు వేసి.. ఫైర్ అలారం మోగించి దాంతో స్కూల్లో ఉన్న పిల్లలను బయటకు రప్పించాడు. లోపలెక్కడో మంటలు చెలరేగాయనుకుని అమాయకంగా బయటకు పరుగులు తీసిన విద్యార్థులపై.. తన వద్ద ఉన్న సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌తో విచ్చలవిడిగా కాల్పులు జరిపాడు. ఫ్లోరిడా రాష్ట్రంలోనే అతి పెద్ద స్కూళ్లలో ఒకటైన మార్జరీ స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్లో ఈ దారుణం చోటుచేసుకుంది. ఆ స్కూల్లో దాదాపు 3వేల మంది పిల్లలు చదువుతున్నారు. కనెక్టికట్‌లోని న్యూటౌన్‌లో గతంలో ఒక ప్రాథమిక పాఠశాలలో కాల్పుల ఘటన తర్వాత ఇదే అమెరికాలో స్కూలు పిల్లలపై జరిగిన అతిపెద్ద దాడి. కాల్పుల ఫలితంగా ఈ వారం మొత్తం స్కూలుకు సెలవులు ప్రకటించారు.

కాల్పుల విషయం తెలియగానే తల్లిదండ్రులు ఆందోళనతో స్కూలుకు వెళ్లగా అప్పటికే అక్కడకు స్వాట్ బృందాలు, అంబులెన్సులు చేరుకుని ఉన్నాయి. మరోవైపు ఎమర్జెన్సీ వర్కర్లు క్షతగాత్రులకు ఆ పక్కనే ప్రాథమికి చికిత్సలు చేస్తున్నట్లు లైవ్ టీవీ విజువల్స్‌లో కనిపిస్తోంది. పరిస్థితి చాలా దారుణంగా ఉందని, ఇది తమకు చాలా దుర్దినమని స్కూలు సూపరింటెండెంట్ రాబర్ట్ రూన్సీ అన్నారు.

మాజీ విద్యార్థి..

నిందితుడిని నికొలస్ క్రజ్ (19)గా గుర్తించారు. అతడిని అక్కడకు ఒక మైలు దూరంలో ఉన్న ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు పెద్దగా ప్రతిఘటించకుండానే లొంగిపోయినట్లు తెలిసింది. ఆ సమయానికి కూడా అతడి వద్ద పలు మందుగుండు మ్యాగజిన్లు ఉన్నాయని చెప్పారు. తన ముఖానికి ముందు తుపాకి పట్టుకుని ఫొటో తీసుకుని దాన్ని అతడు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినట్లు అదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి చెప్పాడు. స్కూల్లో చదివేటప్పుడు అతడు కొంత సిగ్గుపడుతూ ఉండేవాడని, తన లంచ్ బ్యాగ్ పట్టుకుని అటూ ఇటూ తిరుగుతుండేవాడని అన్నాడు. అయితే, క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు అతడిని స్కూలు నుంచి బహిష్కరించినందువల్లే కోపంతో ఇలా కాల్పులకు తెగబడి ఉంటాడని భావిస్తున్నారు.

మాటలు రావడం లేదు


ఈ దారుణం గురించి చెప్పడానికి తనకు మాటలు కూడా రావడం లేదని బ్రోవార్డ్ కౌంటీ పోలీసు అధికారి స్కాట్ ఇజ్రాయెల్ అన్నారు. స్కూలు భవనం లోపలే ఎక్కువ మంది చనిపోయారు. మరొకొందరు బయటకు వచ్చి కూడా ప్రాణాలు కోల్పోయారు. తాను క్లాసులో ఉండగా ఐదు రౌండ్ల తుపాకి మోత వినిపించిందని ఇంకో విద్యార్థి చెప్పాడు. తాము కిటికీలకు దూరంగా ఒక మూల నిలబడ్డామని, తమ టీచర్ లోపల లైటు ఆపేసి తలుపులు గడియ పెట్టేశారని తెలిపాడు. తాను భవనం నుంచి బయటకు వచ్చేటపుడు కారిడార్‌లో నలుగురు విద్యార్థులు, ఒక టీచర్ చనిపోయి కనిపించారన్నాడు. ఎట్టకేలకు తన తల్లి కనిపించడంతో ఊపిరి పీల్చుకుని బయటకు పరుగెత్తానని అన్నాడు.

ఉదయమే ఫైర్ డ్రిల్.. అంతలోనే

ఉదయం స్కూలు ప్రారంభమైనపుడు ఎప్పటిలాగే అక్కడ ఫైర్ డ్రిల్ నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 (అమెరికా కాలమానం ప్రకారం) సమయంలో మరోసారి అలారం మోగింది. దాంతో అది కూడా ఫైర్ డ్రిల్ అనుకుని విద్యార్థులంతా ఆ ప్రదేశానికి వెళ్లడం మొదలుపెట్టారు. అంతలోనే ఉన్నట్టుండి తుపాకి మోతలు వినిపించాయి. టీచర్లు మెట్ల నుంచి కిందకు పరుగులు తీయడం కనిపించింది. కొందరు ఫెన్సింగ్ దూకి మరీ బయటకు పారిపోసాగారు. పిల్లలు భయంతో పరుగులు పెడుతూనే తమ తల్లిదండ్రులకు తాము క్షేమంగానే ఉన్నామంటూ ఎస్ఎంఎస్‌లు పంపారు. ఈలోపు స్కూలు ప్రాంగణంలోను, భవనాల లోపల కూడా బుల్లెట్లు తగిలి కొంతమంది పడిపోవడం కనిపించింది. ఏం జరుగుతుందోనన్న భయంతో చాలామంది డెస్కుల కింద, అలమారాల లోపల, తలుపుల వెనకాల దాక్కున్నారు. పోలీసులు వెంటనే స్కూలు ఖాళీ చేయమని చెప్పడంతో.. పిల్లలు అంతా ఒక లైనులో తల మీద చేతులు పెట్టుకుని బయటకు బయల్దేరారు.

కూతురు ఎక్కడుందోనని..

సీజర్ ఫిగెరోవా అనే తండ్రి తన 16 ఏళ్ల కూతురు ఎక్కడుందోనని స్కూలు మొత్తం తిరిగి తిరిగి చూశాడు. తీరా అక్కడకు వెళ్లేసరికి పోలీసులు తుపాకులు పట్టుకుని కనిపించారు. స్కూలుకు తాళం వేశారని, కాల్పులు జరిపిన దుండగుడిని ఇంకా పట్టుకోలేదని టీవీలలో చెబుతుండటంతో అతడి భార్య అదే విషయం ఫోన్ చేసి చెప్పింది. రోడ్డుమీదకు వచ్చి చూస్తే పైన హెలికాప్టర్లు కనిపించాయి. తన కూతురు ఎక్కడుంతో అతడికి తెలియక పిచ్చిపట్టినట్లయింది. ఆమె ఫోన్ కూడా ఆన్సర్ చేయడంలేదు. ఎట్టకేలకు.. దాదాపు గంట తర్వాత తాను తన స్నేహితులతో కలిసి ఒక బీరువాలో దాక్కున్నానని ఆమె నుంచి ఎస్ఎంఎస్ రావడంతో అతడు ఊపిరి పీల్చుకున్నాడు. మరో విద్యార్థి కూడా తన తల్లిదండ్రులిద్దరికీ ఒక సందేశం పంపాడు. ''అమ్మా.. నాన్నా.. స్కూలు ప్రాంగణంలో తుపాకి కాల్పులు జరిగాయి. బయట పోలీసు సైరన్లు వినిపిస్తున్నాయి. నేను ఆడిటోరియంలో ఉన్నా.. తలుపులు తాళం వేసి ఉన్నాయి'' అని అందులో రాయడంతో ఆ తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.



ఐదేళ్ల క్రితం న్యూటౌన్‌లో...


ఇంతకుముందు 2012 డిసెంబరు 14న కనెక్టికట్ న్యూటౌన్‌లో కూడా ఇలాగే ఒక స్కూలుపై దుండగుడు దాడి చేశాడు. అప్పుడు జరిగిన ఘోరంలో 20 మంది ఒకటో తరగతి పిల్లలు, ఆరుగురు స్కూలు సిబ్బంది కలిపి.. మొత్తం 26 మంది మరణించారు. ఆ తర్వాత దుండగుడు ఇంట్లో మంచం మీద పడుకున్న తన తల్లిని కాల్చి చంపి, తనను తాను కూడా తుపాకితో కాల్చేసుకున్నాడు.

కొడుకు వీర్యంతో కవల మనవళ్లు

పుణె, ఫిబ్రవరి 15: మెదడులో కణితితో రెండేళ్ల క్రితం కొడుకు చనిపోయాడు. కానీ.. అతడి తల్లిదండ్రులకు వారసులు లేరన్న బెంగ తీరిపోయింది. చనిపోవడానికి చాలా కాలం ముందుగానే వైద్యులు సేకరించి.. భద్రపరిచిన అతడి వీర్యంతో దాత అండాలను ఫలదీకరించి, సరొగసీ పద్ధతిలో కవల మనవలను పొందారు! వైద్యశాస్త్రంలో చాలా అరుదుగా జరిగే ఈ తరహా ఘటన తాజాగా పుణెలో చోటుచేసుకుంది. మూడు రోజుల క్రితమే ఆ కవల మగపిల్లలు పుట్టారు. అనుకోకుండా.. ఈ ఘటనలో సరొగసీకి అంగీకరించినది కూడా చనిపోయిన యువకుడి అత్త కావడం విశేషం.

2013 సంవత్సరంలో జర్మనీలో ఉన్నతవిద్య చదువుతుండగా అతడికి మెదడులో కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. కెమోథెరపీ ఇస్తే అతడికి ఇక పిల్లలు పుట్టే అవకాశం ఉండదని భావించి, అతడి ఆమోదంతో వీర్యం సేకరించి దాన్ని 'క్రయో ప్రిజర్వ్' పద్ధతిలో భద్రపరిచారు. ఆ తర్వాత అదే సంవత్సరం సెప్టెంబరు నెలలో జర్మనీలోనే అతడికి కెమోథెరపీ చికిత్స ఇచ్చారు. అప్పటికి బాగానే ఉన్నా, 2016 సంవత్సరంలో మళ్లీ కేన్సర్ తిరగబెట్టడంతో అతడు పుణెలో చనిపోయాడు. ఆ తర్వాత అతడి తల్లిదండ్రులకు వైద్యులు అతడి వీర్యాన్ని అందజేశారు. తన కొడుకు చాలా తెలివైన వాడని, కెమోథెరపీ వల్ల కంటిచూపు కోల్పోయినా ధైర్యం మాత్రం సడలలేదని అతడి తల్లి చెప్పారు. చివరివరకు కేన్సర్‌తో పోరాడుతూ తమకు కథలు చెప్పి నవ్వించేవాడన్నారు. అందుకే తాము అతడి పిల్లలను చూడాలనుకున్నామని వివరించారు. జర్మనీలోని స్పెర్మ్ బ్యాంక్‌ను సంప్రదించి, అక్కడి నుంచి వీర్యం తెప్పించి పుణెలోని సహ్యాద్రి ఆస్పత్రి ద్వారా ఐవీఎఫ్ పద్ధతిలో ఫలదీకరణం చేయించారు. వైద్యులు అతడి కుటుంబానికి ఉండే భౌతిక లక్షణాలే (రంగు, ముఖం తీరు) ఉన్న దాత నుంచి అండం సేకరించారు. అతడి తల్లి గర్భకోశం పిల్లలను కనేందుకు అనువుగా ఉండకపోవడంతో నాందేడ్‌కు చెందిన సమీప బంధువు (38) అందుకు సమ్మతించారు.


గత సంవత్సరం మే నెలలో తాము రెండు పిండాలను ఆమె గర్భంలోకి ప్రవేశపెట్టామని, రెండూ బాగా ఎదిగి, సోమవారం నాడు పూర్తి ఆరోగ్యవంతులైన ఇద్దరు మగబిడ్డలు పుట్టారని వైద్యప్రక్రియ మొత్తాన్ని దగ్గరుండి పరిశీలించిన డాక్టర్ పురాణిక్ తెలిపారు. మన దేశంలో గతంలోకూడా ఇలాంటి కేసులు ఉన్నాయని, అయితే.. ఇలా ఎవరైనా మరణించిన తర్వాత వాళ్ల వీర్యం లేదా అండాలతో సరొగసీ చేయించడం నైతికంగా ఎంతవరకు సరైనదన్న చర్చ జరగాల్సి ఉందని చెన్నైకి చెందిన



ఇండియన్ సరొగసీ లా సెంటర్ వ్యవస్థాపకుడు హరి సుబ్రమణ్యన్ అన్నారు. పిల్లలను సాకేంత ఓపిక నాయనమ్మ.. తాతలకు ఉంటుందా, అసలు పిల్లలను కనేందుకు అతడు ముందుగా అనుమతి ఇచ్చాడా అనేది కూడా చూడాలన్నారు. పిల్లలను కనే హక్కు అందరికీ ఉన్నా.. మనవళ్లు లేదా మనవరాళ్లను కనే హక్కు మాత్రం ఉందో లేదో తెలియదని.. అదంతా పక్కన పెడితే అసలు పిల్లలకు తల్లిదండ్రులు ఎవరని చెప్పాలని ఆయన ప్రశ్నించారు. వైద్యపరంగా ఇది మంచి విజయమే గానీ, నైతికంగా తాను కూడా దీన్ని సమర్థించబోనని పుణెకు చెందిన ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ పంకజ్ సరోడే చెప్పారు.

నేపాల్ ప్రధానిగా ఓలీ

- రెండోసారి ఎన్నికైన వామపక్ష నేత
- 41వ ప్రధాన మంత్రిగా ప్రమాణం
- దేవ్‌బా నుంచి బాధ్యతల స్వీకారం



కాఠ్మాండు, ఫిబ్రవరి 15: హిమాలయ రాజ్యం నేపాల్ పీఠాన్ని మరోసారి వామపక్ష నేత ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలీ అధిష్ఠించారు. వామపక్ష రెబల్ పార్టీలతో జతకట్టి నేపాల్ పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించారు. చైనా అనుకూలిడిగా ముద్ర పడిన ఆయన గతంతో 2015 అక్టోబరు 11 నుంచి 2016 అక్టోబరు 3 వరకు నేపాల్ ప్రధానిగా సేవలందించారు. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ సీపీఎన్ నేత అయిన ఓలీ సీపీఎన్-యూఎంఎల్ కూటమిని ఏర్పాటు చేసి తాజా ఎన్నికలకు వెళ్లారు. ప్రస్తుతం రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ, మాదేశీ ప్రజాస్వామ్య హక్కుల సమాఖ్యతో పాటు మరో 13 పార్టీల మద్దతుతో ప్రధాని పదవిని దక్కించుకున్నారు. సీపీఎన్-యూఎంఎల్ ఛైర్మన్‌గా ఆయా పార్టీల సభ్యులు ఆయనను ఎన్నుకొని అనంతరం ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాయి. దీంతో నేపాల్ అధ్యక్షులు విద్యా దేవీ భండారి గురువారం ఓలీని దేశ 41వ ప్రధాన మంత్రిగా నియమించారు. ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించాయి. అనంతరం ప్రధానిగా ఉన్న నేపాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా నుంచి బాధ్యతలను తీసుకున్నారు. ముందటి ప్రభుత్వంలో నేపాల్ కాంగ్రెస్‌తో కలిసిసాగిన సీపీఎన్ మార్క్సిస్టు సెంటర్ పార్టీ ఇప్పుడు ఓలీతో జట్టుకట్టి అధికారంలో భాగస్వామి కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా 275 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో సీపీఎన్-యూఎంఎల్ 121 చోట్ల విజయం సాధించి నేపాల్ పార్లమెంటులో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. అధికారంలో ఉన్న నేపాల్ కాంగ్రెస్ పార్టీ 63 స్థానాలతో సరిపెట్టుకుంది. ఇక సీపీఎన్ మావోయిస్టు సెంటర్ పార్టీ 53 స్థానాల్లో గెలిచింది. ఈ పార్టీ ఓలీ నేతృత్వంలోని కూటమికి మద్దతు తెలపడంతో 174 సీట్ల బలంతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. మాదేశీ సమాఖ్య మద్దతుదారులైన రాష్ట్రీయ జనతా పార్టీ 17, ఫెడరల్ సోషలిస్టు పార్టీ 16 సీట్లను సొంతం చేసుకున్నాయి. ఈ పార్టీలు కూడా అధికార కూటమికి మద్దతు తెలిపాయి. కాగా, నేపాల్‌లో 2006 నుంచి దశాబ్ద కాలం సాగిన ప్రజా తిరుగుపాటు తర్వాత క్రమేపీ సమాఖ్య ప్రజాస్వామ్య దేశంగా అవతరిస్తున్న సమయంలో జరిగిన కీలక ఎన్నిక ఇది.

రక్షణ బడ్జెట్‌లో ఐదో స్థానం

- బ్రిటన్‌ను అధిగమించిన భారతదేశం
- తొలి నాలుగు.. అమెరికా, చైనా, సౌదీ, రష్యా

లండన్, ఫిబ్రవరి 15: రక్షణ రంగ బడ్జెట్‌లో భారతదేశం తొలిసారిగా యునైటెడ్ కింగ్‌డమ్‌ను అధిగమించి, ప్రపంచంలోనే ఐదో స్థానానికి చేరింది, అయితే చైనా కంటే చాలా దూరంలో ఉంది. ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్(ఐఐఎస్ఎస్) 'మిలటరీ బ్యాలెన్స్ 2018' పేరుతో ఇచ్చిన నివేదిక ప్రకారం 2017లో భారతదేశం రక్షణ రంగంలో 52.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేయడం ద్వారా యూకేను అధిగమించింది. 2016లో భారతదేశం రక్షణ రంగంలో 51.1 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. మరో పక్క 2016లో 52.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేసిన యూకే 2017లో 50.7 బిలియన్ డాలర్లు వెచ్చించింది. ఐఐఎస్ఎస్ నివేదిక ప్రకారం 602.8 బిలియన్ డాలర్ల వ్యయంతో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా, చైనా(150.5 బిలియన్ డాలర్లు), సౌదీ అరేబియా(76.7బిలియన్ డాలర్లు), రష్యా(61.2బిలియన్ డాలర్లు), భారత్(52.5 బిలియన్ డాలర్లు) వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రక్షణ రంగ బడ్జెట్ కేటాయింపులు భారతదేశం, యూకే మధ్య సైనిక సమతుల్యతను సూచిస్తుందని ఐఐఎస్ఎస్ దక్షిణాసియా సీనియర్ ఫెలో రాహుల్ చౌదరి అన్నారు. భారత తన సైనిక సామర్థ్యాన్ని ఆధునికరించుకుంటుందన్నారు. రక్షణ బడ్జెట్‌లో అమెరికా తర్వాత స్థానంలో ఉన్న చైనా, భారతదేశం కంటే మూడింతలు ఖర్చు చేస్తూ ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచింది. 2016-17లో చైనా రక్షణ రంగ వ్యయం 25 శాతం పెరిగితే అదే సమయంలో భారతదేశంలో 2.4శాతం మాత్రమే పెరిగింది. డొక్లాం ఘటన తర్వాత కూడా మిలటరీ సామర్థ్యంలో చైనా కంటే భారత్ వెనకబడే ఉంది. 2000 సంత్సరం నుంచి చైనా ఆయుధ సంపత్తిని చాలా పెంచుకుంది. పెద్దసంఖ్యలో సబ్‌మెరైన్‌లు, ఫ్రిగేట్స్, కార్వెట్టీలు నిర్మించుకుంది. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక కార్యకలాపాలకు అధికంగా దళాలును ఇస్తున్న భారతదేశం మేక్ ఇన్ ఇండియా పథకం ద్వారా రక్షణ రంగ పరిశ్రమల బలోపేతానికి కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశమిచ్చిందని ఆ నివేదిక చెప్పింది.

.. సిబ్బందితో శృంగారం వద్దు

- మంత్రులకు ఆస్ట్రేలియా ప్రధాని ఆదేశం



సిడ్నీ, ఫిబ్రవరి 15: 'అమాత్యులారా.. మీ సిబ్బందితో శృంగార సంబంధాలు వద్దు' అంటూ సాక్షత్తు ప్రధాన మంత్రే తన కేబినెట్ సహచరులను విజ్ఞప్తి చేశారు. ఆస్ట్రేలియా ప్రధాని మెల్కొలమ్ టర్న్‌బుల్ గురువారం మీడియా సమక్షంలో ఈ ప్రకటన చేశారు. ఇటీవల ఉప ప్రధాని బార్న్‌బే జాయ్స్ (50) చేసిన తప్పిదంతో ప్రధానికి ఈ పరిస్థితి ఎదురైంది. జాయ్స్ తన మీడియా సలహాదారు విక్కీ కాంపియన్ (33)తో సంబంధం పెట్టుకున్నారు. దీంతో తాను గర్భవతిని అయ్యానంటూ ఇటీవల ఆమె మీడియాకెక్కడంతో ప్రభుత్వంపై విమర్శల వర్షం కురుస్తోంది. దీంతో ఈ తరహా వివాదాస్పద చర్యలకు ఎవరూ పూనుకోవద్దని ప్రధాని టర్న్‌బుల్ కోరారు. ఈ మేరకు మంత్రుల ప్రవర్తనా నియమావళిలో సవరణలు తెచ్చారు. దీనిని అందరూ అనుసరించాల్సిందేనని, పని చేసే చోట వాతావరణాన్ని పాడు చేయొద్దని ఆయన సూచించారు. మంత్రులు పెళ్లయినా.. కాకపోయినా దీన్ని తప్పక పాటించాలని పేర్కొన్నారు. అలాగే ఉప ప్రధాని జాయ్స్‌ను మంత్రి మండలి నుంచి తప్పించాలని ఆయన భావిస్తున్నారు.

నీరవ్‌పై ఈడీ కేసు

సీబీఐకి అందిన ఫిర్యాదుల ఆధారంగా నమోదు



నీరవ్ మోదీ

- అతడి నివాసాలు.. ఆఫీసులలో ముమ్మర తనిఖీ
- 5,100 కోట్ల వజ్రాలు.. నగలు.. బంగారం సీజ్
- ముంబైలో ఐదు ఆస్తులకు అధికారుల సీల్
- బ్యాంకుల స్థితిగతులపై నివేదిక ఇవ్వండి: ఆర్థికశాఖ
- పీఎన్‌బీ కుంభకోణంపై రాహుల్‌గాంధీ చలోక్తులు
- ప్రభుత్వ రహస్య సమ్మతితోనే అతడి పరారీ: కేజ్రీ
- మోదీ సర్కారు వివరణ ఇవ్వాలి: సీతారాం ఏచూరి
- బ్యాంకులు ఇంతగా మోసపోతాయా?.. జనం ప్రశ్న

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: మొన్న లలిత్ (పెద్ద) మోదీ... నిన్న విజయ్‌మాల్యా... నేడు నీరవ్ (చిన్న) మోదీ... భారీ మోసాలకు పాల్పడి, బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టి ఎంచక్కా విదేశాలకు ఎగిరిపోయారు. దేశంలో దర్జాగా తిరిగిన ఈ ఘరానా వ్యక్తులు పారిపోయాకగానీ వారి మోసాలు వెలుగులోకి రాకపోవడం ప్రజలకు విస్మయం కలిగిస్తోంది. పైగా నీరవ్ 2017లో రూ.280 కోట్ల మేర మోసగించినట్లు అతడు పరారైన నెల తర్వాత పీఎన్‌బీ ఫిర్యాదు చేయడం గమనార్హం. మరో నాలుగైదు రోజులు గడిచాక మొత్తం రూ.11,400 కోట్లకు అతడు టోపీ పెట్టినట్లు మంగళవారం తాజా ఫిర్యాదులు చేసింది. వీటి ఆధారంగా నీరవ్‌సహా నిందితులందరిపైనా అక్రమార్జన చలామణీ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం కేసు నమోదు చేసింది. తదనుగుణంగా అతడి కార్యాలయాలు, బంధువుల నివాసాలకు సంబంధించి 17 చోట్ల అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రూ.5,100 కోట్ల విలువైన వజ్రాలు, ఆభరణాలు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు ముంబైలోని ఐదు ఆస్తులకు సీల్ వేశారు. అయితే, కోట్లలో ప్రజాధనాన్ని అతడికి ధారపోసిన పీఎన్‌బీగానీ, ఈ బ్యాంకు నిర్వాకంతో విదేశాల్లో రుణమిచ్చిన ఇతర బ్యాంకు శాఖలుగానీ ఈ మోసాన్ని పసిగట్టలేకపోయాయంటే నమ్మశక్యమేనా? అన్న ప్రశ్న ఇప్పుడు సామాన్యుడి నోట బాణంలా దూసుకొస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400 కోట్ల కుంభకోణం ఉదంతంలో బడా వజ్రాభరణ డిజైనర్ నీరవ్‌మోదీ సహా అతడి కుటుంబం మొత్తం జనవరి మొదటివారంలోనే విదేశాలకు చెక్కేసింది. స్విట్జర్లాండ్‌లో గతనెల ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా పారిశ్రామికవేత్తలతో కలసి నీరవ్ మోదీ సాక్షాత్తూ ప్రధాని మోదీ వెనుక నిలుచుని ఫొటో దిగటం గమనార్హం. దొంగలుపడిన ఆరునెలలకు... అన్నట్లు పీఎన్‌బీ అధికారులు తాపీగా మోసాన్ని కనుగొని సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఇక చేయగలిగిందేమీ ఉండదని లలిత్ మోదీ, విజయ్‌మాల్యా ఉదంతాల్లో ఇప్పటికే తేలిపోయింది. ఈ నేపథ్యంలో గురువారం స్వదేశంలో నీరవ్ మోదీ నివాసాలు, కార్యాలయాల్లో తనిఖీలకు, లుకౌట్ సర్క్యులర్ల జారీకే సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ల పరిశోధన పరిమితమైంది. మరోవైపు నేరానికి పాల్పడిన వారిని వదిలేది లేదని ప్రభుత్వం బీరాలు పలుకుతోంది. నీరవ్ మోసం చేసింది రూ.11,400 కోట్లకు కాగా, రూ.13వేల కోట్ల మేర అతడి ఆస్తులను స్తంభింపజేసినట్లు కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ గొప్పగా చెప్పారు. నీరవ్ పాస్‌పోర్టును రద్దుచేస్తామని ప్రకటిస్తూ- అతణ్ని 'చిన్న మోదీ'గా కాంగ్రెస్ అభివర్ణించడంపై ఆయన మండిపడ్డారు. పీఎన్‌బీ కుంభకోణం దెబ్బతో మేల్కొన్న కేంద్ర ఆర్థిక శాఖ ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ ప్రస్తుత స్థితిగతులపై తక్షణ నివేదిక సమర్పించాలని ఆదేశించింది. మరోవైపు ఇప్పుడు బయటపడుతున్న మోసాలన్నీ యూపీఏ హయాంనాటి పాపాలేనని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. నీరవ్ బ్రాండ్ వజ్రాభరణాల ప్రచారకర్తగా వ్యవహరించిన బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా కూడా తనకు పారితోషికం ఇవ్వకుండా మోసగించాడంటూ ఫిర్యాదు చేయడం గమనార్హం. కాగా, మాల్యా రూ.4వేల కోట్లు చెల్లించడానికి సంసిద్ధత తెలిపిన తరహాలోనే రూ.5వేల కోట్లు బ్యాంకులకు చెల్లించడానికి సిద్ధమని నీరవ్ మోదీ ప్రకటించడం విశేషం.





జనవరిలో సకుటుంబంగా పరారీ

ఏఎన్‌ఐ వార్తా సంస్థ కథనం ప్రకారం నీరవ్‌తోపాటు అమెరికా పౌరసత్వంగల భార్య అమీ జనవరి 6న దేశం విడిచి వెళ్లారు. అతడి వ్యాపార భాగస్వామి మెహుల్ చోక్సి 4న, బెల్జియం పౌరుడైన నీరవ్ సోదరుడు నిషాల్ జనవరి 1న పలాయనం చిత్తగించారు. పీఎన్‌బీ నుంచి ఫిర్యాదు అందిన తర్వాత సీబీఐ వీరందరిపై జనవరి 31న లుకౌట్ సర్క్యులర్లు జారీచేసింది. ఇక ఈ కుంభకోణానికి 2011లో బీజం పడిందని, దీన్ని 2018 జనవరి 3న తామే గుర్తించి నిఘా సంస్థలకు ఫిర్యాదు చేశామని పీఎన్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ మెహతా గురువారం తెలిపారు. తమ బ్యాంకు ఉద్యోగులిద్దరు వీరికి సహకరించారని తేలినట్లు చెప్పారు. డిప్యూటీ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి రిటైర్ కావడానికి మూడు నెలల ముందు సింగిల్‌విండో ఆపరేటర్ మనోజ్ ఖారత్‌తో కలసి నీరవ్ మోసానికి తోడ్పడినట్లు తెలిపారు. ఇది కేవలం ఒక్క బ్రాంచికే పరిమితమని, తమ సిబ్బందిపై క్రిమినల్ చర్యలు మొదలయ్యాయని చెప్పారు. ఈ గడ్డు పరిస్థితి నుంచి తనంతటతానుగా పీఎన్‌బీ బయటపడగలదని ధీమా వ్యక్తం చేశారు.

కేంద్ర సర్కారుపై విపక్షాల విమర్శలు

కోటీశ్వరుడైన వజ్ర వ్యాపారి నీరవ్‌మోదీ పారిపోవడంపై కాంగ్రెస్ పార్టీ గురువారం ఎన్డీఏ సర్కారుపై విమర్శనాస్త్రాలు సంధించింది. విజయ్ మాల్యా తరహాలో నీరవ్ కూడా పారిపోతున్నా ప్రధానితో అతడి సాన్నిహిత్యం కారణంగానే ప్రభుత్వం కిమ్మన లేదని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్విట్టర్‌లో ఎద్దేవా చేస్తూ వ్యాఖ్యానించారు. ''నీరవ్ మోదీ భారత్‌ను దోచుకున్న విధము తెలియండి... 1. మోదీతో ఆలింగనం; 2. దావోస్‌లో ఆయనతో కలసి కనిపించడం; 3. ఆ సాన్నిహిత్యాన్ని వాడుకుని: ఎ.12వేల కోట్లు దోచుకోవడం; బి.ప్రభుత్వ ఉదాసీనతతో మాల్యా బాటలో దేశం వదిలిపోవడం'' అని పేర్కొన్నారు. ''లలిత్ మోదీ, విజయ్ మాల్యాల తరహాలో పారిపోవాల్సిందిగా అతడికి ప్రభుత్వంలోని కొందరు సూచించారా? అని కాంగ్రెస్ సమాచార వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్ సూర్జేవాలా ప్రశ్నించారు. ప్రజాధనంతో పారిపోయే అవకాశం కల్పించడం ఒక ఆనవాయితీ అయిందా?'' అని మరో ట్వీట్‌లో సందేహం వెలిబుచ్చారు. నీరవ్ మోదీ పరారీలో బీజేపీ సర్కారు రహస్య సమ్మతి ఉందంటూ ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. విజయ్‌మాల్యా, లలిత్ మోదీల విషయంలోనూ జరిగింది ఇదేనని పేర్కొన్నారు. ''సీబీఐ అతడిమీద కేసు నమోదు చేయడానికి ముందే నీరవ్ దేశం వీడి వెళ్లి ఉంటే... అప్పటికి అతడు దేశంలో ఉన్నట్టే కదా? దావోస్‌లో ప్రధానితో కలిసి ఫొటో దిగాడంటే వారం ముందే పరారైనట్లు కాదా? దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలి'' అని సీపీఎం నేత సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు. దేశంలో బ్యాంకులను మోసగించి పారిపోయేందుకు అవకాశం కల్పించే కొత్త ధోరణిని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టినట్టుందని ఆరోపించారు. కాగా, నీరవ్ ఉదంతం ఫలితంగా గురువారం కూడా షేర్ మార్కెట్లలో పీఎన్‌బీ వాటాలకు కుదుపు తప్పలేదు. ఆ మేరకు పీఎన్‌బీ వాటా ధర బుధవారం 10 శాతం పడిపోగా ఒక్కరోజు గడవకుండానే మరో 9 శాతం పతనమైంది.


దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జుమా ఔట్

- అవినీతి ఆరోపణలతో రాజీనామా
- దిగిపోవాలని 3 రోజుల క్రితం ఏఎన్‌సీ ఆదేశం
- తొలుత భీష్మించినా చివరకు తప్పుకున్న జుమా
- కొత్త అధ్యక్షుడిగా సైరిల్ రమాఫోసా బాధ్యతలు



జుమా | సైరిల్ రమాఫోసా

జొహన్నెస్‌బర్గ్, ఫిబ్రవరి 15: దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకోబ్ జుమా గురువారం తన పదవికి రాజీనామా చేశారు. పదవి నుంచి తప్పుకోకపోతే పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి తొలగింపజేస్తామని అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ) పార్టీ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఆయన రాజీనామా సమర్పించారు. అవినీతి ఆరోపణలతో పాటు.. దేశంలో నిరుద్యోగితను పరిష్కరించలేకపోయారని, ఆర్థికమాంద్యాన్ని చక్కదిద్దలేకపోయారని జుమా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఏఎన్‌సీ పార్టీ సోమవారం సమావేశమై జుమాను రాజీనామా చేయాల్సిందిగా కోరింది. కానీ అప్పుడు జుమా రాజీనామాకు ససేమిరా అన్నారు. పార్టీ ఆదేశించిన మూడు రోజుల అనంతరం గురువారం జుమా పదవి నుంచి వైదొలిగారు. జాతిని ఉద్దేశించి ప్రసంగించిన జుమా.. తన రాజీనామాకు దారితీసిన పరిస్థితులను కూలంకశంగా వివరించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలో పార్టీ కారణాలు చెప్పలేదని వివరించారు. తాను పార్టీలో ఎప్పటికీ క్రమశిక్షణతోనే ఉన్నానని, అదే పార్టీలో కొనసాగుతానని జుమా తెలిపారు. జుమా వైదలొగడంతో ఆయన తొమ్మిదేళ్ల పాలనకు తెరపడినట్లైంది. వాస్తవానికి 2019 సాధారణ ఎన్నికలతో ఆయన రెండోసారి అధ్యక్షుడిగా పదవీకాలం ముగియాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ఉపాధ్యక్షుడు సైరిల్ రమాఫోసాను జుమా స్థానంలో నియమించాలని ఏఎన్‌సీ నిర్ణయించింది. రెండు నెలల క్రితమే ఏఎన్‌సీ సైరిల్‌ను ఎంపిక చేసింది. కొత్త అధ్యక్షుడిని నియమించే వరకు సైరిల్ రమాఫోసా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకోనున్నారు. అవినీతితో దేశ ఆర్థిక వ్యవస్థను దారుణంగా దెబ్బతీశాడని అధ్యక్షుడు జాకోబ్ జుమాపై ఆరోపణలు రుజువు అయ్యాయి. భారీ అవినీతి, దేశ ఆర్థిక మందగమనం, రికార్డు స్థాయిలో పెరిగిన నిరుద్యోగం తదితర కారణాలు జుమాపై వ్యతిరేకతను పెంచాయి. ఈ పరిణామాలతో ఆయన స్వచ్ఛంద ంగా పదవి నుంచి దిగిపోవాలని ఏఎన్‌సీ కోరింది.



గుప్తా కుటుంబంతో సంబంధాలే కారణమా?

దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమాతో సన్నిహిత సంబంధాలున్న..ప్రముఖ వాణిజ్య సంస్థలకు అధిపతులైన గుప్తాల కుటుంబంపై పోలీసులు దాడులు నిర్వహించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని వార్తలు వస్తున్నాయి. దక్షిణాఫ్రికాలోని ఫ్రీస్టేట్ ప్రావిన్సులో ఉన్న వ్రెడె అనే పట్టణంలో పాల ఉత్పత్తి కేంద్రం నుంచి పేదలకు చెందాల్సిన కోట్ల రూపాయల డబ్బును అధ్యక్షుడి అండతో గుప్తా సోదరులు అక్రమ పద్ధతుల్లో కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసు విషయమై జొహన్నెస్‌బర్గ్ శివారు ప్రాంతమైన శాక్సన్‌వల్డ్‌లో ఉన్న వారి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేయగా వారిలో ఒకరు గుప్తా కుటుంబంలోని వ్యక్తి ఉన్నారు. జాకబ్ జుమాను పదవి నుంచి దిగిపొమ్మని ఏఎన్‌సీ కోరడానికి కూడా గుప్తాలతో ఉన్న సంబంధాలే కారణమని తెలుస్తోంది.

ఎవరీ గుప్తాలు?

జాకబ్ జుమాను తమ గుప్పెట్లో పెట్టుకుని రాజ్యాంగాధికారాలు సైతం చెలాయించిన గుప్తా సోదరుల ప్రయాణం ఉత్తరప్రదేశ్ నుంచి మొదలైంది. యూపీ లోని సహారాన్‌పూర్‌కు చెందిన శాండ్‌స్టోన్ వ్యాపారి శివ్‌కుమార్ గుప్తాకు అజయ్, అతుల్, రాజేశ్ 'టోనీ' గుప్తా అనే ముగ్గురు కొడుకులున్నారు. వీరు 1993లో జొహన్నెస్‌బర్గ్‌లో అడుగుబెట్టి విశాల వాణిజ్య సామ్రాజ్యం నిర్మించారు. కంప్యూటర్లు, వాటి విడిభాగాల వ్యాపారంతో ప్రారంభించి మీడియా, యురేనియం, బొగ్గు గనులు, రియల్ ఎస్టేట్, లోహాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల వరకూ విస్తరించారు. అడ్డగోలుగా వ్యాపా రాలు చేశారు. 2009లో దేశాధ్యక్షుడైన జుమాకు అత్యంత సన్నిహితులుగా మారిన గుప్తాలు.. పాలకపక్షమైన ఏఎన్‌సీని సైతం తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకున్నారు. గుప్తా సోదరులు తాము పుట్టి పెరిగిన సహారాన్‌పూర్ పేరు మీదుగా జొహన్నెస్ బర్గ్‌లో మొదటగా 'సహారా కంప్యూట ర్స్'ను స్థాపించారు. ఇతర వ్యాపారాలకు విస్తరించారు. 20 ఏళ్లలో అపర కుబేరుల య్యారు. 2013లో వారి సమీప బంధువు అనిల్ గుప్తా కూతురు పెళ్లికి చేసిన భారీ ఖర్చుతో వారి పేర్లు మార్మోగిపోయాయి. ఈ పెళ్లికి ఇండియా నుంచి 217 మంది అతిథులతో వచ్చిన విమానాన్ని వైమానికదళ స్థావరంలో దిగడానికి అనుమతించడంతో గుప్తాలకు జుమాతో ఉన్న బంధాన్ని ఎలా వాడుకుంటున్నారో బయటపడింది.

వీడ్కోలు తప్పదు

- మాణిక్ 'సర్కార్'కు ప్రజల మద్దతు లేదు
- ఆధునిక త్రిపురను నిర్మిస్తాం: ప్రధాని మోదీ

అగర్తలా, ఫిబ్రవరి 15: త్రిపురలో కమ్యూనిస్టుల ప్రభుత్వానికి ప్రస్తుతం ప్రజల మద్దతు లేదని, మళ్లీ అధికారంలోకి రాకుండా వీడ్కోలుకు పలికేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రధాని మోదీ అన్నారు. కమ్యూనిస్టులు అమాయకులైన ప్రజలను చంపుతున్నారని, అందుకు ఓడిపోతామని భయపడుతున్నారని చెప్పారు. గురువారం త్రిపుర రాజధాని అగర్తలా, శాంతిర్ బజార్‌లో మోదీ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. మాణిక్ సర్కార్ సారథ్యంలోని లెఫ్ట్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. బీజేపీ అభివృద్ధి ప్రణాళికను వివరించారు. 20-25 ఏళ్లుగా లెఫ్ట్ పాలనలో త్రిపుర ఏ మేరకు అభివృద్ధి చెందిందో ఆలోచించాలని, అధికారం నుంచి దించే సమయం ఆసన్నమైందని మోదీ పేర్కొన్నారు. ఏడో వేతన సంఘం సిఫార్సులను లెఫ్ట్ ప్రభుత్వం అమలు చేయలేదని, అలాగే కనీస వేతనాలను పెంచలేదని విమర్శించారు. నవ భారత్ నిర్మాణంలో భాగంగా ఆధు



నిక, కొత్త త్రిపురను నిర్మిస్తామని మోదీ హామీ ఇచ్చారు. కమ్యూనిస్టు పార్టీల కు 'గణతంత్ర'పై విశ్వాసం లేదని,'గన్ తంత్ర', హింసపై నమ్మకముందని విమర్శించారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో టోమో రిబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెడికల్ సైన్స్‌కు మోదీ శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. దేశ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టామని, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకూ వైద్యం సేవలు అందిస్తామని అన్నారు. కొత్త ఆరోగ్య పాలసీని తేవాలని అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వానికి సూచించారు. న్యూఢిల్లీ-నహర్లగున్ ఎక్స్‌ప్రెస్‌ను అరుణాచల్ ఎక్స్‌ప్రెస్‌గా మారుస్తున్నట్టు ప్రకటించారు.

మోదీ అరుణాచల్ పర్యటనపై చైనా అభ్యంతరం

ప్రధాని మోదీ అరుణాచల్ ప్రదేశ్ పర్యటనపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. మోదీ పర్యటించిన ప్రాంతం దక్షిణ టిబెట్‌లో భాగమని, భారత్ తీరుపై దౌత్యపరమైన నిరసన చేపడతామని పేర్కొంది. చైనా-భారత్ సరిహద్దు వ్యవహారంలో తమ వైఖరి సుస్పష్టమని, దీనిలో ఎలాంటి మార్పు లేదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గెంగ్ షాంగ్ అన్నారు. అరుణాచల్‌ను చైనా ఎప్పుడూ గుర్తించలేదని, వివాదాస్పద ప్రాంతంలో భారత నేత పర్యటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. సరిహద్దు వివాదాలను సంప్రదింపులు, చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఇరు దేశాలు ఓ అవగాహనకు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.



మోహన్‌బాబు

విడుదల రోజే పైరసీ కావడం బాధాకరం

– మోహన్‌బాబు

'సినిమా రిలీజైన వెంటనే పైరసీ చేసేస్తున్నారు.. ఇంటర్నెట్‌లో పెట్టేస్తున్నారు. ఇలాంటి విషయాల పట్ల నిర్మాతగా నా హృదయం ఏడుస్తుంది' అని అన్నారు మంచు మోహన్‌బాబు. ఆయన హీరోగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'గాయత్రి'. ఈ సినిమా ఫిబ్రవరి 9న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగిన సక్సెస్‌మీట్‌లో మోహన్‌బాబు మాట్లాడుతూ ''హీరోగా, నిర్మాతగా 'గాయత్రి' సినిమా కోసం తొమ్మిది నెలలు కష్టపడ్డాను. చేతికి, కాలికి ఆపరేషన్స్ చేసుకుని సినిమాలో రిస్కీ ఫైట్స్ చేశాను. సినిమా విడుదలైన రోజునే పైరసీ ప్రింట్ బయటకు రావడం బాధాకరం. ఏదేమైనా ఈ సినిమాలో విష్ణు నటనకు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది'' అన్నారు. సినిమాకు చాలా మంచి ఆదరణ లభించిందని దర్శకుడు మదన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా రవీంద్ర, డైమండ్ రత్నబాబు, గీతాసింగ్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

కిక్ మరో రేంజ్‌లో ఉంది

– నాని



నాని నిర్మించిన చిత్రం 'అ!'. కాజల్ అగర్వాల్, నిత్యామీనన్, ఈషా రెబ్బా, రెజీనా, అవసరాల శ్రీనివాస్, ప్రియదర్శి, మురళీశర్మ నటించారు. ఈ సినిమా ఈ రోజు విడుదలవుతుంది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ''అవసరం అనిపించబట్టే ఈ సినిమాను చేయడానికి అంగీకరించా. ఇలాంటి సినిమాలు రావడం చాలా అవసరం అనిపించింది. ముందుగా ఇలాంటి సినిమాలను ఎవరైనా చేస్తారా? అని ఆలోచించాను. అయితే ఇలాంటి సినిమాలను ఎవరో ఎందుకు చేయాలి? ఎవరో ఒకరు చేస్తారని ఎందుకు ఎదురుచూడాలి? నేనే చేస్తే పోతుంది కదా! అని అనుకునే చేశా. ఆర్టిస్ట్‌గా చేస్తూ, నిర్మాతగా చేయడమనేది చాలా కష్టం. అన్నీ ఫోన్ల మీదే మేనేజ్ చేశాను. అలాగే 'అ'కి సంబంధించి నాలుగైదు గ్రూపులున్నాయి. వాటన్నిటిలోనూ ప్రతిసారీ అప్‌డేట్స్ చూస్తూనే ఉండేవాడిని. 'కృష్ణార్జున యుద్ధం' షూటింగ్ సమయంలో కూడా ఫోన్స్‌లో మాట్లాడుతూనే ఉన్నా. షూటింగ్ పూర్తి చేసుకుని మొన్న రాత్రి 12.30 గం॥కి హైదరాబాద్‌కి చేరుకున్నా. అక్కడి నుంచి ల్యాబ్‌కెళ్లి కాపీ చూసుకుని ఇంటికెళ్లి పడుకున్నా. నిన్న ఉదయం నుంచి రెండు ప్రమోషనల్స్ షూట్స్ చేశా. ఆ తర్వాత మరలా రాత్రి షో వేశా. ఇదిగో ఇప్పుడు మళ్లీ బిజీగా ఉన్నా. నిద్ర లేకుండా పని చేస్తున్నప్పటికీ అది ఇస్తున్న కిక్ ఇంకో రేంజ్‌లో ఉంది. సాధారణంగా నిర్మాతలు పడే ఇబ్బందులు, చేసే పనులు కొంతవరకు మనకు తెలుస్తాయి కానీ, అన్ని సందరాల్లో తెలియవు. ఈ సినిమాతో నాకు తెలిశాయి. ఈ సినిమాని ప్రేక్షకులు తప్పకుండా మెచ్చుకుంటారు. అయితే రిలీజ్ రోజా? ఏడాది తర్వాతా? ఇంకెప్పుడైనానా? అనేది నాకు తెలియదు. కానీ తప్పకుండా మెచ్చుకుంటారు. సినిమా తప్పకుండా బిజినెస్ కలిసిన ఆర్ట్ ఫార్మ్. మామూలుగా ఒక పెయింటర్ ఉన్నాడనుకుందాం. తనకు నచ్చిన విధంగా పెయింటింగ్ చేసి అమ్మకానికి ఉంచుతాడు. అది నచ్చినవాళ్లు కొనుగోలు చేస్తారు. కానీ సినిమా పరంగా వచ్చేసరికి సినిమా తీసేటప్పుడే.. ఇది నచ్చుతుందా? నచ్చాలంటే ఏం చేయాలి? అని ముందే ఒకసారి అనుకుంటారు. దాని వల్ల సినిమాకు మరింత ఎక్కువగా బిజినెస్ యాంగిల్ వచ్చేసింది. మనకి సినిమా ఏమయిందంటే.. ఈ డైరెక్టర్, ఈ హీరో కలిస్తే ఎక్కువకి కొంటారు.. అని ఫిక్సవుతున్నాం. దీనికి నేను ఎవర్నీ కారణంగానూ చూపను. కాకపోతే ఇలాంటి సినిమా తీశాక నాకు పేరు ఉంది.. కాబట్టి డిస్ట్రిబ్యూటర్లు నా మీద నమ్మకంతో వస్తారు. అందుకని రిస్క్‌ని నేనే ఫేస్ చేయాలి. అప్పుడే నిజాయతీగా కొత్త చిత్రాలు చేయగలం. అలా కాకుండా ఎప్పుడైతే ప్రెజర్‌కి లొంగామో.. వాళ్లకోసమని, వీళ్లకోసమని.. సినిమాలు తీయసాగామో.. అప్పుడే మనకున్న ఆ నిజాయతీ పోతుంది. ఒక ప్లేట్‌లో పాస్తాను, పప్పన్నాన్ని, బిర్యానీని, మజ్జిగని కలుపుకుని తింటే.. కడుపులో ఏదో అవుతుంది కదా.. సినిమా కూడా అలాగే తయారవుతుంది. ఈ సినిమాలో నటించినవారందరూ ఈ కథను నమ్మి చేశారు. వాళ్లు కోట్ చేసిన రెమ్యూనరేషన్స్ ఇచ్చేశాం. ఫేవర్లు లాంటివి లేవు. నేను నిర్మాతగానే ఉన్నా. వాళ్లు నటీనటులుగానే ఉన్నారు. ఎవరి లెక్కలు వాళ్లకు సరిపోయాయి. నా ఎదుగులకు కారణం నా నిర్మాతలు. నన్ను నమ్మి నా కెరీర్ ప్రారంభం నుంచి ఎంతో మంది నిర్మాతలు సినిమాలు చేశారు. వాళ్లందరికీ నేను అందుబాటులో ఉంటాను. మరీ కొత్తగా అనిపించినప్పుడు మాత్రమే నా ప్రొడక్షన్‌లో నేను సినిమాలు చేస్తాను'' అన్నారు.



రకుల్‌ప్రీత్ సింగ్

సౌత్‌లో అందరు టాప్ హీరోలతో కలిసి ఆడిపాడిన రకుల్ ప్రీత్ ఇప్పుడు 'అయ్యారీ' చిత్రంతో మరోసారి బాలీవుడ్‌లో సందడి చేయబోతోంది. తెలుగు, తమిళ భాషల్లో ఆమె చేసిన క్యారెక్టర్లు గ్లామర్‌తోపాటు పెర్ఫార్మెన్స్ ఒరియంటెడ్‌గా ఉన్నాయి. ఎక్స్‌పోజింగ్ విషయంలో ఎక్కడా శృతి మించని రకుల్ ఈమధ్య ఓ ఫోటో షూట్‌లో హాట్ హాట్‌గా కనిపించింది. దీంతో ఆమె అభిమానులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. ''నేను చేసిన ఫోటోషూట్‌పై కొంతమంది చాలా పాజిటివ్‌గా మాట్లాడారు. ఇలాంటి సందర్భాల్లో నెగెటివ్ కామెంట్స్ రావడం సహజమే. ఈ విషయంలో నేను ఫీల్ అవ్వడం లేదు. ఒక టాప్ మ్యాగజైన్ కవర్‌పేజీపై కనిపించాలని ఏ హీరోయిన్‌కైనా ఉంటుంది. ఇప్పటివరకు చాలా మంది కవర్‌పేజీపై కనిపించారు. ఇప్పుడు నాక్కూడా అవకాశం వచ్చింది. దాన్ని సద్వినియోగం చేసుకున్నాను. దీని గురించి ఎవరేమన్నా నేను పట్టించుకోను'' అంటూ ఘాటుగా స్పందించింది రకుల్.

ఎవరేమన్నా పట్టించుకోను

పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా...



ఎస్.బి క్రియేషన్స్ పతాకంపై చక్రసీద్ సమర్పించిన చిత్రం 'సోడ గోలీ సోడ'. భువనగిరి సత్య సింధూజ నిర్మాత. మల్లూరి హరిబాబుదర్శకుడు. మానస్, నిత్య నరేష్, కారుణ్య హీరో హీరోయిన్స్‌గా నటిసున్నారు. ఈ చిత్రం ఈరోజు విడుదలవుతుంది. ఈ సందర్భంగా నిర్మాత సత్య సింధూజ మాట్లాడుతూ '''సోడ గోలీ సోడ' మా బ్యానర్‌లో వస్తున్న మొదటి సినిమా. పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం'' అన్నారు. దర్శకుడు హరిబాబు మాట్లాడుతూ ''కుటుంబం మొత్తం కలసి చూసే వినోదాత్మక చిత్రాన్ని నిర్మించాలనే ఉద్దేశ్యంతోనే 'సోడ గోలీ సోడ' సినిమాను చేయడం జరిగింది. ఈ సినిమా రెండు గంటలు ఆద్యంతం ప్రేక్షకులను నవ్విస్తుంది'' అన్నారు. హీరో మానస్ మాట్లాడుతూ ''సీనియర్ కమెడియన్స్ అందరూ ఈ చిత్రంలో ఉన్నారు. సినిమా పూర్తి స్థాయి వినోదాత్మకంగా ఉంటుంది. కుటుంబం మొత్తం హ్యాపీగా కలసి చూసే సినిమా ఇది. పాలకొల్లు అందాలు, హైదరాబాద్ లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. భరత్ మ్యూజిక్ అద్భుతంగా అందించారు'' అన్నారు. కృష్ణ భగవాన్ మాట్లాడుతూ ''ఒక మంచి కథను ప్రేక్షకులకు అందించాలనే తపనతోనే దర్శక నిర్మాతలు తెరకెక్కించారు. అందరూ కష్టపడి పని చేశారు. నాకు ఈ సినిమాలో మంచి పాత్ర ఇచ్చినందుకు థాంక్స్'' అన్నారు. హీరోయిన్ నిత్య నరేష్, సహ నిర్మాత భువనగిరి శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్రివిక్రమ్‌తో తొలిసారి!



తమన్

'భాగమతి', 'తొలి ప్రేమ'.. ఇలా ఈ ఏడాది ఆరంభంలోనే భారీ విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు యువ సంగీత దర్శకుడు తమన్. ఈ రెండు చిత్రాలకి తమన్ అందించిన సంగీతం, నేపథ్య సంగీతం బాగా ప్లస్ అయ్యింది. ప్రస్తుతం నితిన్ 25వ చిత్రం 'ఛల్ మోహన్ రంగ'కి సంగీతం అందిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. తమన్ ఖాతాలో మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ చేరిందని టాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. అదేమిటంటే.. ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రానున్న చిత్రానికి తమన్ సంగీత దర్శకుడిగా ఎంపికయ్యారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా తొలుత అనిరుధ్ ఎంపికైనా.. కొన్ని కారణాల వల్ల ఆ స్థానంలోకి దేవిశ్రీ ప్రసాద్ వచ్చే అవకాశముందని వార్తలు వినిపించాయి. అయితే.. త్రివిక్రమ్ మాత్రం తమన్‌కే అవకాశమిచ్చారు. ఎన్టీఆర్, తమన్ కాంబినేషన్‌లో 'బృందావనం', 'బాద్‌షా' వంటి మ్యూజికల్ హిట్స్ వచ్చిన విషయం తెలిసిందే.





ఆకాష్ 'కొత్తగా ఉన్నాడు'

ఆకాష్ హీరోగా రాజా మీడియా వరల్డ్ సమర్పణలో జై బాలాజీ మూవీ మేకర్స్ పతాకంపై ఎం.కె.రాజా నిర్మిస్తున్న చిత్రం 'కొత్తగా ఉన్నాడు'. ఆకాష్ సరసన ప్రియ, సోనియా హీరోయిన్స్‌గా నటించిన ఈ చిత్రానికి ఎం.రాధా దర్శకత్వం వహించారు. యు.కె.మురళి సంగీతం సమకూర్చారు. ఈ చిత్రం ఆడియో వేడుక గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఆడియోతోపాటు ట్రైలర్ కూడా విడుదల చేశారు. ఈ వేడుకలో హీరో ఆకాష్, నిర్మాత ఎం.కె.రాజా, సంగీత దర్శకుడు యు.కె.మురళి, ప్రముఖ నిర్మాత, సంతోషం పత్రికాధినేత సురేష్ కొండేటి, వైకుంఠపాళి నిర్మాత జైరామ్, నటుడు-నిర్మాత దినేష్ మాడ్నే, యువ దర్శకుడు రవిశర్మ, నిర్మాతలు బాల్ రెడ్డి, బలవంత్ రెడ్డి, హీరోయిన్స్ ఆర్తి సురేష్, సుమ, లక్కీ, కొరియోగ్రాఫర్ వేణు పాల్గొన్నారు.



నేడు జేఎఫ్‌సీ తొలి సమావేశం

- హైదరాబాద్‌లో ప్రముఖులతో పవన్ భేటీ
- జేపీ, ఉండవల్లి, రామకృష్ణ, మధు హాజరు
- మద్దతు ప్రకటించిన చలసాని, కాంగ్రెస్

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): విభజన హామీల నిధుల లెక్కలపై ప్రజలకు వాస్తవాలను వెల్లడించడానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన జేఎఫ్‌సీ తొలిసారి సమావేశం కానుంది. శుక్ర, శనివారాల్లో హైదరాబాద్‌లోని దస్‌పల్లా హోటల్‌లో జరిగే ఈ సమావేశానికి రాజకీయ నాయకులు, న్యాయకోవిదులు, ఆర్థిక, విద్యా, సామాజిక నిపుణులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు హాజరవుతారని జనసేన ఓ ప్రకటనలో తెలిపింది. పవన్ కల్యాణ్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్ కుమార్, కొణతాల రామకృష్ణ, వామపక్ష నేతలు రామకృష్ణ, మధు, కాంగ్రెస్ నాయకులు గిడుగు రుద్రరాజు, జంగా గౌతమ్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు, ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొననున్నారు. కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్వేతపత్రం విడుదల చేయాలని పవన్ విధించిన గడువు గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆయన నిర్ణయం తీసుకుంటారో ప్రకటించే అవకాశముంది.

రఘువీరాకు పవన్ ఫోన్

ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డికి పవన్ ఫోన్ చేసి జేఎఫ్‌సీకి మద్దతు తెలపాలని కోరారు. జేఎఫ్‌సీ సమావేశానికి హాజరుకావాల్సిందిగా కోరగా.. రఘువీరా సానుకూలంగా స్పందించి పార్టీ ప్రతినిధులను పంపిస్తామని చెప్పారు.

జనసేనానితో యోగేంద్ర, చలసాని భేటీ

గురువారం జనసేన కార్యాలయంలో పవన్‌తో స్వరాజ్ అభియాన్ నేత, ఆప్ మాజీ కార్యనిర్వాహక సభ్యుడు యోగేందర్ యాదవ్ సమావేశమయ్యారు. ఆయనక పవన్ సాదర స్వాగతం పలికారు. ఇటీవల అనంతపురం జిల్లాలో తన పర్యటన వివరాలను పవన్ ఆయనకు వివరించారు. జనసేన కార్యాలయంలోనే పవన్‌తో చలసాని శ్రీనివాస్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జేఎఫ్‌సీకి ఆయన సంఘీభావం ప్రకటించారు. తొలి సమావేశానికి తమ సమితి ప్రతినిధులతో కలసి హాజరవుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఎంత ఇచ్చిందో, ఎంత ఖర్చయిందో, ఇంకా రావలసింది ఎంత ఉందో లెక్కలు తేల్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.


పవన్‌తో సమావేశమైన చలసాని శ్రీనివాస్, యోగేంద్ర యాదవ్

వచ్చే ఎన్నికల్లో గెలుపు మనదే

ఎవరెన్ని కుతంత్రాలు పన్నినా ఇది ఖాయం


సమావేశంలో చంద్రబాబు

- త్వరలోనే కీలక నిర్ణయాలు.. కేసులకు బెదరం
- అమరావతి అభివృద్ధి కోసం ఇన్నాళ్లూ రాజీపడ్డా
- కేంద్రంతో జగన్ లాలూచీ.. వైసీపీని ఎండగట్టండి
- నేతలకు టీడీపీ అధినేత చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని, ఇందులో సందేహం లేదని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఉండవల్లిలోని తన నివాసంలో పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాల టీడీపీ అధ్యక్షులు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని, రాష్ట్ర హక్కులు.. ఆత్మగౌరవం విషయంలో రాజీ పడేది లేదని సీఎం స్పష్టం చేశారు. త్వరలోనే పార్టీ విషయంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. వడ్డించే వాడు మనవాడు అయితే ఎక్కడ కూర్చున్నా అన్నీ అందుతాయని.. కానీ ఇప్పుడు మనకు కేంద్రంలో వడ్డించే మనవారు లేరని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

అమరావతి అభివృద్ధి కోసం ఇన్నాళ్లూ రాజీపడ్డానని చెప్పుకొచ్చిన ఆయన.. కేంద్రం న్యాయం చేయకపోతే అంచెలంచెలుగా పోరాడటం తప్ప మరో మార్గం లేదని అన్నారు. తాను ఏ కేసులకూ బెదిరేది లేదని స్పష్టం చేశారు. తనపై కేసులు ఉన్నాయని, వాటికి భయపడుతున్నానని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నారని, దాన్ని తిప్పికొట్టాలని సూచించారు.

నేను సంపన్న ముఖ్యమంత్రినా?

దేశంలో సంపన్న ముఖ్యమంత్రి చంద్రబాబు అంటూ ఏడీఆర్ ఇచ్చిన నివేదికపైనా సీఎం స్పందించారు. హెరిటేజ్‌ను 25 ఏళ్లుగా తన కుటుంబసభ్యులు పారదర్శకంగా నడిపిస్తున్నారని, అందులో తన పేరుతో ఒక్క షేర్ కూడా లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులతో సహా ప్రతిఏటా ఆస్తులు ప్రకటిస్తున్న ఏకైక వ్యక్తిని రాజకీయాలలో తానొక్కడినేనని, తన పేరుతో భూములు.. ఇళ్లు కూడా లేవని చెప్పారు. అటువంటిది తనను సంపన్న సీఎంగా చిత్రించడం సబబు కాదని అన్నారు.

పోలవరం పూర్తి చేసి తీరుతాం

ఎన్ని అడ్డంకులు ఎదురైనా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి తీరుతామని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనిపై ఒడిశా సీఎంతో మాట్లాడగా సానుకూలంగా స్పందించారన్నారు. కాగా, టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన 'దళిత తేజం-తెలుగుదేశం' కార్యక్రమాన్ని మొక్కుబడిగా జరపవద్దని, వినూత్న కార్యక్రమంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు ఆయన సూచించారు. ఏప్రిల్ 14, 20 తేదీల్లో జరిగే 'అంబేద్కర్ ఆశయం-చంద్రన్న ఆచరణ' కార్యక్రమాలను భారీఎత్తున జరపాలన్నారు. మనం చేసే ప్రతి పనిని ప్రజలు గమనిస్తుంటారని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదునుగా పనిచేసి, అధికారంలోకి వచ్చాక మొద్దుబారడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. రాజస్థాన్‌లో కూడా రైతురుణమాఫీ ప్రకటించారని, అయితే చిన్న, సన్నకారు రైతులకే ప్రకటించారని అది కూడా రూ.50 వేల వరకే చేస్తున్నారని ఆయన తెలిపారు. అదే మన రాష్ట్రంలో రూ.లక్షా 50వేలు రుణమాఫీ రైతులందరికీ చేశామన్న విషయం ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు చంద్రబాబు సూచించారు. సమావేశంలో మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు టీడీ జనార్ధన్, వీవీవీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాటకాలను తిప్పికొట్టండి

జగన్‌పై కేసులు తుది దశలో ఉండటం వల్లే కేంద్రానికి భయపడిపోతున్నారని చంద్రబాబు ఆరోపించారు. అందుకే కేంద్రం అడగకుండానే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జగన్ ఎదురెళ్లి మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు. కేసుల మాఫీ కోసమే ఆయన కేంద్రంతో లాలూచీ పడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ జగన్నాటకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సీఎం సూచించారు.


అనంతపురంలో ఆర్ట్స్ కళాశాల పీజీ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న కోడెల

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం

- అప్పుడే సత్ఫలితాలు: స్పీకర్ కోడెల


అనంతపురం, ఫిబ్రవరి 15 (మనం బ్యూరో): అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు అన్నారు. అనంతపురం జిల్లా ప్రజల అప్యాయత మరువలేనిదని, ఇక్కడ మూడు అద్భుతమైన కార్యక్రమాలను తాను ప్రారంభించడంతో తన జన్మ చరితార్థమైందని అన్నారు. గురువారం అనంతపురంలో ఎన్టీఆర్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ మ్యూజియాన్ని ఆయన ప్రారంభించారు. స్పీకర్‌కు మంత్రి కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, కలెక్టర్ వీరపాండియన్ తదితరులు స్వాగతం పలికారు. మ్యూజియంలోని పురాతన వస్తువులు, కళారూపాలను ఆయన పరిశీలించారు. నగరంలో ఆర్ట్స్ కళాశాలలో రూ.40 లక్షలతో నిర్మించిన పీజీ బ్లాక్‌ను స్పీకర్ ప్రారంభించారు. అలాగే నగర శివారులోని శిల్పారామం సందర్శించి, అక్కడ 8 అతిథి గృహాల భవన సముదాయాలకు భూమి పూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో స్పీకర్ కోడెల మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా కరవు నివారించడానికి గాలేరి-నగరి, హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణా జలాలను తరలించడానికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో నేడు జిల్లాలోని అన్ని చెరువులు కృష్ణ జలాలతో కళకళలాడుతున్నాయన్నారు. దేశం అభివృద్ధి చెందుతున్న తరుణంలో నేటి యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని స్పీకర్ పిలుపునిచ్చారు. 130 కోట్ల జనాభాలో యువకుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో శిల్పారామాలను ప్రభుత్వం నెలకొల్పి అంతరించిపోతున్న ప్రాచీన కళలను వెలుగులోకి తీసుకొచ్చి, కళాకారులను ప్రోత్సహించడం ద్వారా వారికి జీవనోపాధి కల్పిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ యామిని బాల, ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి, రాష్ట్ర పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్, అనంతపురం మేయర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు అత్యంత అనుకూలం

- విశాఖ సదస్సులో మన విధానం చెబుదాం
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చేవారికి రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా సత్వరం అనుమతులు ఇస్తున్న విధానాన్ని, మౌలిక వసతులు కల్పిస్తున్న తీరును ప్రపంచానికి తెలిసేలా విశాఖ భాగస్వామ్య సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. కియా కార్ల నుంచి ఫాక్స్‌కాన్ సెల్‌ఫోన్ల వరకు రాష్ట్రంలో తయారవుతున్న వివిధ ఉత్పత్తులను ఈ సారి సదస్సులో ప్రదర్శించాలని చెప్పారు. ఈ 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆటోమొబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల నమూనా ప్రదర్శన ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్మార్ట్ పవర్ గ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికల్స్, సోలార్ స్టోరేజ్ రంగాలకు చెందిన వారిని సదస్సులో భాగస్వాముల్ని చేయాలని నిర్దేశించారు.

మన వంటలను, ఆహార పదార్థాలను, అరకు కాఫీని ప్రమోట్ చేసుకోవాల్సిన సమయం ఇదేనని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. సదస్సుకు విచ్చేసే అతిథులకు నేచురల్ ఫార్మింగ్ ఫుడ్ అందించడం ద్వారా రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని చెప్పారు. 'పెట్టుబడి లేని సహజ వ్యవసాయం' గురించే దావోస్‌లో అంతా మాట్లాడారని, విశాఖ భాగస్వామ్య సదస్సు గురించి అలానే చెప్పుకోవాలని అన్నారు. మన కూచిపూడి నృత్యంతో ఆహుతులను ఆకట్టుకోవాలని చెప్పారు. సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రారంభించనున్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎస్పీ బాబూజీ అట్టాడ

రూ. 4 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

- అంతర్జాతీయ స్మగ్లర్ అశోక్ అరెస్ట్
- రాజస్థాన్‌లో కడప పోలీసుల దాడి

కడప, ఫిబ్రవరి 15 (మనం న్యూస్ బ్యూరో): కడప జిల్లా పోలీసులు రాజస్థాన్‌లో దాడి చేసి దాదాపు 4 కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనం దుంగలు, బొమ్మలను స్వాధీనం చేసుకుని, అంతర్జాతీయ స్మగ్లర్ అశోక్ కుమార్ అగర్వాల్ (57)ను అరెస్ట్ చేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బాబూజీ అట్టాడ వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు జైపూర్ నగరం, రఘునాథ్‌పురి, సర్నాదుంగర్ ప్రాంతంలో పోలీసులు దాడి చేసి అశోక్ గోడౌన్‌లో దాచిన 3 టన్నుల ఎర్రచందనం దుంగలు, 44 ఎర్రచందనం బొమ్మలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల జిల్లా పోలీసులు కర్ణాటకలోని బళ్లారిలో ఎర్రచందనం స్మగ్లర్ అబ్దుల్ నయీమ్‌ను అరెస్టు చేసి 2 టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అలాగే రాజంపేట ప్రాంతంలో కొంత మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, దుంగలను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. వీరిని విచారించగా అశోక్ అగర్వాల్ విషయం వెలుగు చూసిందని ఎస్పీ తెలిపారు. అతనిపై జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో 33 కేసులు నమోదయ్యాయి.

బడ్జెట్‌లో గ్రామీణానికి పెద్దపీట

- గ్రామీణుల తలసరి ఆదాయం పెరగాలి
- అధికారులకు మంత్రి యనమల సూచన
- ముందస్తు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

అమరావతి, ఫిబ్రవరి 15 (మనం ప్రతినిధి) : రాష్ట్రంలో గ్రామీణ ప్రజల అవసరాలకు అనుగుణంగా వారి తలసరి ఆదాయం పెరిగేలా ఈ ఏడాది బడ్జెట్‌ను రూపొందించాలని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు అన్ని విభాగాలకు చెందిన ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు, మంత్రులు, వివిధ శాఖలకు చెందిన ముఖ్య కార్యదర్శులతో ముందస్తు బడ్జెట్ సమావేశాలను యనమల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ రూపకల్పనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ముందస్తు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా వ్యవసాయం దాని అనుబంధ శాఖలు, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ, సహకార శాఖ, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను మంత్రి సమీక్షించారు. గ్రామీణ ప్రాంత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలని, వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వడం, పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడి గ్రామీణ ప్రజల ఆదాయం పెరగాలన్నారు. ప్రాథమిక రంగమైన వ్యవసాయం, అనుబంధ రంగాలతో సమ్మిళిత అభివృద్ధి సాధించే విధంగా బడ్జెట్ కేటాయింపులు జరగాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వ వాటాకు అన్ని శాఖల వారూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే ఇంటింటికీ తెలుగుదేశం, జన్మభూమి మా ఊరు కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో మరింత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రతి శాఖలో రెవెన్యూ వ్యయం తగ్గించుకొని, స్థిరాస్థి వ్యయం పెంచుకోవాలన్నారు. చాలా శాఖల వారు ఇచ్చిన బడ్జెట్ ఖర్చు చేయకుండా అదనపు బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయని, ఇది బడ్జెట్ మేనేజ్‌మెంట్‌కు విరుద్ధమని యనమల ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు ఇచ్చిన నిధులు ఖర్చు చేసిన తరువాత అదనపు బడ్జెట్ కేటాయింపులు అడిగితే ఇస్తామన్నారు. ప్రతీ శాఖలోనూ ఆయా ప్రాధాన్యతలను పరిశీలించి ఆపైన కేటాయింపులను ఇతర పథకాలకు ఖర్చు చేసుకునే అవకాశం కల్పించామని, ఆ విధంగా నిధులు వినియోగించుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. ప్రతి శాఖలోని సిబ్బందిని హేతుబద్ధీకరించుకొని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని వారితో పని చేయించుకోవాలన్నారు. ఎస్సీల భూమి కొనుగోలు పథకానికి తగినన్ని నిధులు కేటాయించాలని మంత్రి సూచించారు. రొయ్యల చెరువులను, వ్యవసాయ భూములను జోన్లుగా విభజించాలని ఆదేశించారు.


సమావేశంలో పాల్గొన్న మంత్రులు సోమిరెడ్డి, యనమల, ఆదినారాయణ రెడ్డి


వ్యసాయానికి ప్రాధాన్యం కల్పించండి: సోమిరెడ్డి

రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి యనమల రామకృష్ణుడును కోరారు. ఈ రంగంలో ఆధునిక పద్దతులు, యాంత్రీకరణ ప్రవేశపెడుతున్నట్లు ఆయన వెల్లడించారు. మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ, సహకార శాఖల మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు రూ.500 కోట్లతో ఒక నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. వెటర్నరీ డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పట్టణ గృహనిర్మాణ పథకం, అమరావతి మెట్రోరైల్ ప్రాజెక్టు వంటి 41 ప్రాజెక్టులు ఉన్నందున తమ శాఖకు అదనపు నిధులు కేటాయించాలని మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ కోరారు. ప్రజలు ప్రభుత్వానికి చెల్లించే అన్ని రకాల చెల్లింపులను ఆన్‌లైన్, నగదు రూపంలో చెల్లించే నూతన సాఫ్ట్‌వేర్‌ను ప్రణాళిక శాఖ ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి యనమలకు వివరించారు. పదివేల గ్రామాల్లో 26 వేల ఎకరాలలో పశుగ్రాసాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. తద్వారా 15వేల మందికి ఉపాధి కల్పించినట్లు సంబంధితశాఖ ఉన్నతాధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎం.రవిచంద్ర, వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రాజశేఖర్, పశుసంవర్ధక శాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కె.కరికాల్ వలవన్, మత్స్యశాఖ కమిషనర్ రామ్ శంకర్‌నాయక్, ఉద్యానవన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ పి.డి.కొండలరావు, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి హేమా మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు సీబీఐ కోర్టు నోటీసులు

- మార్చి 16న విచారణకు రావాలని ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (మనం లీగల్ ప్రతినిధి): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఈడీ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో సీబీఐ కోర్టు.. ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర నిందితులకు గురువారం నోటీసులు జారీ చేసింది. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య, శ్యాంప్రసాద్‌రెడ్డి, నిమ్మగడ్డ ప్రసాద్, వీన్ ప్రమోటర్స్, బేటా అప్ న్యూస్, వాల్డెన్ ప్రాపర్టీస్, ఎస్‌పీఆర్ ప్రాపర్టీస్, కార్మెల్ ఏషియా హోర్డింగ్స్, భూమి రియల్ ఎస్టేట్స్ తదితర ప్రైవేట్ కంపెనీలకు నోటీసులు ఇచ్చింది. వీరంతా మార్చి 16న జరిగే విచారణకు హాజరుకావాలని సీబీఐ కోర్టు ఆదేశించింది. హైదరాబాద్‌లోని మామిడిపల్లిలోని 250 ఎకరాల్ని ఇందూ కంపెనీ అధినేత శ్యాంప్రసాద్‌రెడ్డికి వైఎస్ సర్కార్ ఇచ్చింది. సెజ్ ప్రాజెక్టు పొందే అర్హత లేకపోయినా ఇందూకు భూమి ఇచ్చినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇందూ కంపెనీకి ఏపీఐఐసీ వైస్ చైర్మన్ హోదాలో ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య అర్హత ఉన్నట్లుగా సిఫార్సు చేశారని, ఇందుకు ప్రతిఫలంగా శ్యాంప్రసాద్‌రెడ్డి జగన్‌కు సంబంధించిన జగతి కంపెనీలో 50 కోట్లు పెట్టుబడి పెట్టారని ఆరోపణలు వచ్చాయి. నిమ్మగడ్డ ప్రసాద్‌కు చెందిన బినామీ కంపెనీల ద్వారా డబ్బును జగన్‌కు చేరేలా చేశారని, వీరిపై మనీల్యాండరింగ్ చట్టం కింద చర్యలు తీసుకోవాలని ఈడీ సీబీఐ కోర్టును కోరింది. కేసు విచారణ మార్చి 16కి వాయిదా పడింది.


(ఫైల్ ఫొటో)


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పుల్లారావు

పాదయాత్రతో కాలయాపన

- కేసుల నుంచి తప్పించుకోవడానికే
- జగన్ ప్రకటన ఓ డ్రామా: ప్రత్తిపాటి

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 15 (మనం): ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి ఆడుతున్నది జగన్నాటకం అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఏలూరులో టీడీపీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసుల నుంచి తప్పించుకోవడానికే పాదయాత్రతో జగన్ కాలయాపన చేస్తున్నారని ఎద్దేవా చేసారు. జగన్ పాదయాత్ర వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. ఎంపీల రాజీనామా ప్రకటన ఒక డ్రామా అని విమర్శించారు. ముఖ్యమంత్రి అహర్నిశలు రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడుతుంటే.. సహకరించకుండా విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రత్యేక హోదాతో ఏవైతే ఆంధ్రప్రదేశ్‌కు లాభాలు చేకూరుతాయో అవన్నీ ప్రత్యేక సహాయం ద్వారా కూడా చేకూర్చాలని కోరారు. ఎన్నికల సమయంలో ఉలిక్కి పడవలసిన అవసరం తెలుగుదేశం పార్టీకి లేదని, వైసీపీ శ్రేణులకు మాత్రమే ఆ పరిస్థితి ఉందని విమర్శించారు వార్డ్ మెంబర్‌గా పోటీ చేయడానికి నేరచరిత్ర ఉండరాదని, అలాంటిది ప్రతి శుక్రవారం సీబీఐ కోర్టుకు హాజరయ్యే జగన్‌ను ఎలా గెలిపిస్తారని ప్రశ్నించారు. ప్రధాని మోదీతో వైసీపీ నేత విజయసాయిరెడ్డి మంతనాలు జరుపుతున్నారని అన్నారు. ప్రధాన ప్రతిపక్షమే రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా నిలవడం విచారకరం అని అన్నారు. రాజధాని, పోలవరం విషయంలో అడ్డుకున్నారన్నారని విమర్శించారు. పోలవరానికి సంబంధించిన ప్రతి రూపాయి ఖర్చు ఆన్‌లైన్‌లో పొందుపరిచామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్తకళల అభివృద్ధి చైర్మన్ పాలి ప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఎమ్మెల్యేలు పీతల సుజాత, మోడియం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బద్నాం చేసేందుకు కుట్ర

- విపక్షాలతో పాటు టీడీపీ కూడా: ఎమ్మెల్సీ మాధవ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (మనం న్యూస్ బ్యూరో): రాష్ట్రంలో బీజేపీని బద్నాం చేసేందుకు విపక్షాలతో పాటు మిత్రపక్షమైన టీడీపీ కూడా కుట్ర చేసిందని బీజేపీ ఎమ్మెల్సీ పి. మాధవ్ ఆరోపించారు. విభజన హామీలను అమలు చేసే విషయంలో కేంద్రం కట్టుబడి ఉందని అన్నారు. గురువారం విశాఖలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు విడుదల చేసిన 27 పేజీల ప్రకటనలో పేర్కొన్న ప్రతి అంశానికీ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఇదంతా తప్పని, తాము అబద్ధాలు చెబుతున్నామంటూ టీడీపీ ప్రకటన విడుదల చేయడం దారుణమని అన్నారు. రాష్ట్ర రెవిన్యూ లోటులో రుణమాఫీని కలిపినందునే కేంద్రం ఆ నిధులపై అభ్యంతరం చెప్పిందని స్పష్టం చేశారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది బీజేపీయేనని చెప్పారు. రాజధాని అమరావతికి ఇప్పటికీ ప్రభుత్వం డీపీఆర్ ఇవ్వలేదని, అయినా కేంద్రం రూ.2500 కోట్లను విడుదల చేసిందని చెప్పారు. మిత్రధర్మం కోసం బీజేపీ మౌనంగా ఉంటుంటే టీడీపీ దానిని అలుసుగా తీసుకొని దుష్ప్రచారం చేయడం తగదని మాధవ్ హెచ్చరించారు.

లాభపడిన సూచీలు

కుంభకోణం దెబ్బకి కకావికలైన పి.ఎన్.బి షేర్ విలువ



ముంబయి: అంతర్లీనంగా ఎక్కువ విలువ కలిగి స్టాక్ మార్కెట్లలో మాత్రం తక్కువ విలువకు కోట్ అవుతున్న షేర్లను మదుపరులు కొనడం, ద్రవ్యోల్బణంపై డాటా ప్రోత్సాహకరంగా ఉండడంతో గీటురాయిగా భావించే బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' గురువారం 140 పాయింట్లకు పైగా లాభపడింది. రూ. 11,400 కోట్ల భారీ కుంభకోణానికి కేంద్ర బిందువుగా నిలిచిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి) షేర్ విలువ గురువారంనాడు మరో 12 శాతం పతనమైంది. ఈ బ్యాంక్ రెండు రోజుల్లో మార్కెట్ విలువలో రూ. 8,000 కోట్లకు పైగా కోల్పోయింది. అది ఒక ఏడాది మొత్తం మీద సంపాదించిన లాభానికి ఈ నష్టపోయిన మొత్తం ఆరు రెట్లకన్నా ఎక్కువగా ఉంది. ప్రభుత్వం రంగంలోని ఈ బ్యాంక్ రుణాలివ్వడంలో రెండవ అతి పెద్ద సంస్థగా నిలిచింది. అయితే, బ్యాంకింగ్ రంగానికి చెందిన ఇతర షేర్లు మాత్రం గురువారం తమ విలువలను కాపాడుకోగలిగాయి. 'సెన్సెక్స్' 141.52 పాయింట్లు లాభపడి 34,297.47 పాయింట్ల వద్ద ముగిసింది. విస్తృతమైన నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎ స్.ఇ) సూచి 'నిఫ్టీ' 44.60 పాయింట్లు పుంజుకుని 10,545.50 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రా-డేలో అది 10,618.10 పాయింట్ల గరిష్ఠ స్థితిని చూసింది.

డాటాతో ఉత్సాహం

టోకు ద్రవ్యోల్బణం జనవరిలో గత ఆరు నెలల కనిష్ఠ స్థాయి 2.84 శాతంగా ఉండడం, కొన్ని బ్లూ-చిప్ కంపెనీల రాబడులు ప్రోత్సాహకరంగా ఉండడంతో మదుపరుల సెంటిమెంట్ పెంపొందిందని బ్రోకర్లు చెప్పారు.

ఇద్దరివీ అమ్మకాలే

తాత్కాలిక డాటా ప్రకారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్.పి.ఐ) బుధవారం రూ. 728.71 కోట్ల విలువైన షేర్లు విక్రయించగా, దేశీయ మదుపు సంస్థ (డి.ఐ.ఐ)లు కూడా రూ. 152.39 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించాయి.

ప్రపంచ మార్కెట్ల సానుకూల సంకేతాలు

''అమెరికాలో ద్రవ్యోల్బణం 2.1 శాతానికి పెరిగి, వినియోగ వస్తువుల అమ్మకాల డాటా పేలవంగా ఉన్నప్పటికీ, ప్రపంచ మార్కెట్లు గురువారం సానుకూల సంకేతాలనే కనబరచాయి. దేశీయ మార్కెట్‌లో ట్రేడింగ్ సానుకూల స్థితిలోనే సాగినప్పటికీ, మిడ్, స్మాల్ క్యాప్స్ విభాగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. దానికితోడు, పి.ఎస్.యు బ్యాంకింగ్ సూచి ఎన్.పి.ఏ సంబంధిత సమస్యల కారణంగా నిజపటిమకన్నా తక్కువ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. బాండ్ ప్రతిఫలాలు పెరగడం, భవిష్యత్తులో ఊహిస్తున్న సమయంకన్నా చాలా ముందుగానే వడ్డీ రేట్లు పెరగవచ్చనే అంచనాతో మదుపరులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు. వాల్‌స్ట్రీట్‌లో ర్యాలీని ఊతం చేసుకుని, ఆసియాలోని ఇతర మార్కెట్లు కూడా గురువారం లబ్ధి పొందాయి. జపాన్‌కు చెందిన నికాయ్ 1.47 శాతం లాభంతో ముగిసింది. షాంఘై మార్కెట్ గురువారం సెలవు రోజు కావడంతో కార్యకలాపాలు నిర్వహించలేదు. ఇతర మార్కెట్లు ప్రారంభ లావాదేవీల్లో ఆరోహణ క్రమంలో ఉన్నాయి.

రాణించిన నెస్లే

నెస్లే ఇండియా నాల్గవ త్రైమాసిక నికర లాభంలో 60 శాతం పెరుగుదలను ప్రకటించడంతో ఈ కంపెనీ షేర్ విలువ గురువారం 4.28 శాతం లాభపడింది. మొత్తం అమ్మకాలు 2017లో రూ. 10,000 కోట్లను మించినట్లు నెస్లే తెలిపింది.

కళ తప్పిన గీతాంజలి

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌నకు చెందిన దాదాపు రూ. 11,400 కోట్ల మోసపూరిత, ఆగంతుక లావాదేవీలు బహిరంగమైన తర్వాత, వివిధ దర్యాప్తు సంస్థల నిఘా నేత్రం కిందకు వచ్చిన గీతాంజలి జెమ్స్ షేర్ ధర గురువారం 19.97 శాతం పతనమైంది. పి.సి. జువెలర్, త్రిభువన్‌దాస్ భీమ్‌జీ జవేరీ, రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ వంటి ఇతర నగల సంస్థల షేర్ల విలువలు కూడా 5.31 శాతం వరకు పతనమయ్యాయి.

ప్రభుత్వాఫీసులకు కొత్త ఏసీలు

ముంబయి: గోద్రెజ్ గ్రూపునకు చెందిన మన్నికైన వినియోగ వస్తువుల తయారీ విభాగం గోద్రెజ్ అప్లియెన్సెస్ గురువారం ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ (ఇ.ఇ.ఎస్.ఎల్) నుంచి రూ. 207 కోట్ల విలువైన ఆర్డరు సంపాదించింది. ఇది ప్రభుత్వ, రైల్వే సంస్థలలో 52,000 గ్రీన్ ఇన్వెర్టర్ ఎయిర్-కండిషనర్ల (ఏసీల)ను ఏర్పాటు చేసి, పనిచేసేట్లు చేయడానికి సంబంధించిన కాంట్రాక్టు. ''ఈ కాంట్రాక్టు 52,000 గోద్రెజ్ ఎన్ఎక్స్‌డబ్ల్యు గ్రీన్ ఇన్వెర్టర్ ఏసీల యూనిట్ల డిజైన్, తయారీ, సరఫరా, బిగించడం, సర్వీసింగ్ చేయడానికి సంబంధించినది. ఈ ఏసీలు 5.25 ఐ.ఎస్.ఇ.ఇ.ఆర్‌తో 5 స్టార్ రేటింగ్ కలిగి ఉన్నాయి'' అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. గోద్రెజ్ అప్లియెన్సెస్‌కు చెందిన సబ్-బ్రాండ్ గోద్రెజ్ ఎన్ఎక్స్ డబ్ల్యు. ప్రభుత్వ భవనాల్లో పాత ఏసీల స్థానంలో కొత్త వాటిని బిగించాలని ప్రభుత్వం భావిస్తోందని ఇ.ఇ.ఎస్.ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ కుమార్ చెప్పారు. కొత్త ఏసీలు విద్యుత్ వాడకాన్ని 30 శాతం ఆదా చేస్తాయని ఆయన చెప్పారు. ''మార్చి 31కల్లా దాదాపు 1500 భవనాల్లో ఇవి ఉంటాయి. మొత్తం 2,500 కేంద్ర ప్రభుత్వ ఆఫీసులు, ప్రభుత్వ రంగ కంపెనీ భవనాల్లో జూన్‌కల్లా వాటిని అమరుస్తారు'' అని ఆయన చెప్పారు. విద్యుత్ మంత్రిత్వ శాఖ కింద ఇ.ఇ.ఎస్.ఎల్ పనిచేస్తోంది. ఎన్.టి.పి.సి, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ అండ్ రూరల్ ఎలక్ట్రిఫికేషన్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్లు సంయుక్త రంగంలో దాన్ని నెలకొల్పాయి.

తగ్గిన టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: పండ్లు, కూరగాయలతో సహా ఆహార వస్తువులు, ఇంధనం చౌక అవడంతో టోకు ద్రవ్యోల్బణం 2018 జనవరిలో గత ఆరు నెలల కనిష్ఠ స్థాయికి సడలింది. డిసెంబరులో 3.58 శాతంగా ఉన్న టోకు ధరల సూచి ఆధారిత ద్రవ్యోల్బణం జనవరిలో 2.84 శాతానికి తగ్గినట్లు గురువారం విడుదలైన డాటా వెల్లడించింది. డబ్ల్యు.పి.ఐ ఆహార సూచి ఆధారిత ద్రవ్యోల్బణం 2017 డిసెంబరులో 2.91 శాతం ఉన్నది 2018 జనవరిలో 1.65 శాతానికి తగ్గింది. ఈ వారం మొదట్లో విడుదల చేసిన డాటా రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతంగా ఉన్నట్లు తెలిపింది.


కూరగాయల ధరలు అధికమే

కాయధాన్యాలు 30.43 శాతం ప్రతిద్రవ్యోల్బణాన్ని వీక్షించాయి. గోధుమలు, తృణధాన్యాలు కూడా వరుసగా 6.94 శాతం, 1.98 శాతం ప్రతిద్రవ్యోల్బణాన్ని చూపాయి. ప్రొటీన్లు పుష్కలంగా ఉండే గుడ్లు, మాంసం, చేపల ధరలు 0.37 శాతం తగ్గగా, పండ్ల ధరలు జనవరిలో 8.49 శాతం పెరిగాయి.



ఇంధన, విద్యుత్ విభాగంలో, టోకు ద్రవ్యోల్బణం జనవరిలో 4.08 శాతం పెరిగింది. తయారైన వస్తువుల విషయంలో అది 2.78 శాతంగా ఉంది. కీలక పరపతి రేట్లను నిర్ణయించడంలో రిజర్వ్ బ్యాంక్ రిటైల్ ద్రవ్యోల్బణాన్ని పరిశీలనలోకి తీసుకుంటుంది. ఆర్.బి.ఐ గత వారం ద్రవ్య విధానాన్ని సమీక్షించినప్పుడు కీలక వడ్డీ రేటును మార్చకుండా అలానే ఉంచింది. ప్రస్తుత జనవరి-మార్చి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉండగలదని అంచనా వేసింది. ఏప్రిల్-సెప్టెంబరు కాలంలో అది 5.1-5.6 శాతంగా ఉండగలదని అంచనా వేసింది. కాగా, వచ్చే నవంబరులో ద్రవ్యోల్బణం ఇంతకుముందు అనుకున్నట్లుగా 3.93 శాతంగా కాక 4.02 శాతంగా ఉండగలదని అంచనా సవరించారు.

ఎగుమతులకు ఊతమిచ్చే ప్రదర్శన



చెన్నై: ఏడవ విడత ఇంటర్నేషనల్ ఇంజనీరింగ్ సోర్సింగ్ షో (ఐ.ఇ.ఎస్.ఎస్) చెన్నైలో 2018 మార్చి8-10 తేదీలలో జరగనుందని అధికారులు చెప్పారు. ఈ ఏడాది సంచికకు చెక్ రిపబ్లిక్ భాగస్వామ్య దేశంగా ఉండగా, తమిళనాడు ఆతిథేయ రాష్ట్రంగా ఉందని ఇంజనీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఇ.ఇ.పి.సి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భాస్కర్ సర్కార్ ఇక్కడ మీడియా ప్రతినిధులకు చెప్పారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సౌజన్యంతో, ఇ.ఇ.పి.సి ఆధ్వర్యంలో జరిగే 2018 ఐ.ఇ.ఎ స్.ఎస్ సుమారు 400 ఎగ్జిబిటర్లను ఆకర్షించగలదని భావిస్తున్నారు. గత ఏడాది ప్రదర్శనను కూడా చెన్నైలోనే నిర్వహించారు. దానిలో సుమారు 300 మంది ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు. ''ఇది కేవలం ఎగుమతుల ప్రోత్సాహక కార్యక్రమం మాత్రమే కాదు. భారతీయ రాష్ట్రాల మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణికి వెసులుబాటు కల్పిస్తున్న ప్రదర్శన'' అని ఆయన అన్నారు. ఈ షోలో తెలంగాణ, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, హర్యాణా, జార్ఖండ్ రాష్ట్రాలు పాల్గొననున్నట్లు తెలిపారు. స్థానిక వ్యాపార సంస్థలకు, విదేశీ భాగస్వాములతో భాగస్వామ్యాలను పెంపొందించడం ఈ ప్రదర్శన లక్ష్యమని భారతదేశంలో చెక్ రిపబ్లిక్ రాయబారి మిలన్ హవోర్కా చెప్పారు. ఈ కార్యక్రమంలో చెక్ ప్రతినిధి బృందాలు భాగంగా ఉంటాయి. చెక్ రిపబ్లిక్ ''ఐరోపాలో పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానాలలో ఒకటి'' అని హవోర్కా అన్నారు. ఐరోపా ఖండంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో అది ఒకటని తెలిపారు.

మూడు రోజులపాటు సాగే ఈ ప్రదర్శనలో ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధితో సహా వివిధ కేటగిరీల కింద 'బార్క్', ఐ.ఐ.టి మద్రాస్, సిమన్స్, కేటర్‌పిల్లర్, భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, చెన్నై పెట్రోకెమికల్స్ కార్పొరేషన్ వంటి దేశ, విదేశీ దిగ్గజాలు పాల్గొననున్నాయి. ''దేశ ఎగుమతులలో ముఖ్యంగా ఇంజనీరింగ్ ఎగుమతులలో గణనీయమైన వృద్ధి'' కనబరచిన నేపథ్యంలో ఐ.ఇ.ఎస్.ఎస్ 2018 ప్రదర్శన చోటుచేసుకుంటోందని సర్కార్ చెప్పారు. ''భారతదేశ మొత్తం ఎగుమతుల బాస్కెట్‌లో హెచ్చు ఎంప్లాయ్‌మెంట్ ఓరియంటెడ్ ఇంజనీరింగ్ ఎగుమతుల వాటా 26 శాతం పైగా ఉంది'' అని ఆయన అన్నారు.

ఈ ప్రదర్శన సుమారు 500 మంది ప్రపంచవ్యాప్త కొనుగోలుదార్లను, 10,000 మంది ట్రేడ్ సందర్శకులను ఆకర్షించగలదని భావిస్తున్నారు. మూడు చెక్ విశ్వవిద్యాలయాలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది. చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ఈ ప్రదర్శనను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభు, చెక్ వర్తక శాఖ మంత్రి తోమస్ హ్యూనర్ ప్రారంభిస్తారు.

చార్జింగ్ స్టేషన్ల ప్రారంభం

ఎలక్ట్రిక్ కార్ల తయారీలో జోష్ రావాలి



న్యూఢిల్లీ: సరసమైన ధరలకు నాణ్యమైన వాహనాలు తయారు చేయడం ద్వారా, ఎలక్ట్రిక్ వాహనాలకు భారతదేశం ఎంతో దూకుడుతో ఇస్తున్న ప్రాధాన్యం నుంచి మోటారు వాహనాల తయారీ సంస్థలు ప్రయోజనాలు కూడగట్టుకోవాల్సిన సమయం వచ్చిందని కేంద్ర మంత్రి గడ్కరీ అన్నారు. ''భారతదేశంలో మోటారు వాహనాల పరిశ్రమ వెల ప్రధానమైనదేకానీ, నాణ్యత ప్రధానమైనది కాదు. అందుకనే వారు (సంస్థలు) హెచ్చు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. విదేశీ సంస్థలు మాత్రం ఈ సిద్ధాంతాన్ని అనుసరించి బాగా ప్రాచుర్యం పొందాయి'' అని ఆయన అన్నారు. ''ప్రమాణాలతో కూడిన ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తికి ఆటోమేకర్లు ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. మొదట ఎవరు అడుగుపెడతారో వారు తప్పకుండా విజేతలుగా నిలిచే, లాభాలు మూటగట్టుకునే అవకాశం ఉంది. వెలపై దృష్టి పెడుతున్నవారు వెనుకనే మిగిలిపోతారు'' అని మంత్రి అన్నారు. ఎలక్ట్రిక్ కార్ల ధరలను తగ్గించేందుకు ఈ విభాగంలో ''గట్టి పోటీ'' అవసరమని గడ్కరీ అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో జోరు పెంచేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు తీసుకుందని ఆయన చెప్పారు. కార్లు, వాణిజ్య వాహనాలతోపాటు, ట్రాక్టర్ల విభాగంలో కూడా ఎలక్ట్రిక్ వినియోగాన్ని పరీక్షించి చూస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రిక్ మొబిలిటీకి ఇస్తున్న ప్రాధాన్యం ''రవాణా రంగంలో నూతన శకానికి, చారిత్రక, విప్లవాత్మక అధ్యాయానికి నాంది పలుకుతుంది...మనం రూ. 7 లక్షల కోట్ల విలువ చేసే ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నాం. అది ఆర్థిక వ్యవస్థకు పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. (ఎలక్ట్రిక్ వినియోగంతో) మనం దాన్ని అరికట్టవచ్చు. కాలుష్యాన్ని నిరోధించవచ్చు'' అని గడ్కరీ అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'మేడ్ ఇన్ ఇండియా' కార్యక్రమాలు వాహనాల ధరలను తప్పకుండా తగ్గిస్తాయని ఆయన చెప్పారు. టాటాలు తయారు చేసిన ఎలక్ట్రిక్ బస్సును ఆయన ప్రశంసించారు. ఎలక్ట్రిక్, బయో-ఇంధనాల చోదిత వాహనాల వాడకాన్ని ప్రోత్సహించేందుకు వాటిపై జి.ఎస్.టిని నామమాత్రంగా 12 శాతంగానే ఉంచినట్లు ఆయన తెలిపారు. నీతి ఆయోగ్ ప్రాంగణంలో ఎలక్ట్రిక్ వాహ



నాల చార్జింగ్ స్టేషన్లను కేంద్ర రోడ్డు, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం ప్రారంభించారు. కొత్త పెట్రోలు, డీజిలు వాహనాల అమ్మకాలను 2030 తర్వాత దశల వారీగా నిలిపివేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. వాతావరణ మార్పు, రవాణా రంగం శిలాజ ఇంధనాలపై ఆధారపడడంపై పెరుగుతున్న ఆందోళనలకు ప్రతిస్పందనగా చార్జింగ్ స్టేషన్లు తీసుకువస్తున్నట్లు అధికారిక ప్రకటన ఒకటి వెల్లడించింది. భారతదేశానికి, ఎలక్ట్రిక్ సంచార విప్లవం భవిష్యత్ దృశ్యాన్ని నాటకీయంగా మార్చివేయగల శక్తిగలది. కానీ, ఈ విప్లవాన్ని తీసుకొచ్చేందుకు ప్రేరణ, బలం చార్జింగ్ మౌలిక సదుపాయాలు తగినన్ని అందుబాటులో ఉంటేనే లభిస్తాయని ఆ ప్రకటన తెలిపింది. ఎలక్ట్రిక్ మొబిలిటీకి సమన్వయ సంస్థగా నీతి ఆయోగ్ వ్యవహరిస్తోంది. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సి.ఇ.ఓ అమితాబ్ కాంత్ కూడా పాల్గొన్నారు.

గోధుమ కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: ఏప్రిల్‌లో మొదలయ్యే 2018-19 మార్కెటింగ్ సంవత్సరంలో 32 మిలియన్ టన్నుల గోధుమలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం గురువారం నిర్ణయించింది.



ప్రభుత్వ యాజమాన్యంలోని భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ) 2017-18లో 30.82 మిలియన్ టన్నుల గోధుమలు కొనుగోలు చేసింది. కొనుగోళ్ళ ఏర్పాట్ల గురించి చర్చించేందుకు ఇక్కడ ఏర్పాటైన రాష్ట్రాల ఆహార కార్యదర్శుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆహార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశానికి ఆహార కార్యదర్శి రవి కాంత్ అధ్యక్షత వహించారు. పంజాబ్, హర్యాణా, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, బిహార్, ఉత్తరాఖండ్‌ల నుంచి ప్రధానంగా గోధుమలు కొనుగోలు చేయనున్నారు. గోధుమ మార్కెటింగ్ సంవత్సరం ఏప్రిల్ నుంచి మార్చి వరకు అయినప్పటికీ, కొనుగోళ్ళలో అత్యధిక భాగం మొదటి మూడు నెలల్లోనే చోటుచేసుకుంటాయి. కనీస గిట్టుబాటు ధర వద్ద రాష్ట్ర ఏజన్సీలు వీటిని కొంటాయి. ప్రభుత్వం 2017-18 పంట సంవత్సరం రబీ సీజనులో పండించిన ధాన్యాన్ని 5.5 మిలియన్ టన్నులు కొనాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో కొనాలని లక్ష్యంగా పెట్టుకున్న 37.5 మిలియన్ టన్నుల ధాన్యంలో, ఈ ఏడాది ఫిబ్రవరి 9 నాటికి 28.97 మిలియన్ టన్నులు కొనుగోలు చేశారు. 2017-18 పంట సంవత్సరంలో 97.50 మిలియన్ టన్నుల గోధుమల దిగుబడి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోధుమ పంట వైశాల్యం 4 శాతం తగ్గినప్పటికీ, ఈసారి గోధుమల ఉత్పత్తి మెరుగ్గా ఉండి 100 మిలియన్ టన్నుల ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరవచ్చని ప్రభుత్వం ఆశిస్తోంది.


పాల్‌ఘర్‌లో మహీంద్రా ప్రాజెక్టు

న్యూఢిల్లీ: స్థిరాస్తుల సంస్థ మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్స్, హెచ్.డి.ఎఫ్.సి క్యాపిటల్ అడ్వైజర్స్ కలసి సంయుక్త రంగంలో మహారాష్ట్రలోని పాల్‌ఘర్‌లో సాధారణ గృహ నిర్మాణ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నాయి. అవి విక్రయించే అపార్ట్‌మెంట్లు రూ. 8-24 లక్షల శ్రేణిలో ఉండబోతున్నాయి. దేశవ్యాప్తంగా సరసమైన ధరలకు గృహాలు నిర్మించి ఇచ్చేందుకు రూ. 500 కోట్ల నిధిని సిద్ధం చేయడానికి మహీంద్రా లైఫ్‌స్పేస్ గత ఏడాది అక్టోబరులో హెచ్.డి.ఎఫ్.సి క్యాపిటల్ ఎఫర్డబుల్ రియల్ ఎస్టేట్ ఫండ్-1 (హెచ్.డి.ఎఫ్.సి క్యాపిటల్)ను భాగస్వామిగా చేసుకుంది. 'హ్యాపినెస్ట్-పాల్‌ఘర్' పేరుతో సంయుక్త ప్లాట్‌ఫాం మొదటి సాధారణ గృహ నిర్మాణ ప్రాజెక్టు చేపడుతున్నట్లు మహీంద్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. హెచ్.డి.ఎఫ్.సి క్యాపిటల్‌ను హెచ్.డి.ఎఫ్.సి క్యాపిటల్ అడ్వైజర్స్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. పాల్‌ఘర్‌లో 8 ఎకరాల వైశాల్యంలో రూ. 8-24 లక్షల శ్రేణి కలిగిన దాదాపు 850 అపార్ట్‌మెంట్లను నిర్మించనున్నారు. ''మహీంద్రా లైఫ్‌స్పేస్‌కి సాధారణ గృహ నిర్మాణ విభాగం ముఖ్యమైన విభాగంగా ఉంది. మా అభివృద్ధి పయనంలో అది ముఖ్యమైన పాత్ర వహించబోతోంది. హ్యాపినెస్ట్-పాల్‌ఘర్‌తో 2018కి శుభారంభం పలకడం మాకు ఆనందంగా ఉంది'' అని మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అనిత అర్జున్‌దాస్ చెప్పారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసి అందించిన మెచ్చుకోతగ్గ చరిత్ర ఉన్న, సరసమైన ధరలు గృహ నిర్మాణం పట్ల దీర్ఘకాలిక దృక్పథం కలిగిన నమ్మతగిన రియల్ ఎస్టేట్ బ్రాండ్లతో భాగస్వామ్యాలు కుదుర్చుకునేందుకు హెచ్.డి.ఎఫ్.సి క్యాపిటల్ సిద్ధంగా ఉందని హెచ్.డి.ఎఫ్.సి క్యాపిటల్ అడ్వైజర్స్ సి.ఇ.ఓ విపుల్ రూంగ్టా చెప్పారు. మహారాష్ట్రలో పాల్‌ఘర్ ప్రాచుర్యం పొందిన టూరిస్టు ప్రదేశమని, వృద్ధి చెందుతున్న పారిశ్రామిక కేంద్రమని మహీంద్రా గ్రూప్ పేర్కొంది. శీఘ్రగతిన మౌలిక వసతులు అభివృద్ధి చేయవలసిన పట్టణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పాల్‌ఘర్‌ను గుర్తించింది. 'హ్యాపినెస్ట్' కేటగిరీ బ్రాండ్ ద్వారా ఈ రియల్టీ సంస్థ 2014 నుంచి సాధారణ గృహ నిర్మాణ విభాగంలో ఉంది. చెన్నైలోని వివిధ ప్రాజెక్టులలో దాదాపు 1500 యూనిట్లకు పైగా అమ్ముడయ్యాయి. ఇప్పటికే 1100 గృహాలను అందజేశారు. మహీంద్రా లైఫ్‌స్పేస్‌ను 1994లో నెలకొల్పారు. 1900 కోట్ల అమెరికన్ డాలర్ల మహీంద్రా గ్రూప్‌లో ఇది రియల్ ఎస్టేట్, మౌలిక వసతుల అభివృద్ధి వ్యాపార విభాగంగా ఉంది.

లాభాల బాటలో సన్‌టెక్

న్యూఢిల్లీ: సన్‌టెక్ రియల్టీ 2017 డిసెంబరుతో ముగిసిన క్యూ 3లో అధిక అమ్మకాల రాబడుల ద్వారా రూ. 55.66 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని గడించినట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కమల్ ఖేతన్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో కంపెనీ రూ. 20.6 కోట్ల నికర లాభాన్ని మాత్రమే నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సర క్యూ 3లో రూ. 90 కోట్లుగా ఉన్న సంస్థ మొత్తం ఆదాయం ఈ క్యూ 3లో రూ. 204.9 కోట్లకు పెరిగింది. ముంబయికి చెందిన ఈ సంస్థ నగరాల్లో వసతులను అభివృద్ధిపరచడంపై దృష్టి కేంద్రీకరించింది.

చెన్నై-ఢిల్లీ మధ్య విస్తారా విమాన సర్వీసు



చెన్నై: విస్తారా విమానయాన సంస్థ చెన్నై నుంచి ఢిల్లీకి నేరుగా వెళ్ళే రోజువారీ విమాన సర్వీసులను గురువారం ప్రారంభించింది. ఇక్కడి విమానాశ్రయానికి వచ్చిన ఎ320 విమానానికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అది 158 మంది ప్రయాణికులతో ఉదయం 7.50కి ఢిల్లీకి బయలుదేరింది.''దేశీయ రంగంలోని సుదూర రూట్లలో చెన్నై-ఢిల్లీ రూటు కూడా ఒకటి. మార్చి 1 నుంచి ఈ రెండు నగరాల మధ్య విమాన రాకపోకలను రెట్టింపు చేస్తాం. ఒకే రోజులో వెళ్ళి తిరిగి వచ్చే అవకాశాన్ని రెండు నగరాల వైపు నుంచి కల్పిస్తాం'' అని విస్తారా ఛీఫ్ స్ట్రాటజీ అండ్ కమర్షియల్ ఆఫీసర్ సంజీవ్ కపూర్ చెప్పారు. మార్చి 1 నుంచి చెన్నై నుంచి పోర్ట్ బ్లైర్‌కు కూడా రూ. 3,699 చార్జీతో ఒక విమాన సర్వీసు ప్రారంభించాలని విస్తారా భావిస్తోంది. చెన్నై-కొచ్చిల మధ్య కూడా నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించాలని నిర్ణయించినట్లు కపూర్ చెప్పారు. చెన్నై-కోల్‌కతాల మధ్య సర్వీసులను మార్చి 25 నుంచి రెట్టింపు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కొత్తగా చెన్నై కూడా వచ్చి చేరడంతో విస్తారా విమానయాన సంస్థ అన్ని మెట్రోలకు విమానాలు నడుపుతున్నట్లు అయింది.

విను.. వినుపించు!



చెవిలో ఇయర్ ఫోన్ పెట్టుకున్న వాళ్లందరూ సినిమా పాటలు వింటారనుకోవడం పొరపాటే. కొందరు మొబైల్‌లో ఆధ్యాత్మిక ప్రవచనాలు వింటుంటే, మరికొందరు భక్తి గీతాలు ఆలకిస్తుంటారు. ఇంకొందరు వార్తలు, వింటుంటారు... వ్యాసాలు చదువుతుంటారు. అదేంటి మొబైల్‌లో వాటిని చదవగలం కానీ, వినడమేంటి అంటారా? వార్తల్ని, సమాచారాన్ని, తరగతి పాఠాల్ని చదవాల నుకుంటే అన్నివేళలా సాధ్యం కాకపోవచ్చు. అలాంటప్పుడు ఆడియో, వీడియోల ద్వారా సమాచారాన్ని సంగ్రహించవచ్చు. అలా చదవకుండా విషయాన్ని తెలుసుకోగలిగే కొన్ని ఆప్షన్ల గురించి చూద్దాం!

పాట... పరుగు

ఓ చేతిలో ఎంపీ3 ప్లేయర్, మరో చేతికి ఫిట్‌నెస్ ట్రాకర్... ఉదయాన్నే వాకింగ్/ రన్నింగ్‌కు వెళ్తున్నప్పుడు ఇదేనా మీ పరిస్థితి. 'పెబెల్ కోర్' ఫిట్‌నెస్ ట్రాకర్‌తో ఆ పరిస్థితిని సింపుల్ చేయొచ్చు. పాటల పెట్టె, ఫిట్‌నెస్ ట్రాకర్‌ను కలిపి ఒకటిగా చేసిన పరికరం ఇది. చేతి గడియారం పరిమాణంలో ఉండే పెబెల్ కోర్‌ను చొక్కా కాలర్‌కు లేదంటే డ్రెస్‌కు తగిలించేయొచ్చు. దానికి ఇయర్‌ఫోన్ పెట్టుకొని పాటలు వింటూ ఉదయపు నడక కొనసాగించొచ్చు.




ఇది మొబైల్ డేటా లేదా వై-ఫై ఆధారంగా జీపీఎస్ పరిజ్ఞానంతో పని చేస్తుంది. నాలుగు సెంటీమీటర్ల పరిమాణంలో, 50 గ్రాముల బరువు ఉంటుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో మన దేశ మార్కెట్‌లోకి వస్తుంది. ధర సుమారు రూ.ఐదు వేలు. పెబెల్ ట్రాకర్‌పై రెండు బటన్స్ ఉంటాయి. పెద్ద బటన్‌ను ఒత్తితే మీ రన్నింగ్ యాక్టివిటీ నమోదు చేసుకోవడం మొదలవుతుంది. మీరు ఎంతసేపు నడిచారో, పరిగెత్తారో తెలియాలంటే మరోసారి ఆ పెద్ద బటన్ నొక్కాలి. యాక్టివిటీ పూర్తయినప్పుడు ఆ బటన్‌ను లాంగ్ ప్రెస్ చేస్తే సరి. దానిపైన ఉండే చిన్న బటన్‌ను ఒత్తడం ద్వారా అత్యవసర సమయాల్లో దీని నుంచి నేరుగా మీ మిత్రునికి సందేశం పంపొచ్చు. మిత్రుని నెంబరును ముందుగా నమోదు చేసుకొని ఉండాలి. ఈ మొత్తం యాక్టివిటీని సంబంధిత ఆప్ ద్వారా మీ మొబైల్‌కు కనెక్ట్ చేసుకొని చూడొచ్చు.



ఎయిర్ పాడ్స్ కట్టేద్దాం

ఐఫోన్ 7 సిరీస్ ఫోన్లు ప్రకటించింది మొదలు... అందరిలోనూ ఒకటే ప్రశ్న! ఎయిర్ పాడ్స్ (వైర్‌లెస్ ఇయర్ ఫోన్స్) అలా ఉన్నాయేంటి... చెవి నుంచి జారిపోతాయి కదా? ఎయిర్ పాడ్స్ డిజైన్ వల్లే ఈ ఇబ్బంది. మధ్యలో కేబుల్ లేకుండా కేవలం రెండు ఇయర్ బడ్స్‌తో ఎయిర్ పాడ్స్ రూపొందించారు. ఇవి చిన్నగా ఉండటం, అటాచ్ కేబుల్ లేకపోవడం వల్ల చెవిలోంచి జారిపోతాయేమో అన్నట్లుగా ఉంటాయి. ఈ సమస్య లేకుండా రెండు ఎయిర్ ప్యాడ్లను కలిపేలా స్ట్రాప్‌లు అందుబాటులో ఉన్నాయి. రెండు పాడ్స్ చివర్లను కలుపుతూ చిన్న తాడు లాంటి ఈ స్ట్రాప్ వల్ల ఎయిర్ పాడ్స్ చెవి నుంచి జారిపోయినా ఇబ్బంది ఉండదు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఈ స్ట్రాప్ ధర సుమారు రూ.650. మన దేశంలో వచ్చే నెల నుంచి ఇవి అందుబాటులో ఉంటాయి. ఎలాగూ ఐఫోన్ 7 సిరీస్ ఫోన్లు కూడా అప్పటినుంచే మన మార్కెట్‌లోకి వస్తాయి.

దాచుకోండి... వినేయండి



వెబ్‌సైట్‌లో టెక్స్ట్ టు స్పీచ్ ఆప్షన్ ద్వారా సమాచారాన్ని విందామంటే... అందులో యాడ్స్ ఇబ్బంది పెడుతున్నాయా? సమాచారం సరిగ్గా సెలెక్ట్ అవ్వడం లేదా? ఆప్ డౌన్‌లోడ్ చేసుకోండి. వెబ్‌సైట్‌లోని సమాచారాన్ని సులభంగా సేవ్ చేసుకోవడానికి ఈ ఆప్ ఉపయోగపడుతుంది. కావల్సిన మేటర్ ఉన్న వెబ్‌సైట్ యూఆర్‌ఎల్‌ను కాపీ చేసుకొని ఇన్‌స్టాపేపర్ ఆప్‌లో పేస్ట్ చేయండి. అప్పుడు మీకు కావల్సిన సమాచారం ప్రకటనలు లేకుండా ఆప్‌లోకి చేరిపోతుంది. ఆ తర్వాత పైన ఉండే స్పీకర్ ఐకాన్‌ను ఒత్తితే అక్కడే వినొచ్చు. అయితే ఇది ఆంగ్ల వెబ్‌సైట్లకు మాత్రమే పని చేస్తుంది.

స్మార్ట్ జవాబులు



క్లాస్ రూమ్‌లో టీచర్ ఏదైనా అడిగితే చాలు. అందరూ ఒకేసారి మూకు మ్మడిగా జవాబు అరిచి చెప్పిన రోజులు గుర్తున్నాయా? దీంతో ఎవరు సమాధానం చెప్పారో, అసలు అందరికీ సమాధానం తెలుసో లేదో అనేది టీచర్ తెలుసుకోవడం చాలా కష్టం. అందుకే 'స్మార్ట్'గా తరగతి గదిలో పరీక్ష పెట్టేస్తే! అందుకో ప్రత్యేక వేదిక ఉంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి ఒక్క విద్యార్థి సమాధానం వినేలా అప్లికేషన్‌ని తీర్చిదిద్దారు. తరగతి గదిలోని విద్యార్థులందరూ ఆప్‌ను వాడాల్సిన అవసరం లేదు. ఒక్క ఉపాధ్యాయుడి మొబైల్‌లో ఈ ఆప్ ఉంటే చాలు. తొలుత వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఖాతాను ప్రారంభించాలి. ఆ తర్వాత తరగతి గదిలోని విద్యార్థుల వివరాలివ్వాలి. ఇప్పుడు తరగతి గదిలో అడుగుదామనుకుంటున్న ప్రశ్నలు, వాటి సమాధానం కోసం ఆప్షన్స్ నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత వెబ్‌సైట్ నుంచి ఆప్షన్ (సమాధానం) కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇవి క్యూఆర్ కోడ్‌లా ఉంటాయి. ఒక్కో కోడ్‌ను స్కాన్ చేసి విద్యార్థి వివరాలకు యాడ్ చేయాలి. ఏ రెండు కోడ్ కార్డులు ఒకేలా ఉండవు. ఇప్పుడు విద్యార్థులను ప్రశ్న అడగాలి. దానికి వాళ్లు తమ దగ్గరున్న కార్డు ద్వారా సమాధానాలు చెబుతారు. అంటే ఒక్కో సమాధానం కార్డు మీద నాలుగువైపులా అక్షరాలు ఉంటాయి.

తెర వెనుక హ్యాకింగ్



'స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ పగిలి పోయింది... సర్వీస్ సెంటర్‌లో అడిగితే రూ.నాలుగు వేలు అన్నారు... బయట షాపులో వేయించా!' ఇలాంటి మాటలు చాలామంది దగ్గర వింటుంటాం. అయితే తక్కువ డబ్బులతో పని అయిపోతుంది అనుకుంటే మీ 'పని' అయిపోతుంది అంటున్నారు నిపుణులు. థర్డ్ పార్టీ టచ్ స్క్రీన్లతోపాటు మీ మొబైల్‌లో హ్యాకింగ్ దొంగలు వచ్చే అవకాశం ఉందట. ఇజ్రాయిల్‌కు చెందిన బెన్-గురియన్ యూనివర్శిటీ ఆఫ్ నెగెవ్ శాస్త్రవేత్తలు హువాయ్ నెక్సస్ 6పి, ఎల్‌జీ జీ ప్యాడ్ 7.0 పై జరిపిన పరిశోధనలో ఈ విషయం తేలింది. అనధికారికంగా వేసే స్క్రీన్లలో ప్రమాదకర చిప్‌లు అమర్చి మీ ఫోన్, వ్యక్తిగత డేటాను సులభంగా తస్కరించొచ్చుట. కీబోర్డ్ ఇన్‌పుట్స్, ఆప్స్ ఇన్‌స్టాలింగ్, రిమోట్ కమాండ్స్ లాంటి వివరాల్ని ఈ చిప్‌లు రికార్డు చేసి అగంతుకులకు అందిస్తాయి. ఈ విధానాన్ని చిప్ ఇన్ ది మిడిల్ అంటారు.

కంప్యూటర్‌లో ఎలా!

మొబైల్‌లో అక్షరాలను శబ్దాలుగా మార్చి వినిపించే ఆప్‌ల గురించి తెలుసుకున్నాం. సిస్టమ్/ల్యాపీలోనూ అలాంటి సౌకర్యాలు అందించే ఎక్స్‌టెన్షన్లున్నాయి. ఎంచక్కా వెబ్‌సైట్‌లోని ఆంగ్ల సమాచారాన్ని మాటల రూపంలో వినేయొచ్చు. ఎక్స్‌టెన్షన్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత వెబ్‌సైట్‌లో సమాచారాన్ని సెలెక్ట్ చేసుకొని పైన కనిపించే స్పీకర్ ఐకాన్‌ను క్లిక్ చేయండి. అప్పుడు ఆ సమాచారమంతా మీకు వినిపిస్తుంది.



పుస్తకాలు వింటారా

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తుల జీవిత చరిత్రలు, వాళ్ల ప్రసంగాలు చాలావరకు పుస్తకాల రూపంలో ఉన్నాయి. వాటిని చదివే అవకాశం లేని సమయాల్లో అందులోని విషయాన్ని స్పష్టంగా వినేలా కొన్ని ఆప్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఒకటి. వీటిలో కొన్నింటిని ఉచితంగా, మరికొన్నింటిని డబ్బులు చెల్లించి వినొచ్చు. అమెజాన్‌కు చెందిన ఈ ఆప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాక ఒక నెలపాటు ఉచిత సర్వీసులు అందుకోవచ్చు. ఇందులోని ఛానల్స్ విభాగంలోకి వెళ్లి వివిధ అంతర్జాతీయ వెబ్‌సైట్లలోని వార్తలు, సమాచార ఆడియోలను వినొచ్చు.

మేలైన రచనలు

ముఖ్యమైన పుస్తకాలను చదువుదామనుకొని 'అన్నేసి పేజీలు మన వల్ల కాదు' అంటూ ఆగిపోయారా? అయితే మీ కోసమే ఈ ఆప్. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ రచయితలు ఆంగ్లంలో రాసిన 1500లకుపైగా పుస్తకాల్లోని ముఖ్యమైన అంశాల్ని చిరు వ్యాసాలుగా అందించారు. ఇందులోని విషయాన్ని చదువుకోవచ్చు, వినొచ్చు కూడా. ప్రతి కథనాన్ని ఓపెన్ చేయగానే దాని ప్రాథమిక విషయం, దాన్ని వినడానికి పట్టే సమయం లాంటి వివరాలు కనిపిస్తాయి. వాటిని చూసుకొని వ్యాసం మీద క్లిక్ చేస్తే ఎంచక్కా వినేయొచ్చు. సగం విని ఆపేసిన పుస్తకాల వివరాలు లైబ్రరీ ట్యాబ్‌లో ఉంటాయి.

ఆడియోల ఖజానా




వార్తలు చదువుకోవడానికి వెబ్‌సైట్లు ఉన్నట్లే... వినిపించడానికి పాడ్‌కాస్ట్‌లున్నాయి. ప్రపంచవ్యాప్త సమాచారాన్ని, ముఖ్యమైన అంశాలపైన వ్యాసాల ఆడియోలను ఈ పాడ్‌కాస్ట్‌లో పొందొచ్చు. మ్యూజిక్ ప్లేయర్‌లా ఉండే ఈ ఆప్‌ను ఆడియోల బ్రౌజర్ అనుకోవచ్చు. వీటిలో చాలా రకాలున్నాయి. వాటిలోకి వెళ్లి సమాచార ఆడియో ఫైల్స్‌ను పొందొచ్చు. వెబ్‌సైట్ యూఆర్‌ఎల్‌ను యాడ్ చేసుకోవడం ద్వారా కూడా పాడ్‌కాస్ట్ వాడుకోవచ్చు.

సరదాలే కాదు

యూట్యూబ్ అనగానే పాటల వీడియోలు, వినోద సన్నివేశాలు, లైవ్ వార్తలు మాత్రమేనా? ఇంకా చాలా పనులు చేయొచ్చు. ఉన్నత విద్య అభ్యసించేవారి కోసం, కొత్త భాష నేర్చుకునే వారి కోసమూ యూట్యూబ్ ఉపయోగపడుతుంది. దీని కోసం యూట్యూబ్‌లో రకరకాల ఛానల్స్ ఉన్నాయి. ఆంగ్లంలోనే కాదు, తెలుగులోనూ సమాచారం పొందొచ్చు. ఏదైనా అంశానికి సంబంధించి సమాచారం కోసం సెర్చ్ బార్‌లో వెతికితే వేల కొద్దీ వీడియోలు, వందల ఛానల్స్ కనిపిస్తాయి. వాటిని ప్లే చేసి సమాచారాన్ని వింటూ, చూస్తూ తెలుసుకోవచ్చు. ఉదాహరణకు ఖాన్ అకాడెమీ ఛానల్‌లోకి వెళ్తే వివిధ తరగతుల పాఠాలు వీడియోల రూపంలో ఉంటాయి.

మనసెరిగే గ్యాడ్జెట్‌లు




మనలో చాలా మంది ల్యాపీని ముందేసుకుని ఏళ్ల తరబడి సహవాసం చేస్తుంటారు. కానీ, ఎప్పుడైనా ల్యాపీతో ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారా? పరికరాలతో అంతలా మమేకం అయ్యేంత సీన్ ఉంటుందా? అనుకుంటే ఇక మీదట పొరబాటే అవుతుంది. ఎందుకంటే భవిష్యత్‌లో ఒడిలో పెట్టుకుని పని చేసే ల్యాపీ మీరు హ్యాపీగా ఉన్నారో... లేదో... మీ ముఖం చూసి పసిగట్టేస్తుంది. మీకు ఇష్టమైన పాట ప్లే చేస్తుంది. మంచి జోక్‌ని నోటిఫికేషన్ రూపంలో తెరపైకి తెచ్చి నవ్వించే ప్రయత్నం చేస్తుంది. ఇదే మాదిరిగా నిత్యం చేతిలో ఉండే స్మార్ట్‌ఫోన్, ఇంట్లో వెలిగే స్మార్ట్ బల్బ్‌లు... మీరున్న మానసిక స్థితిని గుర్తించి అందుకు తగినట్టుగా స్పందించేందుకు సిద్ధం అవుతున్నాయ్. 'ఎఫెక్టివ్ కంప్యూటింగ్' వేదికగా ఈ రకమైన అద్భుతాల్ని రాబోయే రోజుల్లో పరిచయం చేసేందుకు పలు కంపెనీలు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. కేవలం ముఖ కవళికల్నే కాదు, శరీర హావభావాలు, ఇతర చర్యల్ని గమనిస్తూ మానసిక స్థితిని అర్థం చేసుకోనున్నాయి. ఏడాది కాలంగా కృత్రిమ మేధస్సులో (ఏఐ) వస్తున్న ఆధునిక మార్పులు బిగ్ డేటా, రోబోటిక్స్, మెషిన్ లెర్నింగ్‌తో గ్యాడ్జెట్‌లు గుట్టుచప్పుడు కాకుండా మనపై ఓ కన్నేస్తాయనడంతో ఎలాంటి సందేహం లేదు! హెల్త్‌కేర్, చదువు, రవాణా రంగాల్లో పలు మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఉదాహరణకు ఎఫెక్టివ్ కంప్యూటింగ్‌ని నిక్షిప్తం చేసిన కార్లు డ్రైవర్లను ఓ కంట కనిపెడతాయి. ఏ మాత్రం నిద్రలేమితో కునుకు తీసే అవకాశం ఉన్నట్లు కనిపిస్తే చాలు. గమనించి అలెర్ట్ చేస్తూ సురక్షితంగా గమ్యం చేరేలా సాయపడుతుంది.

గూగుల్ గ్లాస్ కావాలా?




వర్చువల్ రియాలిటీ గ్లాస్, ఆగ్యుమెంటడ్ రియాలిటీ గ్లాస్ అంటూ ఈ మధ్య కొన్ని గ్లాసెస్ వస్తున్నాయి. అయితే నాలుగేళ్ల క్రితమే గూగుల్ నుంచి ఈ తరహా గ్లాసెస్ వచ్చాయి. గూగుల్ గ్లాసెస్ పేరుతో ఓ చిన్న సైజు కంప్యూటర్‌ను తీసుకొచ్చారు. కళ్లజోడులా ఉండే దీంట్లో ఓ చిన్న గ్లాస్, ఆండ్రాయిడ్ తరహా ఓఎస్, బ్యాటరీ ఉంటాయి. వాటితో ఇది స్మార్ట్‌ఫోన్‌లా పని చేస్తుందన్నమాట. అయితే ఆ తర్వాత రోజుల్లో దీని వినియోగం బాగా తగ్గిపోవడంతో అమ్మకాలు నిలిపేశారు. ఇప్పుడు మళ్లీ ఈ గ్లాసెస్ అమ్మకాలు విదేశాల్లో మొదలయ్యాయి.

స్మార్ట్ మౌస్ వస్తోంది



ఒకేసారి ట్యాబ్, సిస్టమ్‌కు వాడుకునే అవకాశం ఉన్న కీబోర్డులు చూశాం. ఇప్పుడు ఒకేసారి రెండు సిస్టమ్స్‌ను ఆపరేట్ చేయగలిగే మౌస్ వచ్చింది. జియామీ సంస్థ ఈ పోర్టబుల్ మౌస్‌ను ఇటీవల చైనాలో విడుదల చేసింది. బ్లూటూత్ సాంకేతికతతో పని చేసే ఈ మౌస్... విండోస్ 7 ఆపైన ఆపరేటింగ్ సిస్టమ్స్ కంప్యూటర్లకు మాత్రమే పని చేస్తుంది. ఈ మౌస్‌పైన ఉన్న చిన్న బటన్‌ను ప్రెస్ చేయడం ద్వారా వాడుతున్న సిస్టమ్‌ను ఎంచుకోవచ్చు. దీని ధర సుమారు రూ. 1000. త్వరలో అంతర్జాతీయ మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు.



గూగుల్ బడ్స్

యాపిల్ ఎయిర్‌పాడ్స్‌కి దీటుగా గూగుల్ 'పిక్సల్ బడ్స్'ని అందుబాటులోకి తేనుంది. అయితే, ఇవి పూర్తిస్థాయి వైర్‌లెస్ బడ్స్ కానప్పటికీ కొన్ని ప్రత్యేక సౌకర్యాలతో టెక్ అభిమానుల మనసుల్ని దోచుకుంటోంది. ఆకట్టుకునే మ్యూజిక్ సిస్టంతో పాటు... 'రియల్‌టైమ్ ట్రాన్స్‌లేషన్'సౌలభ్యం ఉంది. మీకు అర్థంకాని భాష అనువాదానికి కుడివైపు 'బడ్'ని తాకి అదిమి ఉంచితే చాలు. 'గూగుల్ అసిస్టెంట్' అందుబాటులోకి వచ్చి అనువాదం చేసి వినిపిస్తుంది.

మాటల్లేవ్.. పాటలే



జోరు వర్షంలో బ్లూటూత్ స్పీకర్‌లో పాటలు వింటూ డ్యాన్స్ చేస్తే బాగుంటుంది కదా! ఎలా కుదురుతుంది.. నీళ్ల పడి స్పీకర్ పాడైపోతుంది కదా అంటారా? మామూలు స్పీకర్లు అయితే మీరన్నది కరక్టే. అదే 'బియె ౹ాప్లే పీ2' బూ ౹టూత్ స్పీకర్ వాడితే ఆ ఇబ్బందేం ఉండదు. అల్యూమినియం, లెదర్‌తో తయారు చేసిన ఈ స్పీకర్ వాటర్ రెసిస్టెంట్. అంతేకాదు దీనికి బటన్‌లు కూడా ఉండవు. పాటలు ప్లే అవ్వాలన్నా, ఆగాలన్నా స్పీకర్‌పై ఒకసారి తడితే సరి. పాటల్ని మార్చాలనుకుంటే షేక్ చేస్తే సరి. దీని అనుబంధ ఆప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని దాంతో యాక్సెస్ చేయొచ్చు. ఒకసారి ఫుల్ ఛార్జ్ చేసుకుంటే పది గంటలపాటు దీన్ని వాడుకోవచ్చు.



కుల్‌దీప్, చాహల్ ఫామ్‌లో ఉంటే...

ఇండియాను ఎవరూ ఓడించలేరు

మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ

కోల్‌కతా: మణికట్టు స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్ వల్ల భారత క్రికెట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. గత హోం సీజన్ నుంచి వీళ్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తున్నారు. కానీ సీమ్ బౌలర్లకు సహకరించే సౌతాఫ్రికా పిచ్‌లపై మణికట్టు స్పిన్నర్లు ఆధిపత్యం ప్రదర్శించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ వన్డే సిరీస్‌లో సౌతాఫ్రికా జట్టు కోల్పోయిన 43 వికెట్లలో చాహల్, కుల్‌దీప్ 30 వికెట్లు తీసుకున్నారు. ఐదు మ్యాచ్‌ల్లో వీరిద్దరూ 70 శాతం ప్రత్యర్థి జట్టును దెబ్బతీశారు. 'వాళ్ల బౌలింగ్ అసాధారణం. బంతి స్పిన్ అయ్యే పిచ్‌లపైనే కాదు ఒక మంచి పిచ్‌పై కూడా వికెట్లు తీయగలరు. ఇది ఇద్దరికీ శుభపరిణామం. వాళ్లు ఇలాగే వికెట్లు తీస్తూ ఉంటే టీమిండియాను ఎవరూ ఓడించలేరు' అని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నారు.

క్రికెట్ వద్దు.. పెళ్లే ముద్దు

ఐపీఎల్‌కు డుమ్మా కొట్టనున్న ఆరోన్ ఫించ్



మెల్‌బోర్న్: ఎడతెరిపిలేని మ్యాచ్‌లు క్రికెటర్ల మనసుపై మాత్రమే కాకుండా వారి శరీరాలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. అంతేకాదు జీవితంలో ఎంతో ముఖ్యమైన పెళ్లితో పాటు వ్యక్తిగత వ్యవహారాల కోసం సమయం కేటాయించడం కూడా క్రికెటర్లకు కష్టతరమైంది. ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్న ఆస్ట్రేలియా క్రికెటర్ ఆరోన్ ఫించ్ పెళ్లికే ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో కింగ్స్ లెవెన్ పంజాబ్‌కు ఎంపికైన ఆరోన్ ఫించ్ 8వ తేదీన ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌కు డుమ్మా కొట్టనున్నాడు. ఎందుకంటే 7వ తేదీన అతని పెళ్లి ఉంది. ఫించ్ పెళ్లి కారణంగా గ్లెన్ మాక్స్‌వెల్ కూడా తన తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఐపీఎల్ కొత్త షెడ్యూల్ గురించి తెలీదని.. ఏప్రిల్ 15న ప్రారంభమవుతుందని గతంలో చెప్పారని ఫించ్ అన్నాడు. దీంతో 7వ తేదీన పెళ్లి పెట్టుకున్నానని వివరించాడు. 'ఈ రోజు (శుక్రవారం) ఉదయం ఐపీఎల్ షెడ్యూల్ చూశాను. పెళ్లిని వాయిదా వేసే అవకాశం లేదు. రెండో మ్యాచ్ 13వ తేదీన ఉంది కాబట్టి అప్పటి వరకు ఇండియాకు వచ్చేస్తాను. అదృష్టవశాత్తు ఒక్క మ్యాచ్‌కే దూరమవుతున్నాను' అని ఫించ్ చెప్పినట్టు ఓ వెబ్‌సైట్ పేర్కొంది. మరోవైపు ఆస్ట్రేలియాకే చెందిన మరో ఆటగాడు జార్జ్ బెయిలీ కూడా ఐపీఎల్‌కు బదులుగా తన కుటుంబ సభ్యులతో గడిపేందుకే ఇష్టపడ్డాడు. భార్య కేతీ ఏప్రిల్ చివర్లో రెండో బిడ్డకు జన్మనిచ్చే అవకాశమున్నందున బెయిలీ ఐపీఎల్ వేలం పాటకు తన పేరు ఇవ్వలేదు.

వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌కు

నేపాల్ అర్హత



న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరగనున్న క్రికెట్ వరల్డ్ కప్-2019 క్వాలిఫయింగ్ టోర్నీకి నేపాల్ జట్టు అర్హత సాధించింది. దీంతో నేపాల్ కెప్టెన్ పరాస్ ఖడ్కా స్వరం ఆనందంతో మూగబోయింది. ఏం మాట్లాడాలో తెలియలేదని ఖడ్కా అన్నాడు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో కెనడాను నేపాల్ ఓడించి క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత సాధించింది. వరల్డ్ క్రికెట్ లీగ్ డివిజన్-2 గ్రూప్ దశ టోర్నీ చివరి రోజు నేపాల్ గెలిచింది. 'మాట్లాడలేకపోతున్నా. చివరి వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. క్రికెట్ గెలిచింది. కెనడా జట్టు గురించి చింతిస్తున్నా. కానీ ఎప్పుడో ఒకసారి ఇలాంటి అవకాశం వస్తుంది. చాలా ఏళ్లుగా ఎంతో శ్రమిస్తున్నాం. అన్ని పరిస్థితులు అనులించడంతో మేము క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత పొందాం. నా వద్ద మాటల్లేవు' అని ఖడ్కా చెప్పాడు. వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ గ్రూప్-ఎలో పపువా న్యూ జెనీవా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, రెండుసార్లు చాంపియన్‌గా నిలిచిన వెస్టిండీస్‌తో తలపడుతుంది. గ్రూప్-బిలో యూఏఈ, జింబాబ్వే, ఆఫ్ఘనిస్థాన్, స్కాట్లాండ్, హాంకాంగ్ జట్లు ఆడతాయి.

మణికట్టు స్పిన్నర్లను ఎదుర్కొనేంత అనుభవం లేదు: జాక్వెస్ కల్లిస్



భారత మణికట్టు స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తమ బ్యాట్స్‌మెన్ ఎందుకు అంత ఇబ్బంది పడుతున్నారో సౌతాఫ్రికా ఆల్ రౌండర్ జాక్వెస్ కల్లిస్ వివరించారు. తమ బ్యాట్స్‌మన్ దేశవాళీ క్రికెట్‌లో అటువంటి బౌలర్లను ఎదుర్కోలేదన్నారు. ఆరు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో చాహల్ (14), కుల్‌దీప్ (16) 30 వికెట్లు తీసుకోవడంతో టీమిండియా తిరుగులేని 4-1 ఆధిక్యాన్ని సంపాదించింది. 'ఒక మంచి లెగ్ బ్రేక్ బౌలర్లను అధ్యయనం చేసి ఆడేందుకు మరికొంత సమయం పడుతుంది. మాకు ప్రపంచ శ్రేణి లెగ్ స్పిన్నర్లు లేరన్న విషయాన్ని అంగీకరిస్తున్నాను. మా జట్టులోని యువకులు నేర్చుకునేందుకు ఇది మంచి అవకాశం. మేము కూడా ఇలాంటి దశను ఎదుర్కొన్నాం. సరైన సమయానికి మేము కూడా పాఠాలు నేర్చుకున్నాం' అని కల్లిస్ అన్నారు. షేన్ వార్న్, అనిల్ కుంబ్లేల బౌలింగ్‌ను కూడా ఎదుర్కొనేందుకు సరైన టెక్నిక్ ఉన్న బ్యాట్స్‌మెన్ లేరని చెప్పారు. 'అనుభవమనేది ఎవరికైనా కీలకమవుతుంది. లెగ్ బ్రేక్ బౌలింగ్‌ను అధ్యయనం చేయడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి బంతి విడుదలయ్యే మణికట్టు నుంచి.. లేదా బంతి పిచ్ పడేంత వరకు వేచి చూడటం. ఏ ఇద్దరు బ్యాట్స్‌మెన్ ఒకే టెక్నిక్‌ను ఉపయోగించలేరు. అంతర్జాతీయ క్రికెట్ ఎక్కువగా ఆడిన వారికి ఏది ఉత్తమమైందో తెలుస్తుంది. ఇబ్బందుల నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరు తమ సొంత మెకానిజమ్‌ను తయారు చేసుకుంటారు' అని కల్లిస్ వివరించారు.



పరువు కోసం ప్రాక్టీస్

నేడు ఇండియా, సౌతాఫ్రికా మధ్య ఆరో వన్డే

సాయంత్రం 4-30 గంటలకు సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం



5-1పై కోహ్లా సేన దృష్టి

సెంచూరియన్: ఇప్పటికే చారిత్రాత్మక వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా ఇక 5-1తో సిరీస్‌ను గెలుచుకోవడంపై దృష్టిసారించింది. శుక్రవారమిక్కడ సౌతాఫ్రికాతో జరగనున్న చివరి, ఆరో వన్డేలో రిజర్వ్ ఆటగాళ్లతో బరిలోకి దిగే అవకాశముంది. ఆరు మ్యాచ్‌ల ఈ వన్డే సిరీస్‌ను మెన్ ఇన్ బ్లూ 4-1తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. డర్బన్, సెంచూరియన్, కేప్‌టౌన్, పోర్ట్ ఎలిజబెత్ వేదికల్లో గెలిచిన టీమిండియా పోర్ట్ ఎలిజబెత్ వన్డేలో ఓటమిపాలైంది. ఐదో వన్డలో గెలవడంతో టీమిండియా ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో సౌతాఫ్రికా నుంచి నంబర్ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. ఈ సిరీస్ ఆరంభంలో సౌతాఫ్రికా టాప్ ర్యాంక్‌లో ఉండింది. ఇప్పటికే సిరీస్‌ను గెలవడంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు అదే జోరును కొనసాగించాలని టీమిండియా కృత నిశ్చయంతో ఉంది. అయితే ఈ నామమాత్రపు వన్డేలో టీమిండియా సమతుల్యమైన జట్టుతో బరిలోకి దిగే అవకాశముంది. సుదీర్ఘమైన విదేశీ షెడ్యూల్ ఉన్న కారణంగా కొంత మంది ఆటగాళ్లకు ఈ వన్డేకు విశ్రాంతినివ్వనున్నారు.

శ్రీలంక పర్యటన నుంచి భువనేశ్వర్ కుమార్ వరుసగా వన్డే మ్యాచ్‌లు ఆడుతూనే ఉన్నాడు. సౌతాఫ్రికా పర్యటనలో రెండు టెస్టులతో పాటు 19 వన్డేలు, 6 టీ20లు ఆడాడు. జస్‌ప్రీత్ బుమ్రా కూడా శ్రీలంక పర్యటన నుంచి 20 వన్డేలు, 8 టీ20ల్లో పాల్గొన్నాడు. అంతేకాకుండా సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌లోనూ ఆడి మరింత వర్క్‌లోడ్‌ను తనపై వేసుకున్నాడు. ఈ నేపథ్యంలో మున్ముందు జరగనున్న టోర్నీల కోసం వీరిద్దరికీ విశ్రాంతినివ్వనున్నారు. దీంతో రెండో శ్రేణి పేస్ బౌలర్లు బరిలోకి దిగనున్నారు. శ్రీలంక టూర్ నుంచి ఇప్పటి వరకు మెన్ ఇన్ బ్లూ 20 వన్డేలు ఆడారు. బెంగళూరులో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డేలో మాత్రమే భువ నేశ్వర్,



బుమ్రా ఆడలేదు. ఒకవైపు చూస్తే లిమిటెడ్ ఓవర్ల క్రికెట్‌లో వీరిద్దరు అసాధారణ ప్రతిభ కనబరిచారు. మరోవైపు టీమిండియా వీరిద్దరిపైనే ఎక్కువగా ఆధారపడింది. 2019 వరల్డ్ కప్‌కు ప్రధాన జట్టును సిద్ధం చేసుకునే నేపథ్యంలో ఒకవేళ వీళ్లకు గాయాలైతే జట్టును ఎవరు ఆదుకుంటారన్న బ్యాకప్ ఆప్షన్ కోసం చివరి వన్డేలో రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లను బరిలోకి దింపనున్నారు. 2015 వరల్డ్ కప్ తర్వాత మహ్మద్ షమీ కేవలం మూడు వన్డేలు ఆడాడు. గాయం నుంచి కోలుకుని మళ్లీ క్రికెట్‌కు అందు బాటులోకి వచ్చిన షమీ 2017లో వెస్టిండీస్‌తో రెండుసార్లు, ఆస్ట్రేలియాతో ఒకసారి ఆడాడు.

ప్రస్తుత జట్టులో నాలుగో పేస్ బౌలర్‌గా ఉన్న షార్దూల్ ఠాకూర్‌కు రెండు వన్డేల అనుభవం మాత్రమే ఉంది. అంతే భారత్‌కు పటిష్టమైన రెండో పేస్ బౌలింగ్ లేదని స్పష్టంగా అర్థమవుతోంది. భువనేశ్వర్, బుమ్రాలు విజయవంతంగా రాణిస్తున్నప్పటికీ అత్యవసరంగా రిజర్వ్ బెంచ్‌ను పదును పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దృష్టి పెట్టాల్సిన మరో ఏరియా మిడిలార్డర్. సౌతాఫ్రికాతో సిరీస్‌లో 4 నుంచి 7 స్థానాలకు ఆడిన క్రికెటర్లు ఒక్క అర్ధ సెంచరీ చేశారు. డర్బన్‌లో అజింక్య రహానే సత్తా చాటిన తర్వాత వాండరర్స్‌లో ధోనీ ఒక్కడే అర్ధ సెంచరీకి (43 బంతుల్లో 42 పరుగులు) చేరువగా వచ్చాడు. మరోవైపు శ్రేయాస్ అయ్యర్ రెండు మ్యాచ్‌ల్లో బ్యాటింగ్ చేశాడు. కానీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేడు. 4వ నంబర్ బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగిన రహానే విఫలమయ్యాడు. హార్దిక్ పాండ్యా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 26 పరుగులు చేశాడు. దీనికంతటికి స్లో పిచ్‌లే కారణమని చెప్పొచ్చు. సౌతాఫ్రికాతో సిరీస్‌లో టాపార్డర్ అద్భుతంగా ఆడుతోంది. ప్రతి మ్యాచ్‌లో 30 నుంచి 35 ఓవర్ల వరకు ఆడుతున్నారు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు సౌతాఫ్రికా డెత్ బౌలింగ్ ఒక్కటే ఆకట్టుకుంది. ఏదిఏమైనా మిడిలార్డర్‌పై టీమిండియా ఎక్కువగా దృష్టి సారించాల్సివుంది. ఈ నేపథ్యంలో మనీష్ పాండే లేదా దినేష్ కార్తీక్‌లలో ఎవరికో ఒకరికి తుది జట్టులో చోటు దక్కే అవకాశముంది. గురువారం టీమిండియా నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొనలేదు. సుదీర్ఘమైన, ఎడతెరిపిలేని పర్యటన కారణంగా కోహ్లీ సేన విశ్రాంతి తీసుకుంది. మరోవైపు సౌతాఫ్రికా జట్టు చివరి వన్డేలో గెలిచి టీ20 సిరీస్‌కు వెళ్లాలని పట్టుదలగా ఉంది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆదివారం జరగనున్న తొలి మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. టీమిండియా పర్యటన ముగిసిన తర్వాత ఆస్ట్రేలియా జట్టు రానుండడంతో చివరి వన్డేకు ప్రధాన బౌలర్లకు విశ్రాంతినిచ్చారు. రెండో వన్డేలో మాదిరిగానే సెంచూరియన్ పిచ్ చివరి వన్డేలోనూ టీమిండియాకు సహకరిస్తుందా? లేక మరోలా ఉంటుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

భారత బాక్సర్లకు 5 పతకాలు

ఆసియా గేమ్స్ టెస్ట్ ఈవెంట్



జకార్తా: ఆసియా గేమ్స్ టెస్ట్ ఈవెంట్‌లో భారత బాక్సర్లు బలమైన పంచ్ విసిరి ఐదు స్వర్ణ, ఒక రజత, నాలుగు కాంస్య పతకాలను గెలిచారు. ఇండియా ఓపెన్ స్వర్ణ పతక విజేత మనీష్ కౌశిక్ (60 కిలోల కేటగిరి) మరో పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఫైనల్లో మనీష్ 5-0తో జపాన్‌కు చెందిన ఎంటారో కిమురను చిత్తు చేశాడు. మహిళల విభాగంలో స్వర్ణం గెలిచిన ఏకైక బాక్సర్‌గా పవిత్ర (60 కిలోలు) నిలిచింది. మనీష్‌తో పాటు మూడుసార్లు కింగ్స్ కప్ బంగారు పతక విజేత కె. శ్యామ్ కుమార్ (49 కిలోలు), షేక్ సల్మాన్ అన్వర్ (52 కిలోలు), ఆశిష్ (64 కిలోలు) పసిడి పతకాలను కైవసం చేసుకున్నారు. తొలుత పవిత్ర భారత్‌కు పతకాన్ని సాధించింది. ఫైనల్లో పవిత్ర 5-0తో థాయ్‌లాండ్ నిలవాన్ టెకాస్యుప్‌ను చిత్తు చేసింది. తర్వాత కె. శ్యామ్ కుమార్ పోరులో న్యాయ నిర్ణేతలు రెండు అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఈ పోరులో శ్యామ్ కుమార్ 4-1తో మారియో బ్లాసియస్ కలిపై గెలిచాడు. మరో పోరులో సల్మాన్ అన్వర్ 5-0తో ఫిలిప్పినో రోజెన్ లాడన్‌ను చిత్తు చేశాడు. మహిళల విభాగం ఫైనల్లో శశి చోప్రా (57 కిలోలు) 0-5తో థాయ్‌లాండ్‌కు చెందిన రచడపోర్న్ సవాటా చేతిలో ఓటమిపాలై రజతంతో సంతృప్తి చెందింది. ఇక చివరిగా మహ్మద్ ఎటాష్ ఖాన్ (56 కిలోలు), రితు గ్రెవాల్ (51 కిలోలు), పవన్ కుమార్ (69 కిలోలు), ఆశిష్ కుమార్ (75 కిలోలు) సెమీఫైనల్ పోరుల్లో ఓటమిపాలై కాంస్య పతకాలను చేజిక్కించుకున్నారు.

పాక్ హాకీ జట్టు భారత్ రాక

నవంబర్‌లో వరల్డ్ కప్



న్యూఢిల్లీ: హాకీ వరల్డ్ కప్‌లో పాల్గొనేందుకు పాకిస్థాన్ జట్టు భారత్‌కు రానుంది. ఇరు దేశాల మధ్య రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో పాక్ జట్టు భారత్‌కు వచ్చే అవకాశం లేదన్న పుకార్లకు దీంతో తెరపడింది. భారత్ చివరిసారిగా 2010లో హాకీ వరల్డ్ కప్‌కు ఆతిథ్యమిచ్చింది. ఆ టోర్నీలోనూ పాకిస్థాన్ జట్టు పాల్గొనింది. 2014లో నెదర్లాండ్స్‌లో జరిగిన వరల్డ్ కప్‌కు పాకిస్థాన్ జట్టు అర్హత సాధించలేకపోయింది. మళ్లీ ఇప్పుడు పాల్గొనబోతుండడం పాకిస్థాన్ జట్టుకు, ఆసియా హాకీకి పాజిటివ్ సంకేతాలను ఇచ్చింది. లండన్‌లో జరిగిన హాకీ వరల్డ్ లీగ్ సెమీఫైనల్స్‌లో ఏడో స్థానంలో నిలవడం ద్వారా పాకిస్థాన్ జట్టు వరల్డ్ కప్‌కు అర్హత సాధించింది. వరల్డ్ కప్ టోర్నీ ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరగనుంది. సొంత గడ్డపై జరగనున్న ఈ టోర్నీలో సత్తా చాటాలని భారత జట్టు భావిస్తోంది. 1975లో స్వర్ణం గెలిచిన భారత జట్టు ఆ తర్వాత పసిడి పతకాన్ని గెలవలేకపోయింది. మరోవైపు హాకీ వరల్డ్ కప్ చరిత్రలో పాకిస్థాన్‌కు అత్యంత విజయవంతమైన జట్టుగా పేరుంది. రికార్డు స్థాయిలో పాకిస్థాన్ నాలుగుసార్లు విజేతగా నిలిచింది. అంతేకాకుండా రెండోసార్లు రన్నరప్‌గా నిలిచి రజత పతకాన్ని గెలిచింది. 1971, 1978, 1982, 1994లలో పాక్ జట్టు ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. కాగా నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా జట్లు మూడేసిసార్లు టైటిల్‌ను గెలిచాయి.



జాతీయ హాకీ జట్టుకు ఐదేళ్లు స్పాన్సర్‌గా ఒడిషా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా గురువారం పురుషులు, మహిళల జట్ల కెప్టెన్లు మన్‌ప్రీత్ సింగ్, రాణి రాంపాల్‌లతో ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

అనుబంధ సంస్థలకు బీసీసీఐ హెచ్చరిక

సుదమ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనొద్దని లేఖ



న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తన అనుబంధ సంస్థలను హెచ్చరించింది. అనుమతి లేని 'సుదమ ప్రీమియర్ లీగ్'లో తమ క్రికెటర్లు పాల్గొనకుండా చర్యలు తీసుకోమని లేఖ రాసింది. టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్, ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) సీనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అతుల్ వాసన్ సమక్షంలో ఈ టోర్నీ ఆవిష్కృతమైంది. ఎన్‌జీవో సంస్థ ప్రసార్ ఈ టోర్నీ నిర్వహణకు శ్రీకారం చుట్టింది. మాజీ క్రికెటర్ సంజీవ్ శర్మ, అంతర్జాతీయ మాజీ అంపైర్ కె. హరిహరణ్‌కు కూడా ఈ టోర్నీతో సంబంధాలున్నాయి. నిజానికి ఈ టోర్నీ ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్ల మైదానంలో జరగాల్సివుండింది. కానీ బీసీసీఐ అనుమతించకపోవడంతో ఆతిథ్యమిచ్చేందుకు కోట్ల నిరాకరించింది. సుదమ ప్రీమియర్ లీగ్‌లో తమ క్రికెటర్లు పాల్గొనకుండా చర్యలు తీసుకోమని అనుబంధ సంస్థలకు బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి లేఖ రాశారు. 'సుదమ ప్రీమియర్ లీగ్‌కు బీసీసీఐ అనుమతి లేదని మీ దృష్టికి తీసుకురాలనుకుంటున్నాను. ఈ విషయాన్ని రిజిస్టర్డ్ ప్లేయర్స్‌కు, మ్యాచ్ అధికారులకు, స్కోరర్లకు, వీడియో అనలిస్ట్‌లకు తెలియజేయండి' అంటూ చౌదరి తన లేఖలో పేర్కొన్నారు. సుదమ లీగ్‌లో అనుబంధంపై వాసన్ స్పందిస్తూ.. 'బీసీసీఐ లేఖ గురించి నాకు తెలీదు. నిర్వాహకులకు సహాయం చేయాలని మాత్రమే ప్రయత్నిస్తున్నాను. ఈ టోర్నీకి బీసీసీఐ అనుమతి లేకపోతే ఖచ్చితంగా నేను దూరంగా ఉంటాను' అని అన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.